మరవరాని మన చరిత్ర
రూ॥40/-
పేజీలు:40

నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్),
హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(ఆబిడ్స్),హిమాయత్‌నగర్,
కొండాపూర్, బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్
హన్మకొండ.

www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★

నిబద్ధత కలిగిన మిలిటెంట్ నాయకుడిని కోల్పోవడం బాధాకరం

ఫాసిస్టు వ్యతిరేక పోరాటాలను ఉధృతం చేయాలి

అట్టహాసంగా ప్రజాపాలన... ప్రజావిజయోత్సవాల ముగింపు వేడుకలు

లోపలి పేజీల్లో

సంపుటి 08, సంచిక: 12 | ఆదివారం | 08-12-2024 | మహబూబ్‌నగర్ Published from: Mahabubnagar, Hyderabad, Khammam, Karimnagar పేజీలు: 12 | వెల రూ. 5.00





## ఫ్లోరైడ్ బాధిత నల్లగొండకు

# స్వరాష్ట్రంలోనూ కలగని విముక్తి

ఉమ్మడి రాష్ట్రంలో... కెసిఆర్ పాలనలోనూ జిల్లాకు తీరని అన్యాయం

మూసీని ప్రక్షాళన చేసి తీరుతాం

సంక్రాంతి తరువాత రైతు భరోసా

గెలిస్తే ఉప్పొంగడం... ఓడిపోతే ఫాం హౌస్‌లో పడుకోవడం....

నల్లగొండ బహిరంగ సభలో సిఎం రేవంత్‌రెడ్డి



నల్లగొండ జిల్లా దామరచర్ల మండలంలో నిర్మిస్తున్న యాదాద్రి థర్మల్ ప్రాజెక్ట్‌లోని రెండవ విద్యుత్ ప్లాంట్ జాతికి అంకితం

బ్రాహ్మణవెల్లెంల ప్రాజెక్టు పైలాన్‌ను ఆవిష్కరించిన సిఎం రేవంత్‌రెడ్డి



ప్రజాపక్షం/నల్లగొండ ప్రతినిధి

నల్లగొండ ప్రజలకు గోదావరి జలాలను అందించేందుకు మూసీ ప్రక్షాళన చేసి తీరుతాం.. ప్రక్షాళనకు ఎవరైనా అడ్డుపడితే వారి సంగతి నల్లగొండ జిల్లా ప్రజలు చూసుకోవాలి. మూసీ ప్రక్షాళన చేసి నల్లగొండకు విముక్తి కలిగించే బాధ్యత తనదే అని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి ఉద్ఘాటించారు. జిల్లాలో శనివారం పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేసిన అనంతరం ఎస్‌ఎల్‌బిసిలోని ప్రభుత్వ మెడికల్ కళాశాలను ప్రారంభించి ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ప్రసంగించారు. సంవత్సరం క్రితం డిసెంబర్ 7,2023 న హైదరాబాద్ లోని ఎల్‌బి స్టేడియంలో తెలంగాణ ప్రజల ఆశీర్వాదంతో ఇందిరమ్మ రాజ్యం ప్రజా ప్రభుత్వం ప్రమాణ స్వీకారం చేయడం జరిగిందన్నారు. చరిత్రలో 2 జూన్,2014కు ఎంత ప్రాధాన్యత ఉందో డిసెంబర్ 7,2023కు, డిసెంబర్ 7, 2024 కు అంతే ప్రాధాన్యత ఉందన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో ఫ్లోరైడ్ మహమ్మారితో బాధ పడిన నల్లగొండ జిల్లాకు స్వరాష్ట్రంలో కూడా విముక్తి కలగలేదని అన్నారు. ఉమ్మడి ఆంధ్రరాష్ట్రంలో వెనుకబడినట్లుగానే కెసిఆర్ పాలనలో కూడా నల్లగొండ అన్యాయానికి గురైందని గుర్తుచేశారు. ఫ్లోరైడ్ విముక్తి కోసం ఆనాడు వైఎస్ రాజశేఖర్‌రెడ్డి బ్రాహ్మణ వెల్లంల ప్రాజెక్టు ప్రారంభిస్తే కెసిఆర్ దానిని నిర్లక్ష్యం

తరువాయి 2లో



## చెరువులోకి దూసుకెళ్లిన కారు

### ఐదుగురు యువకులు దుర్మరణం
### యాదాద్రి జిల్లాలో ఘటన

ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి

యాదాద్రి జిల్లా భూదాన్‌పోచంపల్లి మండలంలోని శివారు గ్రామం జలాల్పురంలో చెరువు కట్ట వద్ద కారు ఘోర రోడ్డు ప్రమాదానికి గురై అదుపు తప్పి చెరువులో పడి ఐదుగురు దుర్మరణం పాలైన ఘటన శనివారం ఉదయం చోటుచేసుకుంది. స్థానిక ఎస్సై

తరువాయి 2లో

## మహబూబ్‌నగర్‌లో భూకంపం

### రిక్టర్ స్కేల్‌పై 3.0 తీవ్రత

**మహబూబ్‌నగర్ :** రాష్ట్రంలో మరోసారి భూమి కంపించింది. సరిగ్గా మధ్యాహ్నం 12 గంటల 15 నిమిషాలకు మహబూబ్‌నగర్ జిల్లా కౌకుంట్ల మండల పరిధిలోని దాసరిపల్లి కేంద్రంగా పలుచోట్ల భూ ప్రకంపనలు వచ్చాయి. రిక్టర్ స్కేలుపై 3.0 తీవ్రత నమోదైంది. భూమి లోపల సుమారు 10 కిలోమీటర్ల లోతున భూకంపం వచ్చినట్లుగా నేషనల్ ఫర్ సిస్మోలజీ అధికారులు వెల్లడించారు. దాసరిపల్లి గ్రామ సమీపంలోని ఓ మామిడి తోట దగ్గర ఏర్పాటు చేసి రిక్టర్ స్కేలుపై భూకంప తీవ్రతను పరీక్షించారు. ఒక్కసారిగా భూకంపం అని తెలియడంతో గ్రామస్థులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. మూడు రోజుల

తరువాయి 2లో



# తప్పిన పదవీ గండం

## దక్షిణ కొరియా అధ్యక్షుడిపై వీగిన అభిశంసన తీర్మానం





**సియోల్:** పదవీ గండం నుంచి దక్షిణ కొరియా అధ్యక్షుడు యూన్ సుక్ యోల్ బైయటపడ్డారు. పార్లమెంటులో ప్రతిపక్షాలు ఆయనపై పెట్టిన అభిశంసన తీర్మానం వీగిపోయింది. అధికార పార్టీకి చెందిన సభ్యులు ఓటింగ్‌ను బహిష్కరించి, అధ్యక్షుడి పదవిని కాపాడారు. అభిశంసన తీర్మానంపై ఓటింగ్‌కు తగినంత మంది సభ్యులు లేని కారణంగా, అది వీగిపోయిందని స్పీకర్ ఊ వాన్‌షిక్ ప్రకటించారు. విపక్షాల నుంచి తీవ్రమైన ఒత్తిళ్లు ఒకవైపు, మెజారిటీ లేకపోవడం మరోవైపు వేధిస్తున్న తరుణంలో యూన్ సుక్ హఠాత్తుగా ఎమర్జెన్సీ విధించడం పట్ల తీవ్ర స్థాయిలో విపర్యలు వెల్లువెత్తాయి. అధ్యక్షుడు తీసుకున్న ఈ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ, ప్రతిపక్ష పార్టీలు ఆయనపై అభిశంసన తీర్మానాన్ని ప్రవేశపెట్టాయి. ఈ తీర్మానం ఆమోదం పొందాలంటే సభలో మూడింట రెండు వంతుల మెజారిటీ అవసరం. దక్షిణ కొరియా పార్లమెంటు నేషనల్ అసెంబ్లీలో ఉన్న మొత్తం 300 మంది సభ్యుల్లో కనీసం 200 మంది అనుకూలంగా ఓటు వేస్తేనే తీర్మానం ఆమోదం పొందుతుంది. ప్రతిపక్ష పార్టీలకు మొత్తం 192 సీట్లు ఉన్నాయి. అధికార పక్షానికి చెందిన ముగ్గురు సభ్యులు కూడా ఓటింగ్‌లో పాల్గొన్నారు. అయినప్పటికీ, కనీస సంఖ్య లేకపోవడంతో, ఈ తీర్మానం వీగిపోయిందని స్పీకస్పేర్కొన్నారు.




**యూన్ బహిరంగ క్షమాపణ**

'ఎమర్జెన్సీ మార్షల్ లా' యూన్ సుక్ ప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పారు. ఇలాంటి పొరపాటు ఎప్పుడూ చేయబోనని తెలిపారు. 'ఎమర్జెన్సీ మార్షల్ లా' ప్రకటనతో యూన్ సుక్ యోల్‌కు పదవీ గండం ఏర్పడింది. ఆయనపై విపక్షాలు తీసుకొచ్చిన అభిశంసన తీర్మానంపై పార్లమెంట్‌లో ఓటింగ్ జరగడానికి ముందు యూన్ ఓ టెలివిజన్ ఛానల్‌లో మాట్లాడుతూ దేశ ప్రజలకు బహిరంగ క్షమాపణ తెలిపారు. ఇంకోసారి ఇలాంటి తప్పు చేయనని వెల్లడించారు. 'ఆ ప్రకటన కోసం నా రాజకీయ, చట్టపరమైన బాధ్యతను తప్పించుకోలేను. మార్షల్ లా కారణంగా ప్రజలను ఆందోళనకు, తీవ్ర అసౌకర్యానికి గురిచేసినందుకు క్షమాపణలు తెలియజేస్తున్నా. ఇంకోసారి ఎమర్జెన్సీ విధించే ప్రయత్నం చేయబోనని హామీ ఇస్తున్నా' అని యూన్ వెల్లడించారు. ప్రతిపక్షాలు దేశ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నాయని ఆరోపిస్తూ యూన్ సుక్ యోల్ ఇటీవల 'ఎమర్జెన్సీ మార్షల్ లా' విధించారు. దీనిపై తీవ్ర వ్యతిరేకత రావడంతో పార్లమెంట్‌లో ఓటింగ్ పెట్టి అత్యవసర స్థితికి వ్యతిరేకంగా తీర్మానాన్ని ఆమోదించారు. గంటల వ్యవధిలోనే ఎమర్జెన్సీ ఎత్తివేశారు. తన ప్రకటనను విరమించుకున్నట్లు అధ్యక్షుడు తెలిపారు. ఈ పరిణామాలతో దేశవ్యాప్తంగా ఆయనకు వ్యతిరేకత ఎదురైంది. అధ్యక్షుడు పదవి నుంచి దిగిపోవాలని పట్టుబట్టిన విపక్షాలు పార్లమెంట్‌లో అభిశంసన తీర్మానం తీసుకొచ్చాయి. అటు సొంత పార్టీ నుంచి కూడా ఆయనకు మద్దతు కరవైంది.

## గాజాపై ఇజ్రాయెల్ దాడి: 29 మంది మృతి



**ఇంటర్నెట్ డెస్క్:** గాజాపై ఇజ్రాయెల్ దాడులు ఆగడం లేదు. తాజాగా ఉత్తర గాజాలోని అద్వాన్ ఆస్పత్రి పరిసరాల్లో ఇజ్రాయెల్ వైమానిక దాడులకు పాల్పడింది. ఈ ఘటనలో నలుగురు వైద్య సిబ్బంది సహా 29 మంది పాలస్తీనా వాసులు మతి చెందినట్లు అధికారులు వెల్లడించారు. శిథిలాల కింద చిక్కుకొని చాలామంది గాయపడ్డారని తెలిపారు. ఇజ్రాయెల్ దాడులతో సుమారు లక్షమంది పలస్తీనియన్లు సరైన ఆహారం, వైద్య సదుపాయాలు లేక అలమటిస్తున్నారని పలస్తీనియన్ సివిల్ ఎమర్జెన్సీ సర్వీసెస్ పేర్కొంది. గాజాలోని ఆసుపత్రిలో వైద్య సామగ్రి, మానవ వనరుల కొరత అధికంగా ఉందని ఆరోగ్య శాఖ వెల్లడించింది. ఇజ్రాయెల్ దాడుల్లో ఇప్పటి వరకు 44,600 మంది పలస్తీనియన్లు మరణించారని, అందులో మహిళలు, పిల్లలు అధికంగా ఉన్నారని ఆవేదన వ్యక్తం చేసింది. ఓ వైపు ఒప్పందం దిశగా అడుగులు పడుతున్నా... దాడులు మాత్రం తగ్గకపోవడం ఆందోళనకరంగా మారింది.

## మస్క్‌తో ఇజ్రాయెల్ అధ్యక్షుడి మంతనాలు

**వాషింగ్టన్:** ఇజ్రాయెల్ హమాస్ మధ్య యుద్ధంతో పశ్చిమాసియా మండుతోంది. మిలిటెంట్ చెరలోని తమ బందీలను విడిపించేందుకు టెల్‌అవీవ్ తీవ్రంగా ప్రయత్నిస్తుంది. అందులోభాగంగా ట్రంప్ కార్యవర్గంలో 'డోజ్' శాఖ బాధ్యతలు చేపట్టనున్న ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్‌తో ఇజ్రాయెల్ అధ్యక్షుడు ఐజాక్ హెర్జోగ్ ఫోన్‌లో చర్చలు జరిపినట్లు తెలుస్తోంది. ఈ మేరకు వార్తాపత్రికల్లో కథనాలు వెలువడ్డాయి. ఈ వారం ప్రారంభంలో మస్క్‌కు ఐజాక్ ఫోన్ చేశారు. హమాస్ చెరలోని తమ బందీల విడుదలపై చర్చల పునరుద్ధరణ గురించి ఇద్దరు నేతలు చర్చించుకున్నట్లు ఇజ్రాయెల్ అధికార వర్గాలు తెలిపాయి. బందీలుగా ఉన్న కుటుంబసభ్యుల అభ్యర్థన మేరకే ఐజాక్ మస్క్‌తో ముచ్చటించినట్లు వెల్లడించాయి. అన్ని పక్షాలపై ఒత్తిడి తీసుకొచ్చేలా సంధిని ముందుకుతీసుకెళ్లాలని ఆయన కోరినట్లు వెల్లడించారు. ఇదిలా ఉండగా ఐక్యరాజ్యసమితిలోని ఇరాన్ రాయబారి అమీర్ సయీద్ ఇరవాని, మస్క్ భేటీ అయినట్లు ఇటీవల న్యూయార్క్‌టైమ్స్ కథనాన్ని ప్రచురించింది. ఇరాన్ అమెరికా మధ్య ఉద్రిక్తతల గురించి వీరి మధ్య చర్చ జరిగినట్లు ప్రచారం జరిగింది. ఇరాన్‌పై అమెరికా విధించిన ఆంక్షలు తొలగించాలని, టెహ్రాన్‌తో వ్యాపారం చేయాలని అమీర్ మస్క్‌ను కోరినట్లు పేర్కొంది. ఈ భేటీ గురించి అటు మస్క్ కానీ, ఇటు టెహ్రాన్ రాయబారి గానీ ధ్రువీకరించలేదు. మరోవైపు మిలిటెంట్ల చెరలోని బందీలను త్వరగా విడుదల చేయించాలనే ఆలోచనలో డొనాల్డ్ ట్రంప్ ఉన్నారు. తాను అధికార బాధ్యతలు చేపట్టేలోపు వారిని విడుదల చేయకపోతే నరకం చూపిస్తానని హమాస్‌కు హెచ్చరికలు జారీ చేశారు. గత ఏడాది అక్టోబర్ 7న ఇజ్రాయెల్‌పై హమాస్ దాడి చేయడంతో 1,200 మందికి పైగా ప్రాణాలు కోల్పోయారు. 251 మందిని ఆ సంస్థ బంధించి గాజా తీసుకెళ్లింది. మధ్యలో తాత్కాలికంగా జరిగిన కాల్పుల విరమణ ఒప్పందం వేళ కొందరు బందీలు విడుదలయ్యారు. తర్వాత జరిగిన కొన్ని ఘటనల్లో మరికొందరు మతిచెందగా... ప్రస్తుతం 51 మంది మాత్రమే సజీవంగా ఉన్నట్లు ఇజ్రాయెల్ మీడియా చెబుతోంది.



## కీలక ప్రాంతాల పరిరక్షణకు సిద్ధమవుతున్న సిరియన్ దళాలు




**బీరూట్:** దక్షిణ సిరియాలోని చాలా ప్రాంతాల నుండి సిరియా ప్రభుత్వం తన సైన్యాన్ని ఉపసంహరించుకుంది. రెండు ప్రావిన్షియల్ రాజధానులతో సహా దేశంలోని మరిన్ని ప్రాంతాలను ప్రతిపక్ష యోధుల నియంత్రణలో ఉంచినట్లు మిలిటరీ, ప్రతిపక్ష వార్ మానిటర్ తెలిపారు. తిరుగుబాటుదారులు దాని పొలిమేరలకు చేరుకున్నందున, సిరియాలోన మూడవ అతిపెద్ద కేంద్రమైన హామ్ నగరాన్ని రక్షించడానికి సిరియా సైన్యం పెద్ద సంఖ్యలో ఉపదళాలలను పంపింది. కాగా, దారా, స్వీడా ప్రావీన్స్‌లలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. దేశ వ్యాప్తంగా సైన్యానికి, తిరుగుబాటు దళాలకు మధ్య ఆధిపత్య పోరాటం కొనసాగుతున్న నేపథ్యంలో సిరియన్ ప్రభుత్వం అప్రమత్తమైంది. ముందు జాగ్రత్త చర్యగా, దేశంలోని అత్యంత కీలకమైన ప్రాంతాలలో బలగాలను మోహరింప చేస్తున్నది. ఈ క్రమంలోనే దక్షిణ భూభాగం నుంచి దళాలను ఈ ప్రాంతాలకు పిలిపిస్తున్నది. సిరియాకు మొదటి నుంచి రష్యా మద్దతు ఉంది. అయితే, ప్రస్తుతం ఉక్రేన్‌పై యుద్ధంలో రష్యా మునిగితేలుతున్న తరుణంలో, తిరుగుబాటుదారులు క్రమంగా బలాన్ని పుంజుకుంటున్నారు. సైన్యానికి సవాళ్లు విసురుతున్న తిరుగుబాటు దళాలను నిలువరించడానికి సిరియన్ ప్రభుత్వం ప్రయత్నిస్తున్నది. అయితే, లెబనాన్‌లోని అత్యంత శక్తివంతమైన హిజ్బొల్లాకు ఒకానొక సమయంలో సిరియా వేలాది మంది యోధులను పంపింది. ఈ కారణంగా కూడా సిరియన్ సైన్యం బలహీనపడింది. ఈ పరిస్థితుల్లో, ఉన్న సైన్యాన్ని కీలక ప్రాంతాల్లో మోహరింప చేస్తున్నది.

## ఏడాది ప్రజాపాలన ఎంతో సంతృప్తినిచ్చింది: సిఎం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఏడాది ప్రజాపాలన తనను ఎంతో సంతృప్తినిచ్చిందని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి అన్నారు. సమస్త ప్రజల ఆకాంక్షలను సంపూర్ణంగా నెరవేర్చడమే తన సంప్రాప్తి అని తెలిపారు. శనివారంతో ఏడాది పాలన పూర్తి చేసుకుని, రెండవ ఏడాదిలో అడుగుపెడుతున్న సందర్భంగా సిఎం రేవంత్ రెడ్డి ట్విట్టర్‌లో పోస్ట్ చేశారు. పోరాటాలను, ఉద్యమాలను, త్యాగాలను, ఆత్మబలిదానాలను, ఆకాంక్షలను, ఆశయాలను ఇవన్నింటినీ కలిపి రాసిన వీలునామాను 2023,డిసెంబర్ 7న 'తెలంగాణ' నా చేతిలో పెట్టిందని గుర్తు చేసుకున్నారు. ''తన వారసత్వాన్ని సగర్వంగా.. సమున్నతంగా ముందుకు తీసుకువెళ్లే బాధ్యతను ప్రజలు తనకు అప్పగించారన్నారు. ఆక్షణం నుండి, జన సేవకుడిగా..ప్రజా సంక్షేమ శ్రామికునిగా.. మదిలో, విధిలో.. నిర్ణయాల జడిలో.. సకల జన హితమే తన పరమావధిగా.. జాతి ఆత్మగౌరవమే ప్రాధాన్యతగా.. సహచరుల సహకారంతో, జనహితుల ప్రోత్సాహంతో,విమర్శలను సహిస్తూ.. విద్వేషాలను ఎదురిస్తూ .. స్వేచ్ఛకు రెక్కలు తొడిగి.. ప్రజాస్వామ్యానికి రెడ్ కార్పెట్ పరిచి,అవనిపై అగ్ర భాగాన తెలంగాణను నిలిపేందుకు, గొప్ప లక్ష్యాల వైపు నడుస్తూ. నాలుగు కోట్ల ఆశయాలను నడిపిస్తూ...నిరంతరం జ్వలించే.ఈ మట్టి చైతన్యమే స్ఫూర్తిగా. విరామం ఎరుగక... విశ్రాంతి కోరక. ముందుకు సాగిపోతున్నా''ను అని సిఎం రేవంత్‌రెడ్డి అన్నారు.

## 'మహబూబ్‌నగర్'లో భూకంపం

(మొదటి పేజీ తరువాయి)

కిందట తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా గోదావరి నది పరివాహక జిల్లాలో భూకంపం సంభవించగా, ఈ రోజు(డిసెంబర్ 07న) మహబూబ్‌నగర్ లోనూ ప్రకంపనలు వచ్చాయి. ప్రస్తుతం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంగా కూడా భూప్రకంపనలు రావటంతో జనం తీవ్ర భయాందోళనలకు గురయ్యారు.

**హిమాచల్ ప్రదేశ్‌లోనూ....**

సిమ్లా : హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రాన్ని వరుస భూకంపాలు వణికించాయి. మండి జిల్లాలో శనివారం తెల్లవారుజామున 2:26 గంటల ప్రాంతంలో భూకంపం సంభవించింది. స్వల్ప వ్యవధిలోనే మూడు సార్లు భూమి కంపించింది. రిక్టరు స్కేలుపై భూకంపం తీవ్రత 3.3గా నమోదైనట్లు నేషనల్ సెంటర్ ఫర్ సిస్మోలజీ వెల్లడించింది. భూమికి ఐదు కిలోమీటర్ల లోతులో భూకంపం కేంద్రాన్ని గుర్తించినట్లు తెలిపింది. వరుస ప్రకంపనలతో ప్రజలు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. నిద్ర నుంచి ఉలిక్కిపడి లేచి ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీశారు. అయితే, స్వల్ప స్థాయిలోనే ప్రకంపనలు నమోదు కావడంతో ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం సంభవించలేదు. కాగా, తెలంగాణ రాష్ట్రంలోనూ మరోసారి భూకంపం సంభవించింది. మహబూబ్ నగర్ జిల్లాలోని కౌకుంట్లలో 3.0 తీవ్రతతో భూ ప్రకంపనలు నమోదయ్యాయి.

## చెరువులోకి దూసుకెళ్లిన కారు

(మొదటి పేజీ తరువాయి)

భాస్కర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం ఆరుగురు యువకులు కారులో హైదరాబాదు నుండి పోచంపల్లికి వస్తున్న క్రమంలో జలాల్పురం చెరువు కట్ట వద్ద మూలమలుపు ఉండటం వల్ల వేగంగా వస్తున్న కారు అదుపుతప్పి చెరువులో పడిపోయింది. వెంటనే సమాచారం తెలుసుకున్న పోలీసులు జెసిబి సహాయంతో కారును బయటకు తీశారు. ఐదుగురు అక్కడికక్కడే చనిపోగా ఒక యువకుడు కారు అద్దాలు ధ్వంసం చేసి సురక్షితంగా బయటపడ్డాడు. చనిపోయిన వారు వంశి విగ్నేష్ బాలు వినయ్ హర్ష ఎల్బీనగర్‌కు చెందిన 21 లోపు వయసు వారీగా పోలీసులు గుర్తించారు. చనిపోయిన వారిని భువనగిరి ఏరియా ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై భాస్కర్ రెడ్డి తెలిపారు.

## స్వరాష్ట్రంలోనూ కలగని విముక్తి

(మొదటి పేజీ తరువాయి)

చేశారని, కానీ ప్రస్తుత ప్రజాపాలనలో నల్లగొండ జిల్లాకు అవసరమైన నిధులు కేటాయించి పెండింగ్ పనులు పూర్తిచేస్తామని హామీ ఇచ్చారు. తెలంగాణ ఉద్యమానికి నాయకత్వం వహించడంలో జిల్లా ముందు వరుసలో ఉందని ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కోసం పదవి త్యాగం చేసిన మహనీయుడు కొండా లక్ష్మణ్ బాపూజీ భువనగిరి ప్రాంతానికి ప్రాతినిధ్యం వహిస్తే మలిదశ ఉద్యమంలో తెలంగాణ రాష్ట్రం కోసం మంత్రి పదవి త్యాగం చేసింది కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. మలి దశ ఉద్యమానికి ఊపిరి పోసిన అమర వీరుడు శ్రీకాంత్ చారి నల్లగొండ జిల్లా కావడం గర్వకారణమన్నారు. నాడు నిజాంలను తరిమికొట్టిన సాయుధ రైతాంగ పోరాటానికి నల్గొండ జిల్లా నాయకత్వం వహించిందని రజాకారులకు వ్యతిరేకంగా భూమికోసం, భుక్తికోసం వెట్టిచాకిరి విముక్తి కోసం తరిమికొట్టినచ రిత్ర జిల్లాకు ఉందని అన్నారు. నల్లగొండ జిల్లా అంటే ఎంతో మంచిదని అదే స్థాయిలో అన్యాయం జరిగితే కూడా ఎదురుతిరిగి అన్యాయం చేసేవారిని బండకు కొట్టే చైతన్యమైన జిల్లా అని గుర్తుచేశారు. నాడు చేసిన సాయుధ పోరాటంలో ధర్మభిక్షం, రావినారాయణరెడ్డి, భీంరెడ్డి నర్సింహారెడ్డి ఈ జిల్లా నుంచే ప్రాతినిధ్యం వహించి ఎర్రజెండాల పోరాటంలో ముందుందని అనారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే జిల్లా బాగు పడుతుందని ఆశిస్తే ఫ్లోరైడ్ శాశ్వత పరిష్కారం కోసం ఎస్.ఎల్.బి.సి, ఉదయ సముద్రం ప్రాజెక్టులు పూర్తి చేయాలని ప్రజలు అనేక పోరాటాలు చేసినప్పటికి కెసిఆర్ పదేళ్ళ పాలనలో పూర్తి చేయలేక పోయారని, కాంగ్రెస్ ప్రభుత్వం 44 కిలోమీటర్ల సొరంగ పనులను మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి నాయకత్వంలో వేగవంతంగా పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. అంతే కాకుండా జిల్లాలో పిల్లాయిపల్లి, ధర్మారెడ్డి, చిన్న ప్రాజెక్టు నుంచి పెద్ద ప్రాజెక్టు వరకు ఉమ్మడి జిల్లా ప్రాజెక్టులు పూర్తి చేయడం కోసం నిధులు గ్రీన్ చానెల్ లో విడుదల చేస్తామని హామీ ఇచ్చారు. గత కేసీఆర్ ప్రభుత్వంలో రైతులు వరి వేస్తే ఉరి అనే మాట కేసిఆర్ చెప్పారని కాంగ్రెస్ ప్రభుత్వంలో నేడు 8,500 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి కనీస మద్దతు ధరతో పాటు 500 బోనస్ ఇచ్చి వరి కొనుగోలు చేశామని అన్నారు. 66.7 లక్షల ఎకరాల్లో 153 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యాన్ని రైతులు పండించి దేశంలోనే తెలంగాణ రాష్ట్రం మొదటి స్థానంలో నిలిచిందన్నారు.

**ఫాం హౌజ్‌కే పరిమితమైతే ఎలా..?**

ప్రధాన ప్రతిపక్ష నేతగా కెసిఆర్ తన అనుభవాన్ని ప్రజల కోసం అందించాల్సిన సమయంలో ఓటమి జీర్ణించుకోలేక ఫాం హౌజ్‌కే పరిమితమవడాన్ని తీవ్రంగా ఖండించారు. గతంలో జానా రెడ్డి, కెసిఆర్ తమ ఎమ్మెల్యేలను కొనుగోలు చేసిన ఐదుగురు ఎమ్మెల్యేలతోనే భట్టి విక్రమార్క ప్రభుత్వంపై పోరాటం చేయడమే కాకుండా సలహాలు ఇచ్చిన విషయాన్ని గుర్తుచేశారు. ఇప్పటికైనా కెసిఆర్ అసెంబ్లీకి రావాలని వారి అనుభవాలను తెలంగాణ ప్రజల కోసం వినియోగించాలని కోరారు. ప్రతిపక్ష హోదాలో తమ అనుభవాలను పక్కనపెట్టి ఒక గాలి బ్యాచ్‌ను తయారు చేసి ఊరిమీదకు వదలడం సిగ్గుచేటని అన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి కోసం చేపడుతున్న ఫ్యాక్టరీ, పరిశ్రమలు, ఆర్.ఆర్.ఆర్, ఫ్యూచర్ సిటి, మెడికల్ కాలేజీ, ఫాక్స్ కాన్ కంపెనీ వంటి ప్రతి అంశానికి ప్రతి పక్ష నాయకులు అడ్డు పడుతున్నారని నీళ్ళు, ఉద్యోగాల కోసం కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణలో ఈ గాలి బ్యాచ్ పరీక్షలు పెట్టవద్దు ఉద్యోగాలు ఇవ్వ వద్దు అనే రీతిలో ఉంటే ఎలా అని ప్రశ్నించారు. శ్రీకాంత చారి అమరత్వం నాలుగుకోట్ల ప్రజల బాగు కోసమే తప్ప కేసీఆర్ కుటుంబంలో నలుగురు ఉద్యోగాల కోసం కాదనే విషయాన్ని మర్చిపోవద్దని అన్నారు.

**55వేల పై చిలుకు ఉద్యోగాలు ఇచ్చాం...**

దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి నేటి వరకు ఏ ప్రభుత్వం కూడా సంవత్సర కాలంలో 55 వేల 143 ఉద్యోగాలు ఇచ్చిన చరిత్ర లేదని యువతకు పెద్ద ఎత్తున మొదటి సంవత్సరంలోనేఉద్యోగాలు ఇచ్చిన ఘనత ప్రజా పాలనకే దక్కిందని అన్నారు. నియామకాల పేరుతో అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ ఏ నాడు యువత భవిష్యత్ గురించి ఆలోచించలేదని ధ్వజమెత్తారు. ప్రతిపక్షాలకు ఉద్యోగ నియామకాలపై అనుమానాలు ఉంటే ఏ శాఖలో ఎన్ని ఉద్యోగాలు భర్తీ చేశామో అసెంబ్లీలో నివృత్తి చేస్తామని తెగేసి చెప్పారు. అనవసరంగా సోషల్ మీడియా వేదికగా ప్రభుత్వంపై దుమ్మెత్తిపోసే కుట్ర చేస్తే సహించబోమని, ప్రజలే తిప్పికొడుతారని స్పష్టం చేశారు.

**నడ్డా అడ్డగోలుగా మాట్లాడవద్దు....**

తెలంగాణ గడ్డమీదకు వచ్చిన బీజేపి జాతీయ అధ్యక్షులు నడ్డా కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిపై అడ్డగోలుగా మాట్లాడవద్దని హెచ్చరించారు. బీజేపి పాలిత రాష్ట్రాలైన గుజరాత్ , యూపి, మధ్య ప్రదేశ్ రాష్ట్రం లోని ఎక్కడైనా 55 వేల ఉద్యోగాలు మొదటి సంవత్సరంలో ఇచ్చినట్లు లెక్కలు చెపితే దేశరాజధాని ఢిల్లీ నడి బజారులో క్షమాపన చెప్తానని సవాల్ విసిరారు.

**సంక్రాంతికి రైతు ఖాతాల్లో గలగలలు... బీఆర్ఎస్ గుండెల్లో దడదడలు....**

సంక్రాంతి తర్వాత రైతు భరోసా డబ్బులు ఖాతాలలో గలగల పడుతుంటే బీఆర్ఎస్ గుండెల్లో దడ పుడుతుందని అన్నారు. దీనిపై ఎవరెన్ని చెప్పినా రైతులు నమ్మకంతో రైతులు సన్న వడ్లు పండించి సంక్షేమ హాస్టళ్ళు, గురుకుల పాఠశాలతో పాటు రేషన్ షాపుల ద్వారా ప్రజలకు సన్న బియ్యంతో బువ్వ తినేందుకు రైతులు సన్న వడ్లు పండించాలని, ఆ పంటకు బోనస్ 500 చెల్లించి కొనుగోలు చేస్తామని హామీ ఇచ్చారు.



## నాలుగేళ్లలో భారతదేశానికి మోడల్‌గా తెలంగాణ

### డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు

**ప్రజాపక్షం/నల్లగొండ ప్రతినిధి:** రాష్ట్ర అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేసుకుని, మరోవైపు అప్పులు తీర్చుకుంటూ ముందుకు పోతున్నామని.. మొదటి ఆరు నెలలు పార్లమెంటు ఎన్నికల కోడ్ కిందికి పోగా మిగిలిన ఆరు నెలల్లోనే అద్భుతాలు సృష్టించామని, మిగిలిన 4 ఏళ్లలో తెలంగాణను యావత్ భారతదేశానికి ఒక మోడల్గా చేసి చూపిస్తామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. శనివారం ఆయన నల్లగొండలో భారీ బహిరంగ సభలో ప్రసంగించారు. పదేళ్లు పాలించిన బీఆర్ఎస్ నేతలు నల్లగొండ జిల్లాకు తీవ్ర అన్యాయం చేశారని విమర్శించారు. నల్లగొండ జిల్లాకు సంబంధించి ఏ ఒక్క ప్రాజెక్టును పదేళ్లలో పూర్తి చేయలేక పోయారని అన్నారు. శ్రీశైలం సొరంగ మార్గం 10 కిలోమీటర్లు తవ్వాల్సి ఉండగా ఏడాదికి ఒక్క కిలోమీటర్ తోవ్విన అది పూర్తయ్యేది.. కృష్ణా జలాలు గలగల పారేవి కానీ టిఆర్ఎస్ నేతలు పట్టించుకోలేదని అన్నారు. ఒక ఎస్ ఎల్ బి సి సొరంగమే కాదు, బ్రాహ్మణ వెల్లెంలా, డిండి, నక్కలగండి అన్ని పక్కకు పడేశారని అన్నారు. యాదాద్రి థర్మల్ పవర్ ప్రాజెక్టు ప్రారంభించినప్పుడు జిల్లా ప్రజలకు బీఆర్ఎస్ నేతలు సినిమా చూపించారని విమర్శించారు. జిల్లాలో ఒకేరోజు మెడికల్ కళాశాల ప్రారంభించి పేదలకు వైద్యం, యాదాద్రి పవర్ ప్రాజెక్ట్ లో విద్యుత్ ప్రారంభించి విద్యుత్ ఉత్పత్తి, బ్రాహ్మణ వెల్లేముల ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభించి సాగునీరు ఒకేరోజు వైద్యం, విద్యుత్తు, సాగునీరు నల్లగొండ ప్రజానీకానికి అంకితం చేశామని తెలిపారు.

**నల్లగొండ అంటే కేసీఆర్‌కు కసి : మంత్రి కోమటిరెడ్డి**

నాడు దివంగత ముఖ్యమంత్రి వైఎస్ఆర్ లాగానే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎస్ఎల్‌బిసిని పూర్తిచేసేందుకు మాట ఇచ్చారని అందుకే శ్రీశైలం సొరంగ మార్గానికి తాను డబుల్ ఆర్ ప్రాజెక్టుగా పిలుచుకుంటున్నామని రోడ్డు భవనాల సినిమాటోగ్రఫి మంత్రి కోమటిరెడ్డివెంకట్‌రెడ్డి అన్నారు. ప్రపంచంలో ఎక్కడాలేని విధంగా 44 కిలోమీటర్లసొరంగ మార్గం నల్లగొండ జిల్లాలో ఉందని సీఎం కూడా సొరంగ మార్గం దేశంలో ఏ రాష్ట్రానికి పోటీ కాదని, ప్రపంచ దేశాలకు పోటీగా నిలిచేవిధంగా నిర్మిస్తున్నామన్నారు. నల్లగొండ అంటే మాజీ సీఎంకు కసి ఉందని, కూలిపోయే ప్రాజెక్టు కాళేశ్వరం కట్టించారు కానీ ఎస్ఎల్‌బిసి, బ్రాహ్మణ వెల్లంల ప్రాజెక్టుల నిర్మాణానికి నిధులు కేటాయించకపోవడంతో ఉమ్మడి నల్లగొండ ప్రజలంతా కసితో 11మంది ఎమ్మెల్యేలను, ఇద్దరు ఎంపీలను గెలిపించి బీఆర్ఎస్‌ను బొంద పెట్టారని అన్నారు. బహిరంగ సభలో జిల్లా ఇన్‌చార్జీ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు, మంత్రులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి,దామోదర రాజనర్సింహ, శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు వేముల వీరేశం, మందుల సామెల్, బాలు నాయక్, బీర్ల అయిలయ్య, కుంభం అనీల్ రెడ్డి, కుందూరు జైవీర్‌రెడ్డి,ఉత్తమ్ పద్మావతి, బీఎల్ఆర్, ఎంపీలు కుందూరు రఘువీర్‌రెడ్డి,చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, కార్పోరేషన్ చైర్మన్‌లు గుత్తా అమిత్‌రెడ్డి, పటేల్ రమేష్, మాజీ డిప్యూటీ చైర్మన్ నేతి విద్యాసాగర్, మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షులు శంకర్ నాయక్, పట్టణ అధ్యక్షులు గుమ్మల మోహన్‌రెడ్డి, ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

## యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌లో యూనిట్-2 జాతికి అంకితం



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ / నార్కట్‌పల్లి:** కాంగ్రెస్ ప్రభుత్వ ఏడాది పాలన సందర్భంగా నల్లగొండ జిల్లా దామరచర్ల మండలంలో నిర్మిస్తున్న యాదాద్రి థర్మల్ ప్రాజెక్టులో యూనిట్2 ప్లాంట్‌ను శనివారం సీఎం రేవంత్‌రెడ్డిని ప్రారంభించారు. ఈ విద్యుత్ ప్లాంట్‌ను జాతికి అంకితం చేస్తున్నట్లు ప్రకటించారు. భారీ బందోబస్తు నిర్వహించారు. 3.15గంటలకు రావాల్సిన సీఎం 4.07 గంటలకు ప్రత్యేక హెలికాప్టర్ ద్వారా యాదాద్రి పవర్‌ప్లాంట్‌కు చేరుకున్నార. 4.20 గంటలకు ప్రత్యేక ఉత్పత్తిని ప్రారంభించి 800 మెగావాట్ల విద్యుత్‌ను గ్రిడ్‌కు అనుసంధానం చేశారు. తిరిగి కాన్వాయ్ ద్వారా తిరిగి నల్లగొండకు వెళ్లిపోయారు. మొత్తం మీద 53 నిమిషాలు ప్లాంట్‌లోనే ఉండి అన్ని విషయాలను అడిగి తెలుసుకున్నారు.

**ఉదయ సముద్రం లిఫ్ట్ ఇరిగేషన్ పైలాన్ ఆవిష్కరణ**

అంతకు ముందు నల్లగొండ, నకిరేకల్, మునుగోడు, తుంగతుర్తి నియోజకవర్గాలలో లక్ష ఎకరాలకు సాగు నీరు అందించే ఉదయ సముద్రం లిఫ్ట్ ఇరిగేషన్ పైలాన్ ను రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి శనివారం నల్లగొండ జిల్లా నార్కెట్ పల్లి మండలం, బ్రాహ్మణ వెల్లెంల వద్ద ఆవిష్కరించారు. అనంతరం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్లో పూజలు చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, రాష్ట్ర శాసన మండలి చైర్మన్ గుట్ట సుఖేందర్ రెడ్డి, ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి, ప్రెస్ అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, నల్లగొండ, భువనగిరి ఎం పి లు కుందూర్ జయవీర్ రెడ్డి, చామల కిరణ్ కుమార్ రెడ్డి,ఎం ఎల్ ఎ లు వేముల వీరేశం, కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి,బాలు నాయక్, బీర్ల ఐలయ్య,మందుల శామ్యూల్, నేతి విద్యా సాగర్,జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, జిల్లా ఎస్ పి శరత్ చంద్ర పవార్, జిల్లా ప్రాజక్టుల ఈ ఎన్ సి అజయ్ కుమార్, కాంగ్రెస్ పార్టీ మండలం అధ్యక్షులు బత్తుల ఉషయ్య, జిల్లా నాయకులు సట్టు సత్తయ్య, వడ్డే భూపాల్ రెడ్డి, భరత్ గౌడ్,పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నిబద్ధత కలిగిన

# మిలిటెంట్ నాయడిని కోల్పోవడం బాధాకరం

సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కూనంనేని సాంబశివరావు




**ప్రజాపక్షం/రంగారెడ్డి ప్రతినిధి :** సంక్షోభ సమయంలో ఉత్తమ, నిబద్ధత కలిగిన మిలిటెంట్ నాయకుడిని కోల్పోవడం బాధాకరం అని, విశ్వాసాలు, విలువలు ఉన్నంతకాలం కామ్రేడ్ బాల మల్లేష్ జ్ఞాపకాలు మన మధ్యలో ఉంటాయని భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ)రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్ఎ కూనంనేని సాంబశివరావు, బికెఎంయు జాతీయ కార్యదర్శి నిర్మల్ పాండే, సామాజికవేత్త, తత్వవేత్త ప్రొఫసర్ హరగోపాల్‌లు అన్నారు.
శనివారం సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి బాల మల్లేశ్ సంతాప సభ రంగారెడ్డి జిల్లా శంషాబాద్ లోని ఎలైట్ హోటల్‌లో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం (బికెఎంయు) రాష్ట్ర అధ్యక్షుడు కలకొండ కాంతయ్య అధ్యక్షతవహించగా, ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బుద్దుల జంగయ్య వేదికపైకి నాయకులు ఆహ్వానించారు. సిపిఐ జాతీయ నాయకులు అజీజ్‌పాషా, పశ్య పద్మ, సిపిఐ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య, రాష్ట్ర కార్యవర్గ ఆందోజు రవీంద్రచారి, సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ సభ్యులు పుస్తకాల నర్సింగ్ రావు, మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా కార్యదర్శి సాయిలు గౌడ్, రాష్ట్ర సమితి సభ్యులు, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాయకులతో కలిసి సిపిఐ రాష్ట్ర కార్యదర్శి సాంబశివరావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ముందుగా బాలామల్లేష్ చిత్రపటానికి పూలమాలలు వేసి, సంతాప సూచకంగా రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సామాజికవేత్త, తత్వవేత్త ప్రొఫసర్ హరగోపాల్ మాట్లాడుతూ కామ్రేడ్ బాలమల్లేష్ నిర్వహించ తలపెట్టిన వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర సమితి సమావేశాల సభ ఆయన సంస్మరణ సభగా జరుపుకోవడం విషాదకరమన్నారు. ఇటీవల ఎంతోమంది విలువైన వ్యక్తులను కోల్పోవడం జరిగిందని, ఈ క్రమంలో దేశం, రాష్ట్రంలో వ్యవసాయ కార్మికులు, రైతులు తీవ్ర సంక్షోభంలో ఉన్న తరుణంలో వారి హక్కుల కోసం పనిచేసే తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి, సిపిఐ సహాయ కార్యదర్శి బాలమల్లేశ్‌ను కోల్పోవడం దురదృష్టకరమన్నారు. బాలమల్లేశ్ పోరాటాన్ని కొనసాగించడమే ఆయనకు మనం ఇచ్చే నిజమైన నివాళి అని ప్రొఫసర్ హరగోపాల్ స్పష్టం చేశారు. అనంతరం భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ)రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్ఎ కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ సంక్షోభ సమయంలో ఉత్తమ, నిబద్ధత కలిగిన మిలిటెంట్ నాయకుడిని కోల్పోవడం చాలా బాధాకరమని అన్నారు. భారత కమ్యూనిస్టు పార్టీ ఇటీవల కాలంలో ఖమ్మం జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్‌ను కోల్పోయిన మరుసటి రోజే రాష్ట్ర సహాయ కార్యదర్శి బాలమల్లేష్‌ను కోల్పోవడం జరిగిందని, విలువైన ఇద్దరు కామ్రేడ్స్‌ను కోల్పోవడం పార్టీకి, ప్రజా సంఘాలకు తీరని వెదన అని కూనంనేని సాంబశివరావు ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ సాయుధ పోరాటంలో సైతం మన కామ్రేడ్స్ అనేకమంది చనిపోయినప్పటికీ వారి స్ఫూర్తిని కొనసాగించి లక్ష్యాన్ని ఛేదించారని, నక్సలైట్లు తమ నాయకులు, కార్యకర్తలు కోల్పోయినప్పటికీ వారి స్ఫూర్తితో అనేకమంది జెండాలను పట్టుకొని ముందుకెళ్తున్నారని చెప్పారు.
కోల్పోయిన నాయకులను ఆదర్శంగా తీసుకుని సమాజ మార్పు కోసం ప్రతి ఒక్కరూ కంకణ బద్దులై పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎఐఎడబ్ల్యుయు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకట్ రాములు, గిరిజన సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు అంజయ్య నాయక్, ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి ఓరుగంటి యాదయ్య, రాష్ట్ర సమితి సభ్యులు కావలి నరసింహ, ముత్యాల యాదిరెడ్డి, పానుగంటి పర్వతాలు, బికెయంయు జిల్లా ప్రధాన కార్యదర్శి బుద్ధుల జంగయ్య, రైతు సంఘం రాష్ట్ర నాయకులు ప్రభు లింగం, జిల్లా నాయకులు రామస్వామి, సామిడి శేఖర్ రెడ్డి, సత్యానారాయణ, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర, జిల్లా నాయకులు, వివిధ ప్రజాసంఘాల నాయకులు, మండలాల కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

# అమరుల ఆశయ సాధనకు కృషి

సిపిఐ నాయకులు పిలుపు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎన్.బాలమల్లేశ్, ఖమ్మం జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్‌ల అకాల మరణాలు వామపక్ష పార్టీలు, ప్రజా సంఘాల నాయకులను తీవ్రంగా కలిచివేసిందని సిపిఐ జాతీయ కార్యదర్శి సయ్యద్ అజీజ్ పాషా, రాష్ట్ర కార్యదర్శి ఎంఎల్ఎ కూనంనేని సాంబశివరావు, సిపిఐ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అన్నారు. అమరుల ఆశయ సాధన కోసం కలసి కట్టుగా కృషి చేద్దామని వారు పిలుపునిచ్చారు. శనివారం హైదరాబాద్‌లోని సత్యనారాయణ రెడ్డి భవన్‌లో అఖిల భారత యువజన సమాఖ్య (ఎఐవైఎఫ్), అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఎఐఎస్ఎఫ్) తెలంగాణ రాష్ట్ర సమితి సంయుక్త ఆధ్వర్యంలో సిపిఐ నాయకులు బాలమల్లేష్, కామ్రేడ్ పోటు ప్రసాద్‌ల సంస్మరణ సభ నిర్వహించారు. ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు క్రాంతి కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ సంస్మరణ సభలో సిపిఐ జాతీయ కార్యదర్శి సయ్యద్ ఆజీజ్ పాషా, రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, సహాయ కార్యదర్శి తక్కెళ్లపల్లి శ్రీనివాసరావు, సిపిఐ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, ఎఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వల్లీ ఉల్లా ఖాద్రీ, ప్రధానకార్యదర్శి కె.ధర్మేంద్ర, ఎఐఎస్ఎఫ్ ప్రధానకార్యదర్శి పుట్ట లక్ష్మణ్‌లు మాట్లాడారు. ఈ సందర్భంగా అజీజ్ పాషా మాట్లాడుతూ బాలమల్లేశ్, పోటు ప్రసాద్‌లు కమ్యూనిస్టు పార్టీ సిద్ధాంతాల కోసం నిర్విరామంగా కృషి చేసిన గొప్ప నేతలు అని కొనియాడారు. విద్యార్థి దశ నుండే ప్రజా సమస్యల పరిష్కారానికై అవిరాళంగా కృషిచేశారని తెలిపారు. కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ బాలమల్లేశ్, పోటు ప్రసాద్‌లు క్రమశిక్షణ కలిగిన నాయకులని, వారు సమాజంలోని ప్రజల కోసం నిస్వార్థంగా పాటు విద్యార్థి దశలోనే సమాజానికి అంకితమయ్యారని కొనియాడారు. కె.రామకృష్ణ మాట్లాడుతూ సమాజం కోసం పోరాడి మరణించిన వారిని గౌరవించుకునే గొప్ప సంస్కృతి కేవలం కమ్యూనిస్టులకు మాత్రమే ఉందని, ఆ గౌరవం నేడు బాలమల్లేష్, పోటు ప్రసాద్‌ల సంస్మరణ సభలో కనిపించిందన్నారు. సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కెళ్లపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ మంచి స్నేహితులను కోల్పోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇరువురి మరణం సిపిఐ పార్టీని తీవ్రంగా బాధించిందన్నారు. ఈ సంస్మరణ సభలో ఎఐవైఎఫ్ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు నెర్లకంటి శ్రీకాంత్, రాష్ట్ర ఉపాధ్యక్షులు టి.సత్యప్రసాద్, శ్రీమాన్, ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర ఆఫీస్ బేరర్స్ గ్యారా నరేష్, నాగజ్యోతి, రెహ్మాన్‌లతో పాటు విద్యార్థి, యువజన సంఘాల మాజీ నాయకులు ఆలేటి యాదగిరి, గుర్రం రాజశేఖర్ రెడ్డిలతో పాటు వివిధ జిల్లాల విద్యార్థి, యువజన సంఘాల నేతలు సల్మాన్ బేగ్, బాలకృష్ణ, మహమూద్, కల్యాణ్, అనిల్‌కుమార్, మహేష్, శివకుమార్, మస్క సుధీర్,అన్వర్,వంశీ,అరుణ్, వినోద్ పాల్గొన్నారు.



జాతీయ నూతన విద్యావిధానాన్ని వ్యతిరేకిస్తూ ..

# అసెంబ్లీలో తీర్మానం చేయండి : ఎఐఎస్ఎఫ్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** జాతీయ నూతన విద్యావిధానాన్ని వ్యతిరేకిస్తూ శాసనసభ సమావేశంలో తీర్మానం చేయాలని ఎఐఎస్ఎఫ్ ఒయు కౌన్సిల్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లోని ఒయు ఆర్ట్స్ కళాశాల వద్ద శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి గ్యార నరేష్, ఎఐఎస్ఎఫ్ ఒయు అధ్యక్షుడు లెనిన్, కార్యదర్శి నెల్లి సత్య మాట్లాడుతూ కరోనా సంక్షోభ సమయంలో కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం నూతన విద్యా విధానంపై పార్లమెంట్‌లో ఎటువంటి చర్చ చేయకుండానే ఏకపక్షంగ నూతన విద్యా విధానాన్ని బిల్లును ఆమోదించుకున్నారని, దేశవ్యాప్తంగా అమలు చేస్తున్నారని మండిపడ్డారు. నూతన విద్యావిధానం విద్యా వ్యవస్థలో మతతత్వ పోకడలను, సామాజిక అసమానతలను, సాంఘిక దురాచారాలను పెంచి పోషించేలా గా ఉందని విమర్శించారు. ప్రభుత్వ విద్యను కార్పొరేటీకరణ చేస్తూ రాజ్యాంగ పీఠికలోని మౌలిక సూత్రాలకు విరుద్ధంగా నూతన విద్యావిధానం ఉందని మండిపడ్డారు. రాష్ట్రంలో నూతన విద్యా విధానాన్ని అమలు చేయకూండా అసెంబ్లీలో తీర్మానం చేసి, కేంద్ర ప్రభుత్వానికి పంపించాలని, లేదంటే రాష్ట్ర వ్యాప్తంగా దశలవారీగా పోరాటాలు నిర్వహిస్తామని వారు తెలిపారు. ఎఐఎస్ఎఫ్ ఒయు సహాయ కార్యదర్శి ఆరెకంటి సాయిభగత్, అశ్వన్, రాఘవేంద్ర, సంతోష్, మహేష్, సలీం పాల్గొన్నారు.

# ‘రైతు భరోసా’ ఇంకెప్పుడు ఇస్తారో?



**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల ప్రతినిధి :** రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని సిపిఐ కార్యాలయంలో బాల మల్లేష్ పోటు ప్రసాద్‌ల సంస్మరణ సభను సిపిఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. బాల మల్లేష్ పోటు ప్రసాద్‌ల చిత్రపటాలకు పూల మాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. విద్యార్థి నాయకుడిగా రంగారెడ్డి జిల్లా పార్టీ కార్యదర్శిగా అంచలంచలుగా ఎదిగి రాష్ట్ర కార్యదర్శిగా, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా, ఈ మధ్యలో రాష్ట్ర సహాయ కార్యదర్శిగా ఎన్నికై పార్టీకి సేవలు చేశారని బాలమల్లేష్ మరణం పార్టీకి తీరని లోటు అన్నారు. ఖమ్మం జిల్లా పార్టీ కార్యదర్శిగా ఎన్నికై ప్రసాద్ కుటుంబం అంతా కమ్యూనిస్టు పార్టీ కుటుంబమేనని వ్యవసాయ కార్మిక సంఘం, ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శిగా బాధ్యతలు నిర్వర్తించారని, ఖమ్మం జిల్లా పార్టీ బలోపేతానికి నిరంతరం కృషిచేశారని పోటు ప్రసాద్ మరణం తీరని లోటు అన్నారు. వీరి ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలన్నారు. వీరి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. సిపిఐ పార్టీ నిర్మాణాత్మక పాత్ర పోషిస్తుందని ప్రజలపక్షంగా ఉండి ప్రజల సమస్యలపై నిరంతరం పోరాడుతుందన్నారు. నరేంద్ర మోదీ ప్రభుత్వంలో వారి అనుచరులు సహజ వనరులను కొల్లగొడుతున్నారని విమర్శించారు. తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం సంవత్సరం పూర్తి చేసుకుందని సంబరాలు చేసుకుంటున్నారని ఈ సంవత్సర కాలంలో ఏమిచేశామని నెమరు వేసుకోవాలని సూచించారు. గతంలో కేసీఆర్ రైతు బంధు ఇచ్చారని కాంగ్రెస్ ప్రభుత్వం రెండు పంటలు పోయిన ఎకరాకి రైతు భరోసా 15000 ఇస్తానన్న హామీ నెరవేర్చకపోవడం బాధాకరమని, తక్షణమే రైతు భరోసా చెల్లించాలని డిమాండ్ చేశారు. ధరణి పోర్టల్‌పై కొత్త చట్టం తీసుకొస్తామని ఇప్పటివరకు దాని ప్రస్తావనే లేదన్నారు. పేదరికంతో అల్లాడుతున్న ప్రజలకు రేషన్ కార్డులు తక్షణమే జారీ చేయాలని అన్నారు. సిరిసిల్ల పవర్లూమ్ కార్మికులకు శాశ్వత పరిష్కారం దొరకాలంటే విద్యుత్ సమస్య కూడా ఒక భాగమేనని, విద్యుత్ సమస్యను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. గత ప్రభుత్వం ఏ విధంగా ఇచ్చిందో అదే విధంగా చేయాలని గొంతమ్మ కోరికలు ఏమి కోరడం లేదన్నారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పంతం రవి, మీసం లక్ష్మణ్, కడారి రాములు, జిల్లా కౌన్సిల్ సభ్యులు, కెవి అనసూయ, మల్లేశం, తిరుపతిరెడ్డి, విజయ్, రంజిత్, లక్ష్మి , తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

# ఫాసిస్టు వ్యతిరేక పోరాటాలను ఉధృతం చేయాలి

సిపిఐ (ఎంఎల్) లిబరేషన్ జాతీయ ప్రధాన కార్యదర్శి దీపాంకర్ భట్టాచార్య



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** సమసమాజమే లక్ష్యంగా 1925లో ఆవిర్భావించిన భారత కమ్యూనిస్టు పార్టీ శత జయంతి సందర్భంగా కమ్యూనిస్టు ఉద్యమ వారసత్వ స్ఫూర్తిని దేశవ్యాప్తంగా ప్రజలకు చాటిచెప్పాలని సిపిఐ (ఎంఎల్) లిబరేషన్ జాతీయ ప్రధాన కార్యదర్శి దీపాంకర్ భట్టాచార్య అన్నారు. 100 ఏళ్ల కమ్యూనిస్టు ఉద్యమ స్ఫూర్తితో వామపక్షాలన్నీ మరింత ఐక్యమై బిజెపి రూపంలో అధికారం చెలాయిస్తున్న ఆర్ఎస్ఎస్ భారత రాజ్యాంగాన్ని మనువాద రాజ్యాంగంగా మార్చాలనే కుట్రను తిప్పికొట్టేందుకు సమాయాత్తం కావాలని ఆయన పిలుపునిచ్చారు.
హైదరాబాద్ ప్రెస్‌క్లబ్‌లో శనివారం జరిగిన ముఖాముఖి కార్యక్రమంలో దీపాంకర్ భట్టాచార్య మాట్లాడుతూ 1925లో ఆవిర్భావించిన భారత కమ్యూనిస్టు పార్టీ బ్రిటీష్ వలస పాలకులకు వ్యతిరేకంగా వీరోచిత పోరాటాలను కొనసాగిస్తూ, అనేక త్యాగాలు చేసిందని గుర్తు చేశారు. తెలంగాణ, తెబాగా, పునప్ర వయాలార్, నక్సల్బరి, శ్రీకాకుళ మొదలగు రైతంగా ఉద్యమాలను మిలిటెంట్ కార్మిక పోరాటలను నిర్వహించిందని తెలిపారు. ఆ పోరాట వారసత్వాన్ని సిపిఐ (ఎంఎల్) లిబరేషన్ కొనసాగిస్తుందని దీపాంకర్ భట్టాచార్య చెప్పారు.

**జనవరి 26 వరకు ‘రాజ్యాంగాన్ని రక్షించండి’క్యాంపెయిన్**

భారత రాజ్యాంగాన్ని ఆమోదించి 75 ఏళ్లు పూర్తయిన సందర్భంగా నవంబర్ 26 నుండి జనవరి 26 వరకు ‘రాజ్యాంగాన్ని రక్షించండి’ నినాదంతో నిర్వహించే క్యాంపెయిన్‌లో ప్రజలను భాగస్వాములను చేస్తూ వివిధ రూపాలలో కార్యక్రమాలు చేపట్టాలని సిపిఐ ఎంఎల్ లిబరేషన్ శ్రేణులకు దీపాంకర్ భట్టాచార్య పిలుపునిచ్చారు. భారత ప్రజల ఆకాంక్షలకు, అభిలాషలకు విరుద్ధంగా అదే 1925 సంవత్సరంలో పుట్టిన ఆర్ఎస్ఎస్ బిజెపి రూపంలో నేడు అధికారాన్ని చేజిక్కుంచుకుని దేశంలో ఫాసిస్ట్ పాలనను కొనసాగిస్తోందని ఆయన విమర్శించారు. మతతత్వ పాలకుల కుట్రలను భగ్నం చేసేందుకు ఫాసిస్ట్ వ్యతిరేక ఉద్యమాన్ని ఈ సంవత్సరమంతా మరింత తీవ్రతరం చేయాల్సిన చారిత్రక కర్తవ్యం ఉందన్నారు.

**తెలంగాణలో ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరించాలి**

కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఏడో గ్యారెంటీ అయిన ప్రజాస్వామ్యాన్ని తెలంగాణలో పునరుద్ధరించాలని దీపాంకర్ భట్టాచార్య డిమాండ్ చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగిస్తున్న బూటకపు ఎన్‌కౌంటర్లను తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఇటీవల ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఎన్‌కౌంటర్‌కు పాల్పడిందని, ఇదెక్కడి ప్రజాస్వామ్యమని ఆయన ప్రశ్నించారు. తెలంగాణలో మతతత్వశక్తుల ప్రమాదం పెరిగిందని, బిజెపి అధికారంలోకి వచ్చేందుకు అనేక కుట్రలకు పాల్పడుతుందని, దీనిని నిలువరించేందుకు కమ్యూనిస్టులు ఐక్యంగా పోరాడాలన్నారు. వామపక్ష ప్రత్యామ్నాయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని, అందుకు సిపిఐ (ఎంఎల్) లిబరేషన్ కృషి చేస్తుందన్నారు. సిపిఐ (ఎంఎల్) లిబరేషన్ పొలిట్ బ్యూరో సభ్యులు శంకర్, కేంద్ర కమిటీ సభ్యులు, తెలంగాణ ఇంఛార్జీ నైనాల శెట్టి మూర్తి, పార్టీ రాష్ట్ర కార్యదర్శి మామిండ్ల రమేష్ రాజా తదితరులు పాల్గొన్నారు.

# హామీలను నేరవేర్చలేక చతికిలపడ్డ కాంగ్రెస్

కేంద్రమంత్రి జెపి నడ్డా



**ప్రజాపక్షం/హైదరాబాద్ / సరూర్‌నగర్ :** అమలు కాని హామీలతో అధికారం చేపట్టిన కాంగ్రెస్ ఈ ఏడాది కాలంలో ఒక్క హామీని కూడ పూర్తిగా నేరవేర్చలేక చతికిల్లా పడిందని, కేంద్ర మంత్రిజగత్ ప్రకాష్ నడ్డా విమర్శించారు. శనివారం కాంగ్రెస్ ఏడాది పాలనా వైఫల్యాలు పేరుతో బిజెపి తెలంగాణ శాఖ ఆధ్వర్యంలో హైదరాబాద్ లోని సరూర్ నగర్ స్టేడియంలో ‘బహిరంగ సభ’ నిర్వహించింది. ఈ సభకు ముఖ్యఅతిథులుగా జెపినడ్డా హాజరయ్యారు. కేంద్ర మంత్రులు జి.కిషన్‌రెడ్డి, బండి సంజయ్ కుమార్, ఎంపిలు కె.లక్ష్మణ్, ఈటెల రాజేందర్, డి.కె.అరుణ, రఘునందన్‌రావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జెపి నడ్డా మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ప్రజలకు చేస్తున్న అన్యాయాలను ఎండగడుతూ బిజెపి పోరాటాలకు నడుం బిగించిందన్నారు. తెలంగాణ సంపూర్ణాభివృద్ధి, మంచి భవిష్యత్తు బీజేపీతోనే సాధ్యమని ఇందుకు భవిష్యత్తులో తెలంగాణలోనూ కమల వికసించనుందని ఆయన పేర్కొన్నారు.ప్రతీనెలా ఇస్తామన్న రైతులకు రూ. 15వేలు, . కౌలు రైతులకు రూ. 12వేలు, మహిళలకు రూ. 2500 ఏమైయ్యాయని ప్రశ్నించారు. షాదీ ముబారక్ ఒక తులం బంగారం, ఒక లక్ష రూపాయల నగదు,రూ. యాదవ, కురుమ సంఘాలకు వృత్తి అభివృద్ధికి 2 లక్షలు ఇచ్చారా అన్నారు. బిజెపి రాష్ట్ర అధ్యక్షులు, కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి మాట్లాడుతూ అనేక త్యాగాలతో సాధించుకున్న తెలంగాణ ప్రజలకు బిఆర్ఎస్ ప్రభుత్వం న్యాయం చేయలేదని, కాంగ్రెస్‌కు అధికారం కట్టబెడితే ఏడాది దాటిన ఇచ్చినా హామీలను అమలు చేయక ప్రజలను మోసం చేసిందని దుయ్యబట్టారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ మాట్లాడుతూ అర్బన్ నక్సలైట్ చేతులో రేవంత్‌రెడ్డి సర్కార్ బందీ అయిందని విమర్శించారు. హైదరాబాద్‌లో దేవాలయాలకు దాడులకు తెగబడుతూ భాగ్యనగర్‌ను మరో బంగ్లాదేశ్ గా మార్చే కుట్రకు తేరతీస్తున్నారని ఆరోపించారు. ప్రజలు అసలు రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రిగా అంగీకరించడం లేదంటూ మండిపడ్డారు. లక్ష్మణ్ మాట్లాడుతూ భారత్‌కు వ్యతిరేకంగా విదేశీ శక్తులు అమెరికాలో కుట్రలు పన్నుతుంటే వారికి ప్రతిపక్ష నేత రాహులు గాంధీ వంత పాడుతున్నారని,ఇది కాంగ్రెస్ తీరు అని విమర్శించారు. ఈటెల రాజేందర్ మాట్లాడుతూ ప్రభుత్వమంటే తమ సమస్యలు తీరుస్తుందని ప్రజలు భావిస్తారని, కాని రేవంత్ సర్కార్ మాత్రం హైడ్రా పేరుతో ప్రజలను బిక్కు బిక్కు మన్నేలా చేసిందన్నారు.

అట్టహాసంగా ప్రజాపాలన..

# ప్రజావిజయోత్సవాల ముగింపు వేడుకలు

సచివాలయంలో తెలంగాణ తల్లి విగ్రహం ఆవిష్కరణ
ఉర్రూతలూగించే సాంస్కృతిక, సంగీత కార్యక్రమాలు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ప్రజాపాలన ప్రజా విజావిజయోత్సవాల ముగింపు వేడుకలను ఈనెల తేది 7 నుండి 9వ తేదీ వరకు ఘనంగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన విషయం తెల్సిందే. ఈనెల 9వ తేదీన సచివాలయంలో సిఎం రేవంత్ రెడ్డి తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించనున్నారు. ఈ వేడుకలలో ప్రజలు కూడా పాలుపంచుకుని సంబరాలు జరుపుకునే విధంగా కార్యక్రమాల రూప కల్పన చేశారు. కనివిని ఎరుగని రీతిలో వివిధ ప్రభుత్వ శాఖలు ఏర్పాట్లు చేశాయి. కాంగ్రెస్ కొలువుతీరి రెండవ సంవత్సరంలో అడుగిడుతున్న సందర్భంలో అట్టహాసంగా కార్యక్రమాలు నిర్వహించేందుకు వివిధ శాఖలు ఏర్పాట్లు ముమ్మరంగా చేపట్టాయి. ట్యాంక్ బండ్, నెక్లెస్ రోడ్, హెచ్‌ఎండిఏ గ్రౌండ్స్ వేదికగా పలు సంగీత, సాంస్కృతిక, వినోద కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ప్రముఖ సంగీత కళాకారులు వందేమాతరం శ్రీనివాస్, రాహుల్ సిప్లిగంజ్, తమన్ సంగీత కచేరీలు ప్రత్యేక ఆకర్షణగా నిలువనున్నాయి.

**ప్రజావిజయోత్సవాల ముగింపు వేడుకల వివరాలు**

ట్యాంక్‌బండ్ వద్ద భారత వాయు దళం ద్వారా ఎయిర్ షో. ఐమాక్స్ పక్కనే ఉన్న హెచ్‌ఎండిఏ గ్రౌండ్స్ లో ఈనెల 8న రాత్రి 7 గంటలకు రాహుల్ సిప్లిగంజ్ బృందంతో సంగీత కచేరీ. నెక్లెస్ రోడ్డులో సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు సాంస్కృతిక కార్యక్రమాలు. ఉదయం నుంచి రాత్రి వరకు ఫుడ్ స్టాల్స్, హ్యాండీక్రాఫ్ట్ స్టాల్స్, కల్చరల్ స్టాల్స్ నిర్వహిస్తారు. ఈనెల 9వ తేదీన సచివాలయంలో సాయంత్రం 5 గంటలకు తెలంగాణ తల్లి విగ్రహం ఆవిష్కరణ కార్యక్రమం. అనంతరం 5 గంటల 5:45 గంటల మధ్య జరిగే సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రసంగిస్తారు. 5:45 గంటలకు డ్రోన్‌షో నిర్వహిస్తారు. తరువాత బాణసంచా కలుస్తారు.

# ఆరు గ్యారంటీల అమలుకు పెద్ద పీట

ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు



**ప్రజాపక్షం/గీసుకొండ :** బీఆర్ఎస్ ప్రభుత్వంలో గాడి తప్పిన ఆర్థిక వ్యవస్థను చక్కదిద్దుతూ సంవత్సర కాలంలో ఆరు గ్యారంటీలు అమలుచేసే విధంగా కాంగ్రెస్ ప్రభుత్వ పాలన కొనసాగుతుందని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. వరంగల్ జిల్లా గీసుకొండ మండలంలోని కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కులో భూములు కోల్పోయిన 863 మంది రైతులకు లాటరీ పద్ధతి ద్వారా ఇంటి స్థలాల పట్టాలతోపాటు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను శనివారం అందచేశారు. ఈనెల 9న ప్రారంభించిన మహిళలకు ఉచిత బస్ ప్రయాణంలో 120కోట్ల టికెట్లు అందించామన్నారు. 80శాతం కుటుంబాలకు ఉచిత విద్యుత్ అందిస్తున్నామని, రూ. 500లకే గ్యాస్ సిలిండర్ అందిస్తున్నామన్నారు. గత కాంగ్రెస్ ప్రభుత్వంలో వైఎస్ఆర్ అందచేసిన ఆరోగ్యశ్రీని బలోపేతం చేస్తూ వైద్య ఖర్చులకు రూ.10లక్షలు పెంచి పేదలకు కార్పొరేటర్ వైద్యం అందిస్తున్నామని, పేద ప్రజలకు విద్య, వైద్యం, నిలువ నీడ వంటి సంక్షేమ పథకాలకు సిఎం రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి బట్టి విక్రమార్క, సహచర మంత్రులు కృషి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ ఛైర్మన్ సిరిసిల్ల రాజయ్య, వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య, ఎమ్మెల్సీ బస్వ రాజు సారయ్య, ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, రాష్ట్ర గిడ్డంగుల ఛైర్మన్ రావుల రాజేశ్వర్‌రావు, టీజీ ఐఐసీ ఛైర్మన్ నిర్మల జగ్గారెడ్డి, కలెక్టర్ సత్యశారద, సీఈఓ రాంరెడ్డి, డీఆర్‌డీఓ కౌసల్య దేవి, డీపీఓ కటకం కల్పన, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి భీమగాని సౌజన్య, చాడ కొమురారెడ్డి, శ్రీనివాస్, సారంగం, స్థానిక ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ తల్లి విగ్రాహావిష్కరణకు

# రాజకీయ నాయకులు, ప్రముఖులకు ఆహ్వానం





**ప్రజాపక్షం/హైదరాబాద్ :** సచివాలయ ప్రాంగణంలో ఈనెల 9న జరగనున్న తెలంగాణ తల్లి విగ్రాహావిష్కరణ కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వం రాజకీయ పార్టీల నాయకులను, పలువురు ప్రముఖులను ఆహ్వానించింది. ప్రభుత్వం తరపున హైదరాబాద్ ఇన్‌చార్జ్ మంత్రి, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆహ్వానించారు. ముందుగా రాజ్‌భవన్‌లోని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. ఎర్రవల్లి ఫామ్‌హౌజ్‌లో బిఆర్ఎస్ అధ్యక్షుడు కె.చంద్రశేఖర్ రావును, దిల్‌కుశా గెస్ట్‌హౌస్‌లో కేంద్రమంత్రి జి.కిషన్ రెడ్డిని మంత్రి పొన్నం ప్రభాకర్ కలిసి ‘ప్రజాపాలన ప్రజా విజయోత్సవాల’ కార్యక్రమంలో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.
అలాగే ‘తెలంగాణ తల్లి విగ్రహవిష్కరణ’ కార్యక్రమానికి కూడా రావాలని ఆహ్వానించారు. ఈ మేరకు వారికి ఆహ్వానపత్రికను అందజేశారు. కాగా మంత్రి పొన్నం ప్రభాకర్‌కు కెసిఆర్ లంచ్ ఆతిథ్యమిచ్చారు. అనంతరం తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు సందర్భంగా ఢిల్లీ కేంద్రంగా జరిగిన ఉద్యమ జ్ఞాపకాలను ఇరువురు నాయకులు నెమరువేసుకున్నారు. మంత్రి పొన్నం వెంట ప్రభుత్వ ప్రొటోకాల్ ప్రజా సంబంధాల సలహాదారు హర్కర వేణుగోపాల్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ ప్రోటోకాల్ డైరక్టర్ వెంకట్రావు తదితరులు ఉన్నారు.


తెలంగాణ ప్రభుత్వము
కలెక్టర్ కార్యాలయం, హనుమకొండ
రెవిన్యూ (భూసేకరణ) శాఖ
ఫారం–VI
నోటిఫికేషన్
(చట్టం–30/2013లోని సెక్షన్ 11(1)లోని సబ్ రూల్ –1, రూల్ 19 ప్రకారం)
కలెక్టర్ ఫైల్ నెం.G/1341/2017-6 తేది: 22.11.2024
ఆర్.డి.ఒ. ఫైల్ నెం.G2/642/2024 తేది: 11.11.2024
గెజిట్ నెం. 8/HNK/2024 తేది: 22.11.2024

హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలము & గట్ల నర్సింగపురం గ్రామము పరిధిలో ఈ దిగువ షెడ్యులునందు చూపబడిన భూమి విస్తీర్ణము **(2-23)** గుంటలు భూమి ప్రజా ప్రయోజనార్థమై అనగా MINOR - 5 R of Distributory-5 on Gouravelly Right Side Main Canal of Gouravelly Canal Project from 0.000 to 0.540 km అవసరమున్నదని తెలంగాణా ప్రభుత్వము / జిల్లా కలెక్టర్ హనుమకొండ గారు భావిస్తున్నారు కావున ఇట్టి ప్రకటన జారిచేయనైనది.
ఇట్టి ప్రతిపాదించిన భూసేకరణను 2013 భూసేకరణ చట్టంలోని Chapter - II & Chapter - III అనగా సామాజిక ప్రభావిత అధ్యయనము మరియు ఆహార భద్రత నుండి భూసేకరణ పునరుపాధి, పునరావాస కల్పనకు పారదర్శకత & హేతుబద్ధమైన పరిహారాన్ని పొందే హక్కు, 2013, (తెలంగాణా సవరణ) చట్టము 2016లోని సెక్షన్ 10 (ఎ) ద్వార మినహాయింపు ఇస్తూ ఉతర్వులు జారీ చేయనైనది.

**షెడ్యూల్**

| క్ర. సం. | సర్వే నెం. | భూమి రకం (ఖుష్కి/తరి) | భూమి రకం (పట్టా/ప్రభుత్వ) | భూ సేకరణ చేయబడు విస్తీర్ణము (ఎకరములు) | పట్టాదారు(ల) పేరు(లు) తండ్రి/భర్త పేరుతో సహా | అనుభవదారు(ల) పేరు(లు) తండ్రి/భర్త పేరుతో సహా | సేకరించు విస్తీర్ణం | ఇతర వివరములు |
|---|---|---|---|---|---|---|---|---|
| గ్రామం:గట్ల నర్సింగపురం మండలం: భీమదేవరపల్లి జిల్లా: హనుమకొండ | | | | | | | | |
| 1 | 248 | ఖుష్కి | పట్టా | 1–22 | వెన్నంపల్లి లింగయ్య S/o.రాజమల్లు | మద్దెల కుమారస్వామి / మద్దెల రాజయ్య | 0–16 | |
| | | | | | మెరుగు శోభ W/o.రాజయ్య | మెరుగు రాజయ్య S/o.చేరాలు | 0–09 | |
| | | | | | వెన్నెంపల్లి భాస్కర్ S/o.రాజయ్య | యగ్నవెల్లి రాజయ్య S/o.వెంకయ్య | 0–18.5 | |
| | | | | | మెరుగు శ్రావణ్ S/o.రాజయ్య | యగ్నవెల్లి రవీందర్ S/o.మల్లయ్య | 0–09.5 | |
| | | | | | వెన్నంపల్లి తిరుపతి S/o.వెంకటయ్య | యగ్నవెల్లి తిరుపతి | | |
| | | | | | మెరుగు శ్రావణ్ S/o.రాజయ్య | | | |
| | | | | | పోల్నేని రమ W/o.రాజేశ్వరరావు | | | |
| | | | | | మద్దెల కుమారస్వామి S/o.రాజయ్య | | | |
| | | | | | బానోతు గోపాల్ S/o.లింగయ్య | | | |
| 2 | 247 | ఖుష్కి | పట్టా | 0–10 | నాగరబోయిన అనిత W/o.నాగరాజు | మెరుగు రాజయ్య S/o.చేరాలు | 0–10 | |
| | | | | | పంజ గట్టయ్య S/o.లింగయ్య | | | |
| | | | | | పంజ శ్రీనివాస్ S/o.రాజయ్య | | | |
| | | | | | పంజ గట్టయ్య S/o.లింగయ్య | | | |
| | | | | | ఎర్ర తిరుమల W/o.స్వామి | | | |
| | | | | | జక్కుల అజయ్ S/o.ముత్యాలు | | | |
| | | | | | మాధం కనకయ్య S/o.ఎల్లయ్య | | | |
| | | | | | మెరుగురాజయ్య S/o.చేరాలు | | | |
| | | | | | మాదం సమ్మయ్య S/o.గట్టయ్య | | | |
| | | | | | వెన్నంపల్లి లింగయ్య S/o.రాజమల్లు | | | |
| | | | | | వెన్నంపల్లి భాస్కర్ S/o.రాజయ్య | | | |
| | | | | | వెన్నంపల్లి తిరుపతి S/o.వెంకటయ్య | | | |
| 3 | 231 | ఖుష్కి | పట్టా | 0–31 | మెరుగు రాజమ్మ W/o.చేరాలు | మెరుగు రాజయ్య S/o.చేరాలు | 0–31 | 1–బావి [illegible] |
| | | | | | మెరుగురాజయ్య S/o.చేరాలు | | | |
| మొత్తం విస్తీర్ణం | | | | ఎ. 2–23 గుంటలు | | | ఎ. 2–23 గుంటలు | |

ఇట్టి ప్రకటన భూ సేకరణలో సముచిత పరిహారము మరియు పారదర్శకత, పునరావాస, పునరాశ్రయ హక్కు చట్టం –2013 (నెం. 30/2013) లోని నియమంలోని సెక్షన్ –11(1) ప్రకారం సంబంధిత యజమానులకు సరియైన భూ నష్ట పరిహారం చెల్లించుటకుగాను ఇట్టి ప్రకటన జరిచేయనైనది.
భూమి యొక్క ప్లాన్ మరియు వివరములు జిల్లా కలెక్టర్, హనుమకొండ మరియు రెవెన్యూ డివిజనల్ అధికారి, హనుమకొండ గారి కార్యాలయములో లభ్యము గలదు. సంబంధిత వ్యక్తులు ఏదైనా పనిదినములలో కార్యాలయ సమయములో తనిఖీ చేసుకోవచ్చును, జిల్లా కలెక్టర్, హనుమకొండ గారు భూ సేకరణ అధికారి/రెవెన్యూ డివిజనల్ అధికారి, హనుమకొండ గారిని మరియు వారి సిబ్బందిని ఇట్టి భూ సేకరణకు సమబందిచిసెక్షన్ –12 ప్రకారం పైన తెలిపిన భూములలో ఏదైనా ప్రదేశములో ప్రవేశించి సర్వే భూమి కొలతలు తీసుకొనుటకు మరియు ఇత్యాది పనులు చేపట్టడానికి అనుమతించనైనది.
సదరు చట్టములోని సెక్షన్ 11 (4) ననుసరించి, సేకరణకు ప్రతిపాదించిన భూములందు జిల్లా కలెక్టర్, హనుమకొండ గారి అనుమతి లేకుండా, ఇట్టి ప్రాథమిక ప్రకటన జారీ చేసిన తేది నుండి జాబితాలో ప్రకటించిన భూములకు సంబందించి క్రయ విక్రయాలు లేదా ఏ విధమైన లావాదేవీలు జరుపరాదని తెలియజేయనైనది.
ప్రతిపాదిత భూసేకరణపై ఏమైనా అభ్యంతరములు గాని ఆక్షేపణలు గాని ఉన్న యెడల పరిష్కారము కొరకు ప్రభావితమైన ప్రయోజనము గల వ్యక్తులందరూ, సదరు చట్టములోని సెక్షన్ (15) ననుసరించి. ఇట్టి ప్రకటన ప్రచురించబడిన తేది నుండి (60) దినములలోగా జిల్లా కలెక్టర్, హనుమకొండ గారికి / అధీకృత అధికారి గారికి లిఖిత పూర్వకంగా దాఖలు చేసుకోవచ్చును.

సం/– భూ సేకరణ అధికారి రెవెన్యూ డివిజనల్ అధికారి హనుమకొండ
సం/– అదనపు కలెక్టర్ హనుమకొండ
సం/– జిల్లా కలెక్టర్ హనుమకొండ
DIPR RO NO. 442/LA/PP/Advt/Pub/2024-25

## రెండు దశాబ్దాల్లో మూడు రెట్లు

# పెరుగనున్న వృద్ధ భారతం



**న్యూఢిల్లీ:** భారతదేశంలో వద్ధుల జనాభా వేగంగా పెరుగుతోందని గణాంకాలు వెల్లడిస్తున్నాయి. రానున్న 25 ఏళ్లలో దేశంలో వద్ధుల సంఖ్య మూడు రెట్లు పెరగనుందని నిపుణులు అంచనా వేస్తున్నారు. భారతదేశంలో వద్ధుల సంఖ్య దాదాపు 10.40 కోట్లు (104 మిలియన్లు). ఇది 2050 నాటికి 31.90 కోట్లకు (319 మిలియన్లు) చేరవచ్చని నిపుణులు చెబుతున్నారు. పెరుగుతున్న వద్ధులకు ఆరోగ్య సంరక్షణ కల్పించేందుకు ప్రభుత్వాలు తక్షణమే దష్టి సారించాల్సిన అవసరం ఉందని అంటున్నారు. వద్ధాప్య దశలో శారీరక, మానసిక ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది. తద్వారా వద్ధులు దీర్ఘకాలం జీవించగలుగుతారు. అయితే ఇదే సమయంలో వద్ధుల ఆరోగ్య సం బంధిత సవాళ్లు అంతకంతకూ పెరుగుతున్నాయని నిపుణులు చెబుతున్నారు. అసోసియేటెడ్ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఆఫ్ ఇండియా(అసోచమ్) నేషనల్ కౌన్సిల్ ఆన్ సీఎస్ఆర్ చైర్మన్ అనిల్ రాజ్‌పుత్ ఇటీవల ఒక సదస్సులో మాట్లాడుతూ వద్ధులకు వారి స్వతంత్రతను కాపాడుకునేందుకు, చురుకుగా ఉండటానికి అనువైన విధానాలు అనుసరించడం అవసరమని అన్నారు. ప్రపంచవ్యాప్తంగా వద్ధాప్యం అనేది 21వ శతాబ్దపు అతిపెద్ద సామాజిక సవాళ్లలో ఒకటిగా మారింది. వచ్చే రెండున్నర దశాబ్దాల్లో భారతదేశంలో వద్ధుల సంఖ్య మూడు రెట్లు పెరుగుతుందనే అంచనాలున్నాయి.

వద్ధాప్య సంరక్షణపై కార్పొరేట్ రంగం, సమాజం, ప్రభుత్వాలు క్రియాశీల సహకారం అందించడం అవసరమని నిపుణులు చెబుతున్నారు. న్యూఢిల్లీలోని సర్ గంగారాం ఆసుపత్రి కార్డియాలజిస్ట్ డాక్టర్ సుభాశ్ మంచాంద ఇదే అంశంపై మాట్లాడుతూ వద్ధులకు వచ్చే గుండె జబ్బులు, అధిక రక్తపోటు, మధుమేహం, కీళ్ల సమస్యలను నియంత్రించడంలో యో గా ఎంతగానో ఉపయోగపడుతుందని సూచించారు. యోగాభ్యాసం వద్ధాప్య ప్రభావాలను నెమ్మదింపజేస్తుందని శాస్త్రీయ అధ్యయనాలు నిరూపించాయి. వద్ధులు క్రమం తప్పకుండా యోగా చేయాలని, ఆరోగ్యంపై మరింత శ్రద్ధ వహించాలని సుభాశ్ పేర్కొన్నారు. ఢిల్లీలోని ఎయిమ్స్‌లో గల వద్ధాప్య క్లినిక్ మాజీ సీనియర్ సలహాదారు ప్రొఫెసర్ వినోద్ కుమార్ మాట్లాడుతూ ఆరోగ్యకరమైన, సంతోషకరమైన వద్ధాప్యం కోసం ప్రజలు సమతుల ఆహారం తీసుకోవడం చాలా అవసరమని అన్నారు. అనారోగ్యకరమైన ఆహారాలకు పూర్తిగా దూరంగా ఉండాలని, క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలని సూచించారు. వ్యాయామం రోగనిరోధక శక్తిని బలపరుస్తుందని, వ్యాధులను నివారించడానికి సహాయపడుతుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ ప్రతిరోజూ 30 నుండి 60 నిమిషాల పాటు శారీరక శ్రమ లేదా వ్యాయామం చేయాలని, తగినంతసేపు నిద్రించాలని సలహా ఇచ్చారు.

# కుబేరుల్లో భారత్‌కు మూడోస్థానం



## 2024లో 185కు పెరిగిన బిలియనీర్లు: జాబితాలోకి కొత్తగా 32 మంది

**న్యూఢిల్లీ:** అత్యధిక మంది కుబేరులు ఉన్న దేశం గా భారత్ మూడవ స్థానంలో నిలిచింది. 835 మందితో అమెరికా అగ్రస్థానంలో ఉంటే... 427 మందితో చైనా రెండవ స్థానంలో ఉంది. 2024 నాటికి భారత్‌లో సంపన్నుల సంఖ్య 185కు చేరిం ది. అంటే 12 నెలల్లో 32 మంది బిలియనీర్ల జాబితాలోకి చేరారు. బిలియనీర్ల సందప ఏడాది కాలం లో 42.1శాతం పెరిగి 905.6 బిలియన్ డాలర్లు అయ్యింది. ఈ మేరకు యూబీఎస్ బిలియనీర్ యాంబిషన్స్ రిపోర్టు పేర్కొంది. మరోవైపు అమెరి కా కుబేరుల్లో 84 మంది పెరుగగా... చైనాలో 93 మంది తగ్గారు. అమెరికా కుబేరుల ఆస్తి మొత్తం విలువ 4.6 ట్రిలియన్ డాలర్ల నుంచి 5.8 ట్రిలియన్ డాలర్లకు పెరిగింది. అదే చైనాలో క్షీణత కనిపించింది. ఆ దేశ కుబేరుల ఆస్తి మొత్తం 1.8 ట్రిలియన్ డాలర్ల నుంచి 1.4 ట్రిలియన్ డాలర్లకు తగ్గింది. 2015–24లో ప్రపంచ బిలియనీర్ల సంప ద మొత్తంగా 121శాతం పెరిగింది. 6.3 ట్రిలియ న్ డాలర్ల నుంచి 14 ట్రిలియన్ డాలర్లకు చేరింది. అదే సమయంలో బిలియనీర్ల సంఖ్య 1,757 నుంచి 2,682కు పెరిగింది. భారత్‌లో గణనీయమైన పెంపుదల నమోదైనట్లు బిలియనీర్ యాంబిషన్స్ రిపోర్టు తెలిపింది. వచ్చే పదేళ్లలో బిలియనీర్ ఎంట్రప్యూనర్లు మరింతగా పెరుగుతారని... నా లుగేళ్ల కింద ట చైనా ఉన్న స్థితిలో ఇప్పుడు భారత్‌లో ఉం దని పేర్కొంది. భారత్‌లో 108 గుర్తింపు కలిగిన కుటుంబ వ్యాపారాలను గుర్తించినట్లు నివేదిక వెల్లడించింది. ఈ విభాగంలోనూ భారత్ మూడవ స్థానంలో నిలిచినట్లు తెలిపింది. భారత ఆర్థిక పరివర్తనంలో కుటుంబ వ్యాపారాల పాత్ర కీలకమని పేర్కొంది. ప్రపంచ దేశాలతో పోల్చితే భారత్‌లో గుర్తింపు కలిగిన కుటుంబ వ్యాపారాలు ఎక్కువగానే ఉన్నాయని, వీటిలో చాలా వరకు తరతరాలుగా సాగుతున్నాయని నివేదిక తెలిపింది. ఫార్మా, ఎడ్‌టెక్, ఫిన్‌టెక్, ఆహార సరఫరా సంబంధిత ఎంట్రప్రెన్యూర్లు నూతన ఆర్థిక వ్యవస్థలో అవకాశాలను అందిపుచ్చుకుంటున్నారని తమ సర్వేలో వెల్లడైనట్లు బిలియనీర్ యాంబిషన్స్ రిపోర్టు పేర్కొంది.

# మోదీని చంపేస్తాం...

## ముంబై పోలీసులకు అందిన బెదిరింపు

**ముంబై:** ప్రధాని మోదీని చంపేస్తామంటూ ముంబై పోలీసులకు శనివారం ఓ బెదిరింపు సందేశం అందింది. రాజస్థాన్, అజ్మీర్‌కు చెందిన ఫోన్ నంబరు నుంచి ఈ సందేశం వచ్చినట్లు గుర్తించారు. నిందితుడిని అదుపులోకి తీసుకునేందుకు పోలీసు బృందాన్ని అక్కడకు పంపినట్లు ఓ అధికారి తెలిపారు. 'తెల్లవారుజామున ట్రాఫిక్ పోలీసుల హెల్ప్ లైన్‌కు ఓ వాట్సాప్ సందేశం వచ్చింది. ఇద్దరు ఐఎస్ఐ ఏజెంట్లు... మోదీ లక్ష్యంగా బాంబు పేలుడుకు ప్రణాళిక రచిస్తున్నట్లు అందులో ఉంది' అని అధికారి వెల్లడించారు. నిందితుడు బహుశ మతిస్థిమితం లేని వ్యక్తి అయివుండాలి లేదంటే మద్యం మత్తులో దీనిని పంపించి ఉండాలన్న సందేహం ఉన్నట్లు చెప్పారు. అయితే భారతీయ న్యాయ సంహితలోని సెక్షన్ల కింద ఎఫ్ఐఆర్ నమోదు చేశామన్నారు. ముంబై ట్రాఫిక్ పోలీసుల హెల్ప్‌లైన్‌కు బెదిరింపు సందేశం రావడం ఇది మొదటిసారి కాదు. గతంలోనూ సందేశాలొచ్చాయి.

# పార్టీదే తుది నిర్ణయం

## రాజకీయ వారసత్వంపై మమత



**కోల్‌కతా:** తన రాజకీయ వారసులెవరన్న దానిపై పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి, తణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతాబెనర్జీ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఆమె తాజాగా ఓ టీవీ ఛానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడుతూ 'నా రాజకీయ వారసులెవరన్న దానిపై తణమూల్ కాంగ్రెస్ పార్టీ నిర్ణయం తీసుకుంటుంది. పార్టీ అంటే నేనొక్కదాన్నే కాదు. మా పార్టీ నేతలు, కార్యకర్తలంతా క్రమశిక్షణ కలిగిన సైనికులు. మాకు ఎమ్మెల్యేలు, ఎంపీలు, బూత్ కార్యకర్తలు ఉన్నారు. ఇంతమంది కలిస్తేనే పార్టీ అవుతుంది. నా రాజకీయ వారసులపై పార్టీలో ఉన్నవారంతా కలిసి నిర్ణయం తీసుకుంటారు. పార్టీలోకి ఈరోజు కొత్తగా వచ్చినవారు రేపు సీనియర్లవుతారు' అని మమత వ్యాఖ్యానించారు. తణమూల్ కాంగ్రెస్ పార్టీలో సీనియర్లు, జూనియర్ల మధ్య గ్రూపు తగాదాలు జరుగుతున్న వేళ మమత వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. కాగా, తణమూల్ కాంగ్రెస్‌లో మమత తర్వాత ఆమె మేనల్లుడు అభిషేక్ బెనర్జీ పార్టీ పగ్గాలు తీసుకుంటారని ప్రచారం జరుగుతున్న విషయం తెలిసిందే.

# 'ఇండియా' సారథి మమత

## ప్రతిపక్షాల్లో భిన్న స్వరాలు



**న్యూఢిల్లీ:** లోక్‌సభ ఎన్నికల్లో ఓటమి, ఇటీవల జరిగిన హర్యానా, మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమితో విపక్షాలు తర్జనభర్జన పడుతున్నాయి. ఇండియా ఐక్యసంఘటనకు ఎవరు నాయకత్వం వహిస్తారనే విషయంపై చర్చ మొదలైంది. ఇదే సమయంలో అవకాశం వస్తే ప్రతిపక్ష కూటమికి తాను సమర్థవంతంగా నాయకత్వం వహిస్తానని పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ప్రకటించారు. దీనిపై విపక్షంలో భిన్న స్వరాలు వినిపిస్తున్నాయి. మమతకు ఆ బాధ్యతలు అప్పగించడాన్ని కాంగ్రెస్ తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. మరోవైపు... ఆమెకు సమాజ్‌వాదీ పార్టీ, శివసేన (యూబీటీ) నేతలు మద్దతు తెలుపుతున్నారు. దీంతో కూటమిలో గందరగోళ వాతావరణం నెలకొంది. 'సీఎం మమతకు కూటమి బాధ్యతలు అప్పగించేందుకు మేం పూర్తి మద్దతు తెలుపుతున్నాం. ఆమె నేతత్వంలోని తృణమూల్ కాంగ్రెస్ పశ్చిమబెంగాల్‌లో బీజేపీకి గట్టి పోటీ ఇస్తోంది. ఆ పార్టీని నిలువరించడంలో సమర్థవంతంగా పని చేస్తోంది. ఈ అంశాలను పరిగణనలోకి తీసుకొని దీనిపై నేతలంతా సమగ్ర చర్చలు జరపాలి. ఆమెకు మద్దతు ఇవ్వాలని కోరుతున్నాం' అని సమాజ్‌వాదీ పార్టీ జాతీయ ప్రతినిధి ఉదయ్‌వీర్ సింగ్ అన్నారు. 'హర్యానా, మహారాష్ట్ర ఎన్నికల్లో కూటమి విజయం సాధించకపోవడానికి కారణం కాంగ్రెస్సే. ఆ రాష్ట్రాల్లో ఆశించిన ఫలితాలు రాలేదు. ఆ తప్పిదాలకు బాధ్యత కూడా వారిదే' అని విరుచుకుపడ్డారు. మరోవైపు ఆర్జేడీ స్పందిస్తూ ఇండియా ఐక్యసంఘటనకు బీహార్ మాజీ సీఎం లాలూ ప్రసాద్ యాదవ్ సరైన రూపశిల్పి అవుతారని పేర్కొంది. 'కాంగ్రెస్ ఒకసారి ఆత్మపరిశీలన చేసుకోవాలి. హర్యానా, మహారాష్ట్ర ఎన్నికల్లో కూటమి భాగస్వాములకు చోటు కల్పించలేదు. లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల వేళ ఆ పార్టీ మిత్ర పక్షాల మాట విని ఉంటే ఫలితాలు భిన్నంగా ఉండేవి' అని సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా విమర్శించారు. మమతకు బాధ్యతలు అప్పగించడాన్ని కాంగ్రెస్ తీవ్రంగా వ్యతిరేకించింది. 'మమత చెప్పినట్లు ఆమె పార్టీ నడుస్తుంది. అదేవిధంగా మేము కూడా మా పార్టీ నిర్ణయాలనే పాటిస్తాం' అని ఆ పార్టీ నాయకులు అంటున్నారు.

# మహా వికాస్ అఘాడీతో..ఎస్‌పి 'దోస్తానా కటీఫ్' !

## సమాజ్‌వాదీ పార్టీ మహారాష్ట్ర చీఫ్ అబూఅజ్మీ వెల్లడి



**ముంబయి :** మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలలో మహావికాస్ అఘాడీ (ఎంవిఎ) ఓటమి పాలైన తర్వాత ఆ కూటమిలోని భాగస్వామ్యపార్టీల మధ్య విభేదాలు మొదలయ్యాయి. ఎంవిఎ కూటమి నుంచి సమాజ్‌వాదీ పార్టీ వీడనున్నట్లు శనివారం మహారాష్ట్ర ఎస్‌పి శాఖ ప్రకటించింది. బాబ్రీమసీదు కూల్చివేతకు (డిసెంబర్ 6)పాల్పడిన వారికి శివసేన యుబిటి ఎంఎల్‌సి మిలింద్ నర్వేకర్ సామాజిక మాధ్యమాలలో పోస్ట్ పెట్టడమే కాకుండా ఒక దినపత్రిక అడ్వర్టైజ్ మెంట్ ద్వారా ఆయన అభినందనలు తెలియజేస్తూ, ఆ పనిచేసినందుకు తనకుగర్వంగా ఉందని శివసేన అగ్రనేత వ్యాఖానించినట్లు ఒక అడ్వర్టైజ్‌మెంట్ ఇవ్వడాన్ని సమాజ్‌వాదీ పార్టీ (ఎస్‌పి)తీవ్రం గా ఆక్షేపించింది. ఆ చర్య వెనక ఉద్ధవ్ థాక్రే ఉన్నారని ఎస్‌పి మండిపడింది.'బాబ్రీ మసీదు కూల్చివేత పనిని ఎవరైతే చేశారో వారికి నేను కంగ్రాట్యులేషన్స్ చెబుతున్నాను' అని, శివసేన వ్యవస్థాపకులు బాల్‌థాక్రే వ్యాఖ్యానించినట్లు ఉన్న ఫోటోను అందులో ఉపయోగించారు. యుబిటి చీఫ్ సన్నిహితుడు, ఎంఎల్‌సి మిలింద్ నర్వేకర్ సామాజిక మాధ్యమంలో పోస్ట్ పెట్టడమే కాకుండా, ఒక దినపత్రికలో అడ్వర్టైజ్‌మెంట్ ద్వారా అభినందనలు తెలియజేయడం మహావికాస్ అఘాడీతో సమాజ్‌వాదీ తెగతెంపులు చేసుకునేంతవరకూ పరిస్థితి దారితీసింది. మహారాష్ట్ర సమాజ్‌వాదీ పార్టీ (ఎస్‌పి) చీఫ్ అబూ అజ్మీ శనివారం ఈ విషయాన్ని సామాజికమాధ్యమం 'ఎక్స్'లో పెట్టిన పోస్ట్‌లో స్పష్టంచేశారు.మహావికాస్ అఘాడితో తెగతెంపుల విషయాన్ని సమాజ్‌వాదీ పార్టీ చీఫ్ అఖిలేష్ యాదవ్ దృష్టికి తీసుకువెళ్లనున్నట్లు చెప్పారు.మహావికాస్ అఘాడీలోని ఏ ఒక్కరూ అలాంటి పోస్ట్ పెట్టినా తప్పే అవుతుంది. అటువంటప్పుడు బిజెపికి, వారికి మధ్య తేడా ఏమున్నది అని అబూ అజ్మీ ప్రశ్నించారు. ఇలా చేస్తే మేం వారితో ఎలా కలిసి ఉండాలి? అన్నారు. బాబ్రీ మసీదు కూల్చివేసినప్పటికీ ఏ ఒక్కరూ శిక్షింపబడలేదన్నారు. అయితే కారకులను శిక్షించనప్పటికీ ప్రజ లు మర్చిపోయినా ఆ గాయాలు మాత్రం ఇంకా నయంకాలేదన్నా రు. కాంగ్రెస్ పార్టీ కూడా భాగస్వామిగా ఉండాలా? లేదా ? అనే విషయాన్ని తేల్చుకోవాలన్నారు. ఎవరైనా ఇలా మాట్లాడవచ్చా అని విలేకరుల సమావేశంలో ఎస్‌పి మహారాష్ట్ర యూనిట్ చీఫ్ అబూ అజ్మీ తెలియజేశారు. అయితే దీనిని తిప్పికొట్టిన శివసేన (యుబిటి) నేత భాస్కర్ యాదవ్ మాట్లాడుతూ బాబ్రీ మసీదుపై తమ పార్టీ వైఖరి 1992లో ఎలా ఉన్నదో ఇప్పుడు కూడా అలాగే ఉన్నదని స్పష్టం చేశారు. 31సంవత్సరాల తర్వాత శివసేన (యుబిటి) పట్ల సమాజ్‌వాదీ పార్టీకి ఈ వైఖరి గుర్తుకొచ్చిందా అని భాస్కర్ జాదవ్ ప్రశ్నించారు. బహుశా సమాజ్‌వాదీ పార్టీ అధికార కూటమి వైపు వెళ్లాలనుకుంటుందేమో అని భాస్కర్ జాదవ్ వ్యాఖ్యానించారు.సమాజ్‌వాదీ పార్టీ మహారాష్ట్ర చీఫ్ చేసిన ప్రకటనపై కాంగ్రెస్ నాయకుడు నితిన్ రౌత్ మాట్లాడుతూ మహావికాస్ అఘాడీ నుంచి వైదొలగుతామని అబూ అజ్మీ చేసిన ప్రకటనను చూశామని, సమాజ్‌వాదీ పార్టీతో వారి నిర్ణయం గురించి చర్చించి, వారి సమస్య ఏమిటన్నదానిపై ఒక అవగాహనకు వస్తామని రౌతు చెప్పారు.

# హోంశాఖ కోసం షిండే పట్టు



**ముంబై:** మహారాష్ట్రలో ప్రభుత్వ ఏర్పాటుపై కొంతకాలంగా నెలకొన్న ప్రతిష్టంభన తర్వాత రాష్ట్ర ముఖ్యమంత్రిగా బీజేపీ సీనియర్ నేత దేవేంద్ర ఫడ్నవీస్ ప్రమాణస్వీకారం చేశారు. ఏక్‌నాథ్ షిండే, అజిత్ పవార్‌లకు డిప్యూటీ సీఎం హోదా కల్పించారు. కాగా మహాయుతిలో మంత్రిత్వశాఖల కేటాయింపుపై ఇంకా ఎటువంటి నిర్ణయం తీసుకోలేదు. ఈ నేపథ్యంలో షిండేకు సన్నిహితుడిగా పేరున్న ఎన్సీపీ ఎమ్మెల్యే భరత్ కీలక వ్యాఖ్యలు చేశారు. మహారాష్ట్రలో కొత్తగా ఏర్పాటైన మహాయుతి ప్రభుత్వంలో తనకు హోంశాఖ అప్పగించాలని మాజీ సీఎం ఏక్‌నాథ్ షిండే డిమాండ్ చేశారని శివసేన ఎమ్మెల్యే భరత్ గోగవాలే చెప్పారు. ఏక్‌నాథ్ షిండే సీఎంగా ఉన్న సమయంలో ప్రస్తుత సీఎం దేవేంద్ర ఫడ్నవీస్‌కు హోంశాఖ అప్పగించిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. అసెంబ్లీ శీతాకాల సమావేశాలకు ముందే డిసెంబరు 1116 మధ్య కేబినెట్ విస్తరణ ఉంటుందని వెల్లడించారు. నాగపూర్‌లో డిసెంబర్ 16న శాసనసభ శీతాకాల సమావేశాలు ప్రారంభం కానున్నాయి. గత మహాయుతి ప్రభుత్వంలో శివసేనకు ఉన్న శాఖలను మార్చేందుకు కూటమిలో ప్రయత్నాలు జరుగుతున్నాయని మరో శివసేన ఎమ్మెల్యే ఆరోపించారు. కాగా షిండే నేతత్వంలోని ప్రభుత్వంలో మాదిరిగానే ఎన్సీపీ తమ దగ్గరున్న ఆర్థికశాఖను, బీజేపీ హోంశాఖ నిలబెట్టుకునే అవకాశాలు ఉన్నట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. శివసేనకు పట్టణాభివద్ధి, రెవెన్యూ శాఖలు దక్కే అవకాశం ఉన్నట్లు సమాచారం. 288 శాసనసభ స్థానాలు ఉన్న మహారాష్ట్రలో ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో మహాయుతి కూటమి ఘన విజయం సాధించిన సంగతి తెలిసిందే. అయితే, ఆ తర్వాత ప్రభుత్వం ఏర్పాటుపై కూటమిలో ప్రతిష్టంభన నెలకొంది. సీఎం ఎంపిక, శాఖల కేటాయింపుపై బీజేపీ, శివసేన, ఎన్సీపీ మధ్య ఏకాభిప్రాయం కుదరలేదు. డిప్యూటీ సీఎం పదవికి అంగీకరించని ఏక్‌నాథ్ షిండే హోంశాఖ కేటాయించాలని పట్టుబట్టినట్లు వార్తలు వచ్చాయి.

# ప్రజల భద్రతపై దృష్టి పెట్టండి

## కేంద్ర ప్రభుత్వానికి ఆప్ కన్వీనర్ అరవింద్ కేజ్రివాల్ సూచన



**న్యూఢిల్లీ :** అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో, ఢిల్లీ శాంతిభద్రతలపై కేంద్రంలోని బిజెపి నేతృత్వంలోని ఎన్‌డిఎ ప్రభుత్వంపై ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్ శనివారం మండిపడ్డారు. ఈ సమస్యను రాజకీయం చేయకుండా, ప్రజల భద్రతపై దృష్టి పెట్టాలని సూచించారు. ఢిల్లీ పోలీసులను కేంద్ర హోం మంత్రిత్వ శాఖ నియంత్రిస్తున్న విషయం విదితమే. కాగా, మార్నింగ్ వాక్‌లో వ్యాపారవేత్తపై కాల్పులు జరపడం, పంచశీల్ ఎన్‌క్లేవ్‌లో సీనియర్ సిటిజన్ హత్య, దోపిడీ కాల్స్ పెరగడం వంటి వరుస హింసాత్మక సంఘటనలపై ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి ఆందోళన వ్యక్తం చేశారు. 'ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు. శాంతి భద్రతలు దెబ్బతిన్నాయి. సీనియర్ సిటిజన్లు భయపడుతున్నారు. మహిళలకు భద్రత కరువైంది. గ్యాంగ్ వార్‌లు జరుగుతున్నాయి. ఢిల్లీ నలుమూలల్లో డ్రగ్స్ అమ్మకాలు జరుగుతున్నాయి. ఢిల్లీ పోలీసులు ఎక్కడ ఉన్నారు? హోం మంత్రి ఎక్కడ ఉన్నారు? అని కేజ్రీవాల్ నిలదీశారు. కొన్ని నేరాల వెనుక రోహింగ్యాల హస్తం ఉందన్న బిజెపి ఆరోపణలపై కేజ్రీవాల్ మాట్లాడుతూ.. 'వారు రోహింగ్యాలైతే మయన్మార్, బంగ్లాదేశ్ సరిహద్దుల్లో హోంమంత్రి ఎందుకు అడ్డుకోలేదు.. ఒకవేళ ఢిల్లీలో అడుగుపెట్టినా ఎందుకు అడ్డుకోలేదు అని ప్రశ్నించారు. ఢిల్లీ పోలీసులు ఈ అంశాన్ని రాజకీయం చేసే బదులు ఢిల్లీ ప్రజల భద్రతపై దృష్టి పెట్టాలని హితువు పలికారు. వచ్చే ఏడాది ప్రారంభంలో జరగనున్న ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని అధికార, ప్రతిపక్ష పార్టీలు పరస్పరం ఆరోపణలు, ప్రత్యారోపణలకు పాల్పడుతున్నాయి. ఆప్ వరుసగా మూడోసారి అధికారం కోసం పోటీ పడుతుండగా, నగరంలో అధికారాన్ని కాపాడుకోవడంలో విఫలమైన 25 ఏళ్ల పరంపరను బద్దలు కొట్టాలని బిజెపి కృతనిశ్చయంతో ఉంది.

# బినామీ కేసులో అజిత్ పవార్‌కు క్లీన్‌చిట్



**ముంబై:** మహారాష్ట్ర డిప్యూటీ ముఖ్యమంత్రి అజిత్ పవార్‌కు బినామీ ఆస్తుల వ్యవహారంలో ఊరట లభించింది. 2021లో ఐటీ శాఖ సీజ్ చేసిన వెయ్యి కోట్లు విలువ చేసే ఆస్తులకు క్లి యరెన్స్ లభించింది. జరందేశ్వర్ చక్కెర మి ల్లు వ్యవహారంలో అజిత్ పవార్‌కు ఆదాయపు పన్ను అప్పిలేట్ ట్రిబ్యునల్ క్లీన్ చిట్ ఇచ్చింది. అజిత్ పవార్‌పై ఆరోపణలను రుజువు చేసేందుకు తగిన ఆధారాలు లేవని పేర్కొంది. పవార్‌తో పాటు ఇతరులపై ఆరోపణలను కొట్టివేస్తూ తాజా ఉత్తర్వులు జారీచేసింది. ఐటీ, ఈడీ దాడులను ఎదుర్కొన్న అజిత్ పవార్... శరద్ పవార్‌కు చెందిన ఎన్సీపీతో ఆయన వేరుపడ్డారు. బీజేపీ నేతృత్వ మహారాష్ట్ర ప్రభుత్వంలో భాగస్వామి అయ్యారు. ఐటీ అప్పిలేట్ ట్రిబ్యునల్ క్లీన్‌చిట్ ఇవ్వడంపై అజిత్ పవార్ శనివారం విలేకరులతో మాట్లాడుతూ హర్షం వ్యక్తంచేశారు. 'నేను ఏడాదిన్నర కిందట బీజేపీతో చెయ్యి కలిపాను. ఆరోపణలను అన్నివేళలా గుడ్డిగా ఒప్పుకోలేం. అప్పీలు చేసే హక్కు ప్రతి ఒక్కరికీ ఉంటుంది' అని ఆయనన్నారు. చక్కెర మిల్లు కేసు దర్యాప్తులో బినామీ యజమానిగా అజిత్ పవార్‌కు చెందిన వెయ్యి కోట్లు విలువ చేసే ఆస్తులను ఐటీ అధికారులు సీజ్ చేశారు. గతంలో ఎంఎస్‌సీబీ కుంభకోణం, మనీలాండరింగ్ కేసులో ఈడీ కూడా ఈ ఆస్తులను అటాచ్ చేసింది. తాజాగా ఐటీ అప్పీలేట్ ట్రిబ్యునల్ నుంచి అజిత్ పవార్‌కు క్లీన్‌చిట్ లభించింది.

## మహారాష్ట్ర ఎమ్మెల్యేలుగా

# ఫడ్నవీస్, ఏక్‌నాథ్, అజిత్ ప్రమాణం

### ప్రమాణస్వీకారాన్ని బహిష్కరించిన 'ఎంవిఎ'



**ముంబయి :** మహారాష్ట్ర ముఖ్యమంత్రిగా దేవేంద్ర ఫడ్నవీస్, ఉపముఖ్యమంత్రులు ఏక్‌నాథ్ షిండే, అజిత్‌పవార్ ప్రమాణస్వీకారం చేసిన రెండు రోజుల తర్వాత శనివారం నాడు శాసనసభలో శాసనసభ్యులుగా ప్రమాణస్వీకారం చేశారు. ఒక వైపు వారు ప్రమాణస్వీకార ం చేస్తుండగా మరోవైపు ప్రతిపక్ష మహావికాస్ అఘాడీ (ఎంవిఎ) ఈ కార్యక్రమాన్ని బహిష్కరించారు. ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్ల(ఇవిఎం)ను దుర్వినియోగం చేశారని నిరసిస్తూ మహాకూటమి భాగస్వామ్య పార్టీల శాసనసభ్యులు ప్రమాణస్వీకారోత్సవాన్ని బహిష్కరించారు. నూతనంగా ఎన్నికైన మహారాష్ట్ర లెజిస్లేటివ్ అసెంబ్లీలో మూడు రోజుల ప్రత్యేక సమావేశాలలో భాగంగా మొదటి రోజైన శనివారం నాడు ప్రతిపక్ష సభ్యులు ప్రమాణం చేసేందుకు తిరస్కరించడంతో సభలో గందరగోళం నెలకొంది. అధికార మహాయుతి భారీ అనుకూల తీర్పును ఇవ్వడం నమ్మశక్యంగా లేదని, ఇదంతా ఇవిఎంల దుర్వినియోగం పనే అని అనుమానాలు, ప్రశ్నలు లేవనెత్తారు. దేవేంద్ర ఫడ్నవీస్, ఏక్‌నాథ్ షిండే, అజిత్‌పవార్‌ను ప్రొటెమ్ అసెంబ్లీ స్పీకర్ కాళిదాస్ కొలాంబ్కర్ ఎమ్మెల్యేలుగా ప్రమాణం చేయించిన కొద్దిసేపటి తర్వాత ఉదయం 11గంటలకు శాసనసభలో ప్రొసీడింగ్స్ మొదలయ్యాయి. వారికి ముందు చైన్‌సుఖ్ సంచేటి, జయ్‌కుమార్ రావల్ (ఇరువురూ బిజెపి సభ్యులు), మాణిక్‌రావు కోకటే (ఎన్‌సిపి), ఆశీష్ జైస్వాల్ (శివసేన) సభ్యులు ప్రమాణస్వీకారం చేశారు. మహారాష్ట్ర గవర్నర్ సిపి.రాధాకృష్ణన్ వారిని ప్రొటెమ్ స్పీకర్ ప్యానెల్‌లో సభ్యులుగా నియమించిన నేపథ్యంలో వారి ప్రమాణస్వీకారం తొలుత జరిగింది. దీంతో చైన్‌సుఖ్ సంచేటి, జయ్‌కుమార్ రావల్ శనివారం నాడు తొలుత ప్రమాణం చేసిన ఎమ్మెల్యేలు అయ్యారు. ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ నాగ్‌పూర్ సౌత్‌వెస్ట్ అసెంబ్లీ నియోజకవర్గానికి ప్రాతినిథ్యం వహిస్తున్నారు. దేవేంద్ర ఫడ్నవీస్ ఆరవసారి సభ్యుడిగా అసెంబ్లీలో ప్రమాణస్వీకారం చేసినవారయ్యారు. డిప్యూటీ సిఎం అజిత్ పవార్ బారామతి అసెంబ్లీ స్థానానికి ప్రాతినిథ్యం వహిస్తున్నారు. ఆయన 1991లో తొలిసారి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. అనంతరం విధాన్ భవన్ ప్రాంగణంలో శివసేన (యుబిటి)నాయకుడు ఆదిత్య థాకరే మాట్లాడుతూ మొదటి రోజు మహావికాస్ అఘాడీ సభ్యులు ప్రమాణం చేయకూడదని నిర్ణయించుకున్నాం. భారీ మెజార్టీతో ప్రభుత్వం అధికారంలోకి వస్తే అక్కడ సెలబ్రేషన్స్ జరగాలి. కానీ ప్రజల తీర్పు ద్వారా కాకుండా ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్ల (ఇవిఎం), భారత ఎన్నికల సంఘం(ఇసిఐ) సహాయంతో వారు అధికారంలోకి వచ్చారని ఆరోపించారు. మహారాష్ట్రలోని సోలాపూర్ అసెంబ్లీ నియోజకవర్గంలోని మర్కడ్‌వాడీ గ్రామంలో ఎప్పుడైతే మాక్‌పోల్ ఉపయోగించే బ్యాలెట్ పేపర్లకు వ్యతిరేకంగా ప్రతిపక్షాలు నిరసనలు తెలుపుతుండగా ప్రభుత్వం కర్ఫ్యూ విధించడం, అరెస్ట్‌లకు పాల్పడటాన్ని బట్టే అర్థం చేసుకోవాలని ఆదిత్య థాకరే చెప్పారు. ప్రజల మనస్సులో సందేహాలు ఉంటే మేం ప్రమాణస్వీకారం చేయాలని ఎలా అనుకుంటాం అని ఆయన తెలియజేశారు. బిజెపి సారథ్యంలో మహాయుతి కూటమి తరపున జట్టుకట్టిన ఏక్‌నాథ్ షిండే శివసేన, అజిత్ పవార్ నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎన్‌సిపి) మహారాష్ట్రలో అధికారాన్ని నిలబెట్టుకుంది. 288అసెంబ్లీ స్థానాలకు గాను, బిజెపి 132స్థానాలు, శివసేన 57స్థానాలు, ఎన్‌సిపి 41సీట్లలో గెలుపొందాయి. మహావికాస్ అఘాడీ 46సీట్లలో విజయం సాధించింది. ఎంవిఎ కూటమిలో భాగస్వామిగా ఉన్న శివసేన (యుబిటి) 20స్థానాలలో విజయం సాధించగా, కాంగ్రెస్ 16స్థానాలలో, ఎన్‌సిపి(ఎస్‌పి) 10స్థానాలను గెలుచుకున్నాయి.

# మా మధ్య ఎలాంటి ఒప్పందాలు లేవు: డికే

**బెంగళూరు:** సీఎం సిద్దమరాయమ్యకు తనకు మధ్య అధికారాన్ని పంచుకునేలా ఒప్పందం జరగలేదని, ఎలాంటి ఫార్ములా లేదని కర్నాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ తెలిపారు. అయితే తమ మధ్య రాజకీయపరమైన అవగాహన ఉన్నట్లు చెప్పారు. 'మా మాధ్య ఒప్పందం జరగలేదు. ఎలాంటి ఫార్ములా లేదు. రాజకీయ అవగాహనతో పనిచేస్తున్నాం. దీని గురించి పార్టీలో ఎవరూ మాట్లాడొద్దు' అని కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు కూడా అయిన డీకే శివ అన్నారు. తానెప్పుడు ఫార్ములా లేదా ఒప్పందం గురించి మాట్లాడలేదని చెప్పారు. తామిద్దరం రాజకీయపరమైన అవగాహనతో పనిచేస్తున్నట్లు జాతీయ మీడియాకు చెప్పినట్లు శనివారం విలేకరులతో మాట్లాడిన ఆయన న్నారు. ముఖ్యమంత్రి సిద్దరామయ్య చెప్పిందే చివరి మాట... ఇక దీనిపై చర్చ రాకూడదని డీకే శివ అన్నారు. అధికారంలోకి రాక ముందే తమ మధ్య అవగాహన కుదిరినట్లు ఓ వార్తా ఛానల్‌తో శివకుమార్ బుధవారం చెప్పడం చర్చకు దారితీసింది. అలాంటిదేమీ లేదంటూ సిద్దరామయ్య ఇప్పటికే దీనిపై స్పష్టతిచ్చారు.

# అత్యాచారం కేసులో నటుడి అరెస్టు... వెంటనే బెయిల్



**తిరువనంతపురం:** అత్యాచార కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న మలయా ళ నటుడు సిద్ధిఖీని పోలీసులు అరెస్టు చేశారు. అయితే, గంటల వ్యవధిలోనే ఆయనకు బెయిల్ లభించింది. ఈ కేసు విచారణ నిమిత్తం ఆయన దర్యాప్తు సంస్థ ఎదుట హాజరయ్యారు. అనంతరం ఆ నటుడిని పోలీసులు అరెస్టు చేశా రు. ఆ తర్వాత వైద్య పరీక్షలు నిర్వహించి కోర్టులో హాజరుపర్చారు. అక్కడ ఆ యనకు బెయిల్ లభించడంతో సిద్ధిఖీ విడుదలయ్యారు. నవంబర్‌లో సుప్రీంకోర్టు ఆయనకు మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది. బెయిల్ గడువు ముగియడంతో సిద్ధిఖీని పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ అరెస్ట్ సినిమా పరిశ్రమతో పాటు రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. మలయాళ సినీ రంగంలో మహిళలు ఎదుర్కొంటున్న ఇబ్బందికర పరిస్థితులపై జస్టిస్ హేమ కమిటీ సిద్ధం చేసిన నివేదిక ఆ పరిశ్రమను కుదిపేస్తోంది. దర్శక నిర్మాతలను ఉద్దేశించి కొంతమంది నటీమణులు ఆరోపణలు చేస్తున్నారు.

**CHANGE OF NAME**

**I, PANDUGA RAJESH,** S/o. Panduga Pentaiah, H.No. 3-84, Gundampally Village, Dilawarpur Mandal, Nirmal District. My old name is **Rajesh S/o Pentaiah.** Changed My New Name as " **Panduga Rajesh S/o Panduga Pentaiah.**

**డాక్యుమెంట్స్ పోయినవి**

నేను, **జమ్మ కవిత, భర్త: రాము,** గ్రామం: ఆదిభట్ల, మండలం: ఇబ్రహీంపట్నం, రంగారెడ్డి జిల్లా. తెలంగాణ రాష్ట్రం. **ఒరిజినల్ లింక్ డాక్యుమెంట్ నెంబర్: 5560/2020,** బస్‌లో యాచారం నుండి ఆదిబట్లకు వెళ్లే మార్గమధ్యలో ఎక్కడో పడిపోయినది. ఎంత వెతికినా దొరకలేదు. ఎవరికైన దొరికినచో వారు ఈ ఫోన్ నెంబర్: 9390350094కు సమాచారం అందించి ఇవ్వగలరు.

ఇట్లు: జమ్మ కవిత,
ఆదిబట్ల గ్రామం




## భోపాల్ విపత్తు సజీవం..



భోపాల్‌లోని యూనియన్ కార్బైడ్ ఇండియా లిమిటెడ్ (యుసిఐఎల్) ప్లాంటులో గ్యాస్ లీకేజీ ఘటన జరిగిన నలభై సంవత్సరాలు పూర్తయ్యా యి. 1984 డిసెంబర్ 2వ తేదీ అర్ధరాత్రి దాటిన తర్వాత సంభవించిన విపత్తుకు సంబంధించి ఇప్పటికీ ఆ ప్లాంటు చుట్టూ అనేక వందల టన్నుల విష వ్యర్థాలు ఇప్పటికీ మిగిలి ఉండడం ఆందోళన కలిగిస్తున్న విషయం. ఈ విపత్తు ఇప్పటికీ సజీవంగానే ఉందని, స్థానికులను అనేక రకాలుగా వేధిస్తున్నదని తాజా నివేదికలు పేర్కొంటున్నాయి. నాఫ్తాల్‌తో మిథైల్ ఐసోసైనేట్ (ఎంఐసి) ప్రతిచర్య ఆధారంగా కార్బరిల్ అనే పురుగుల మందును తయారు చేయడానికి 1960 దశకంలో ఈ ప్లాంటు నిర్మాణం జరిగింది. ఎంఐసి అనేది అత్యంత విషపూరిత సమ్మేళనం. ఇది అధిక ఉష్ణోగ్రతల వద్ద నీటితో ప్రతిచర్యకు లోనవుతుంది. ఉష్ణాన్ని విడుదల చేస్తుంది. 1984, డిసెంబర్ 2వ తేదీ రాత్రి ప్లాంటులోని ఎంఐసిని నిల్వచేసే ట్యాంక్‌లోకి భారీగా నీరు చేరింది. దీనితో ఎంఐసి తీవ్ర ఉష్ణోగ్రతను విడుదల చేయడం ఆరంభమైంది. ట్యాంక్‌ను చల్లబరచడానికి, ప్లాంట్‌లో ఇతరత్రా సదుపాయాలు లేకపోవడంతో, నీటి ఆవిరి బయటకు విడుదలైంది. ఎంఐసి కాన్‌సెంట్రేటెడ్‌గా ఉన్నప్పుడు ఎలాంటి వాసన ఉండదు. అయితే, ఇది కళ్లకు హానికరంగా మారవచ్చు. కానీ, ఇతర వాయువులతో కలిస్తే మాత్రం విషతుల్యమవుతుంది. కాగా, 3వ తేదీ తెల్లవారు జామున ముందే గ్యాస్ విడుదలై, ఆ ప్రాంతమంతటా వ్యాపించింది. ఇంకా తెల్లవారక పోవడంతో చాలా మంది ప్రజలు నిద్రలో ఉన్నారు. ప్రాణాంతకమైన గ్యాస్ పీల్చి ఉమారు 22,000 మంది ప్రజలు ప్రాణాలు కోల్పోయారు. లక్షలాది మంది వివిధ రకాల రోగాలబారిన పడ్డారు. ఎంఐసితోపాటు ప్లాంటు నుంచి ఏఏ వాయువులు లీక్ అయ్యాయనే విషయాన్ని యూనియన్ కార్బైడ్ కార్పొరేషన్ ఎన్నడూ అధికారికంగా ప్రకటించలేదు. అయితే, మృతికి గల కారణాలు తెలుసుకునేందుకు నిర్వహించిన అటాప్సీ పరీక్షలతోపాటు, తీవ్రమైన అనారోగ్యానికి గురైన వారి రక్త నమూనాలను పరీక్షించినప్పుడు, ప్లాంటు నుంచి విడుదలైన గ్యాస్‌లో హైడ్రోజన్ సైనైడ్ ఉన్నట్టు రుజువైందని అంటున్నారు. అయితే, సంస్థ నుంచి ఇంత వరకూ ఎలాంటి ప్రకటన లేదు. ఈ ఘటనపై విచారణ నిర్వహించిన గ్రీన్‌పీస్ 1999లో విడుదల చేసిన నివేదికలో కొన్ని అంశాలను ప్రస్తావించింది. ప్లాంటు సైట్‌లో సేకరించిన నమూనాల విశ్లేషణ ఆధారంగా పాదరసం, క్రోమియం, రాగి, నికెల్, సీసం నమూనాలు ఉన్నాయన్న నిర్ధారణకు వచ్చారు. ఇతర సమ్మేళనాలలో హెక్సాక్లోరోబుటాడిన్, క్లోరోఫామ్, కార్బన్ టెట్రాక్లోరైడ్, ట్రైక్లోరోబెంజీన్ ఉనికిని కూడా నివేదిక పేర్కొంది. ఈ నివేదికపై కూడా సంస్థ నుంచి సరైన స్పందన లేదు. దీనితో యూనియన్ కార్బైడ్ చిమ్మిన విషం ఏమిటనే విషయంపై సస్పెన్స్ కొనసాగుతునే ఉంది.



## డాలర్‌కు కష్టకాలం!



అంతర్జాతీయ వాణిజ్యాన్ని శాసిస్తున్న అమెరికా డాలర్‌కు కష్టకాలం వచ్చినట్టు ఇటీవల చోటు చేసుకుంటున్న పరిణామాలు స్పష్టం చేస్తున్నాయి. అమెరికా అధ్యక్షుడిగా ఎన్నికైన రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి, మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన ప్రకటన ఈ వాదనకు బలాన్నిస్తున్నది. 'బ్రిక్స్' కూటమి కొత్త మరకాన్ని సూచించినా లేదా తీసుకొచ్చినా, దానిపై 100 శాతం టారిఫ్‌లను విధిస్తామని ట్రంప్ ప్రకటించడం వెనుక అమెరికా ఆందోళన స్పష్టంగా కనిపిస్తున్నది. ఇప్పటి వరకూ అంతర్జాతీయ విపణిలో డాలర్‌దే పైచేయి. గత్యంతరం లేని పరిస్థితుల్లో అన్ని దేశాలూ డాలర్ మాధ్యమంగానే లావాదేవీలు నిర్వహిస్తున్నాయి. అమెరికా ఫెడ్ రిజర్వ్ వడ్డీ రేట్ల నుంచి అమెరికా ప్రభుత్వం తీసుకునే నిర్ణయాల వరకూ, ప్రతి అంశం డాలర్ విలువపై తీవ్ర ప్రభావాన్ని చూపుతున్నది. ఫలితంగా అంతర్జాతీయ మార్కెట్‌లో ప్రకంపనలు తప్పడం లేదు. ఈ అంశాన్ని దృష్టిలో ఉంచుకొని, గ్లోబల్ ట్రేడ్‌లో డాలర్ ఆధిపత్యాన్ని సవాలు చేయాలన్న ప్రతిపాదన చాలాకాలంగా ఉంది. రూపాయి మారకంగా వాణిజ్యానికి భారత్ ఇప్పటికే కొన్ని దేశాలను ఒప్పించింది. 'బ్రిక్స్' కూటమి కూడా డాలర్ ఆధిపత్యానికి గండికొట్టాలన్న పట్టుదలతో ఉంది. ఈ పరిణామాల నేపథ్యంలో, డాలర్‌కు ప్రత్యామ్నాయంగా వచ్చే కరెన్సీపై నూరు శాతం పన్ను తప్పదని ట్రంప్ హెచ్చరించారు. బ్రెజిల్, రష్యా, ఇండియా, చైనా, దక్షిణాఫ్రికా సభ్యదేశాలుగా ఉన్న 'బ్రిక్స్'కు డాలర్‌ను దెబ్బకొట్టే శక్తిసామార్థ్యా లు ఉన్నాయని అమెరికాకు తెలుసు. ఇప్పటికే చైనా నుంచి ఎదురవుతున్న వాణిజ్య పోటీని అమెరికా తట్టుకోలేకపోతున్నది. అందుకే, చైనా నుంచి దిగుమతయ్యే వివిధ వస్తువులపై సుంకాన్ని భారీగా పెంచింది. ప్రపంచ జనాభాలో దాదాపు సగం మంది ప్రస్తుతం 'బ్రిక్స్'లోని సభ్యదేశాల్లోనే ఉన్నారు. అంతేగాక, ఆర్థిక వ్యవస్థలో నాలుగింట ఒక వంతు వాటా ఉంది. ఇప్పటికే అంతర్జాతీయ లావాదేవీలకు కీలకమైన 'సొసైటీ ఫర్ వర్ల్డ్‌వైడ్ ఇంటర్ బ్యాంక్ ఫైనాన్షియల్ టెలికమ్యూనికేషన్ (ఎస్‌డబ్ల్యుఐఎఫ్‌టి)లో డాలర్ బలహీనపడుతున్నది. ఇరాన్, రష్యా వంటి దేశాలు అమెరికా అంతర్జాతీయ ఆర్థిక మౌలిక సదుపాయాలను దెబ్బకొడుతున్నాయి. ఫలితంగా ప్రపంచ దేశాలు ఇప్పుడు డాలర్‌కు ప్రత్యామ్నాయాన్ని వెతికే ప్రయత్నంలో పడ్డాయి. సహజంగానే ఈ పరిణామలు అమెరికాకు ఆందోళన కలిగిస్తున్నాయి.

## ఢిల్లీ వెలుపల పార్లమెంటు సమావేశాలు!



దేశ రాజధానిలో కాకుండా, ఇతరత్రా ప్రాంతాల్లో పార్లమెంటు సమావేశాలు నిర్వహించాలన్న ప్రతిపాదన మరోసారి తెరపైకి వచ్చింది. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ పార్లమెంటు సభ్యుడు మద్దిల గురుమూర్తి చేసిన అభ్యర్థ ఇప్పుడు చర్చనీయాంశమైంది. ఢిల్లీలో తీవ్రమైన వాతావరణ పరిస్థితుల కారణంగా ఎంపిలు పార్లమెంటు సమావేశాలకు హాజరయ్యేందుకు ఇబ్బంది పడుతున్నారని ఆయన పేర్కొన్నారు. కాబట్టి, దక్షిణ భారతదేశంలో ప్రతి సంవత్సరం రెండు పార్లమెంట్ సమావేశాలను నిర్వహించాలని ప్రతిపాదించారు. గతంలో బాబా సాహెబ్ బిఆర్ అంబేద్కర్, మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజపేయి వంటి వారు చేసిన ప్రతిపాదన తాజాగా మరోసారి చర్చకు వచ్చింది. పార్లమెంటు సమావేశాలను వికేంద్రీకరించాలనే ఆలోచనను అంబేద్కర్ ప్రతిపాదించారు, ఢిల్లీ వెలుపల సమావేశాలు నిర్వహించాలని సూచించారు. ఆయన తన పుస్తకం ' భాషా రాష్ట్రాలపై ఆలోచనలు'లో, దేశానికి రెండు రాజధానులను కూడా ప్రతిపాదించారు, చలి, దూరం కారణంగా దక్షిణాది ప్రజలకు ఢిల్లీ చాలా అసౌకర్యంగా ఉందని, అంతేగాక దేశం మొత్తం ఉత్తరాది వారి చేతుల్లో ఉందనే అభిప్రాయం ఏర్పడుతుందని ఆయన వాదించారు. ఒకవేళ యుద్ధ పరిస్థితులు ఏర్పడితే, పొరుగు దేశాల బాంబు దాడుల పరిధిలో ఢిల్లీ ఉంటుందని, కాబట్టి అత్యవసర పరిస్థితుల్లో రెండో రాజధాని ఉండాలని వివరించారు. వేసవికాలంలో హైదరాబాద్‌ను రెండో రాజధానిగా వినియోగించుకోవాలని కూడా ప్రతిపాదించారు. ఇలావుంటే, ఢిల్లీలో పెరుగుతున్న వాయు కాలుష్యం, విపరీతమైన వాతావరణ ధోరణులను దృష్టిలో ఉంచుకొని తగిన నిర్ణయం తీసుకోవాలన్న గురుమూర్తి సూచనను పూర్తిగా కొట్టిపారేయడానికి వీల్లేదు. గుర్గావ్ నుంచి స్వతంత్ర అభ్యర్థిగా గెలుపొందిన ప్రకాష్ వీర్ శాస్త్రి 1959 నవంబర్‌లో ఒక ప్రైవేట్ తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. హైదరాబాద్ లేదా బెంగళూరును సూచిస్తూ, దక్షిణ భారతదేశంలో కనీసం ఒకసారి పార్లమెంటు సెషన్స్‌ను నిర్వహించాలని కోరారు. అప్పుడు మొదటిసారి ఎంపిగా ఎన్నికైన వాజపేయి కూడా ఈ ప్రతిపాదనకు మద్దతు తెలిపారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 85 రెండు సెషన్ల మధ్య ఆరు నెలల కంటే ఎక్కువ సమయం లేకుండా చూసేందుకు, తగిన సమయంలో, నిర్ణీత ప్రదేశంలో పార్లమెంటు సభను పిలిచే అధికారాన్ని రాష్ట్రపతికి ఇస్తుంది. సంప్రదాయబద్ధంగా పార్లమెంటు సమావేశాలు దేశ రాజధాని న్యూఢిల్లీలోని పార్లమెంట్ హౌస్‌లో జరుగుతాయి. ఇటీవల కొత్త పార్లమెంటు భవన నిర్మాణం పూర్తికావడంతో, సమావేశాలను అక్కడే నిర్వహిస్తున్నారు. పార్లమెంటు సమావేశాలను కొన్ని సందర్భాల్లో ఢిల్లీయేతర ప్రాంతాల్లో నిర్వహించాలన్న డిమాండ్ ఉంది. ఇలావుంటే, పార్లమెంటరీ యంత్రాంగాన్ని, మౌలిక సదుపాయాలను తరలించడానికి చాలా సమయం పడుతుందని, సిబ్బందిని ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి మార్చడం అనుకున్నంత సులభం కాదని కొందరు వాదిస్తున్నారు. భారత యూనియన్‌లో దక్షిణాది రాష్ట్రాల విలీనంపై ప్రభావం పడకుండా 75 సంవత్సరాలకు పైగా పార్లమెంటు సనమావేశాలు ఢిల్లీలోనే జరుగుతున్నాయని, ప్రాంతీయ ప్రాతినిధ్యం కోసం ప్రస్తుత యంత్రాంగాలు సరిపోతాయని విమర్శకులు సూచిస్తున్నారు. ఏదిఏమైనా పార్లమెంటు సమావేశాలను ఢిల్లీయేతర ప్రాంతాల్లో నిర్వహించడం, దేశానికి రెండో రాజధానిని ప్రకటించడం వంటి అంశాలు ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారాయి.

**బిఎస్ఎస్ మైత్రేయి**

## ప్రాణంవిలువ పాతిక లక్షలు

పుష్ప–2: ది రూల్ సినిమానో, సెలబ్రిటీల జాతరో ఏదైనా కావచ్చు. కాసులు రాల్చిన, హీరో అల్లు అర్జున్‌కు జాతీయ స్థాయి నటుడిగా అనూహ్యమైన గుర్తింపు తెచ్చిన పుష్ప–1 కొనసాగింపుగా మూడేళ్లు మేధోశక్తి, శ్రమశక్తి, నిర్మాతల ఆర్థిక శక్తినంతా ధారపోసి సుకుమార్ దర్శకత్వంలో వండివార్చిన ఈ చలనచిత్రం అంతిమంగా వందలకోట్లు రాబడుతుందో లేక సినిమా ప్రదర్శన హక్కులు కొనుగోలుచేసిన బయర్లను ముంచుతుందో ఊహించటం కష్టం. అయితే ప్రపంచ వ్యాప్త ప్రదర్శనలతో కొద్దిరోజుల్లోనే పెట్టుబడిరాబట్టుకునే వ్యాపారతత్వం సినీ పరిశ్రమను ఆవహించాక, ప్రేక్షకుల్లో క్రేజ్ సృష్టించే ఎత్తుగడగా ఒక సాధారణ సినిమా నిర్మాణానికి అయ్యేంత సొమ్ము ధారపోసి ప్రీ రిలీజ్ ఫంక్షన్‌లు నిర్వహించటం భారీ బడ్జెట్ సినిమా నిర్మాతలకు సర్వసాధారణంగా మారింది. అది చాలదన్నట్లు సినీమా విడుదల షెడ్యూలుకు ముందు బెనిఫిట్ షోలు, ప్రత్యేక ఆటలకు ప్రభుత్వాలపై ఒత్తిడితేవటం, సినీ పరిశ్రమ ఉద్ధారకులమని చెప్పుకోవటానికి అవి ఉదారంగా అనుమతులివ్వటం జరిగిపోతుంది. పుష్ప–2 బెనిఫిట్ షో సందర్భంగా బుధవారం రాత్రి హైదరాబాద్ ఆర్‌టిసి క్రాస్‌రోడ్స్ వద్దగల 'సంధ్య' థియేటర్ వద్ద అల్లు అర్జున్ వీరాభిమానుల తొక్కిసలాటలో ఒక మహిళా సినీగోయర్ మరణించటం, ఆమె కుమారుడు ఆసుపత్రిలో మరణంతో పోరాడుతుండటం అత్యంత బాధాకరం. స్పెషల్ షోకు టిక్కెట్లు ఉన్నవారిని వచ్చినవారిని వచ్చినట్లు థియేటర్‌లోకి పంపి ఉంటే ఈ ప్రమాదం నివారించబడేది.

**ప్రజాపక్షం**
**08-12-2024, ఆదివారం**

హీరో అల్లు అర్జున్ సినిమా చూడటానికి థియేటర్ కు వచ్చినట్లు తెలియగానే అక్కడున్న అభిమాను లు తమ హీరోను చూడటానికి ఎగబడ్డారు. కింద పడిపోయిన అమాయకురాలు ప్రాణాలు విడిచిం ది. కాబట్టి ఇది నిస్సందేహంగా మానవ తప్పిదం వల్ల జరిగిన తొక్కిసలాట. హీరో గారు ఇంతకుముందు ఎడిటింగ్ మొదలైన దగ్గర నుంచి ముక్కలుగానో, మొత్తంగానో ఎన్నోసార్లు సినిమా చూసి ఉంటారు. బొంబాయి మొదలు కేరళదాకా, చివరగా హైదరాబాద్‌లో ఆర్భాటంగా ప్రీ రిలీజు ఫంక్షన్‌లలో పాల్గొని సినిమాను మార్కెటింగ్ చేశారు. థియేటర్‌కు ఎందుకు వచ్చినట్లు? ఏ ఇంటర్వెల్‌లోనో చేతులు ఊపుకుంటూ విజయ సంకేతాలకు అభిమానుల కేరింతలతో పబ్లిసిటీ పొందటం తప్ప ఆయన రాకకు ప్రత్యేక ప్రయోజనం లేదు. హైదరాబాద్‌లో ప్రీ రిలీజ్ ఫంక్షన్‌లో అభిమాను లు ఎగబడితే తన బౌన్సర్లతో తోయించేశారు. మరి థియేటర్‌వద్ద ప్రేక్షకుల కేదీ రక్ష. ఈ వెర్రి వ్యామోహం, శృతిమించిన హీరో ఆరాధనను అదుపులో ఉంచవలసిన బాధ్యత అందరిపై ఉంది. సంధ్య థియేటర్ సంఘటన దిగ్భ్రాంతి కలిగించిందంటున్న హీరో అర్జున్ దాన్నుండి కోలుకుని శుక్రవారం హతురాలి కుటుంబానికి రూ.25లక్షల సహాయం ప్రకటించారు. ఆ కుటుంబానికి ఏ సహాయం అవసరమైనా తాను అందుబాటులో ఉంటానని ఊరట గొలిపే మాట చెప్పారు.

పాన్ ఇండియా, రికార్డు కలెక్షన్‌ల పోటీ పెరిగిన ఈ రోజుల్లో చిన్న, లేదా మధ్యస్థాయి పెట్టుబడి సినిమాకు ప్రేక్షకులు రావటం లేదు. ఒటిటి ప్లాట్‌ఫాంలే గతి అవుతున్నాయి. రెండోవైపు, టాప్ హీరోలు రెండు–మూడేళ్లకు ఒక సినిమా ఇస్తుంటే థియేటర్‌ల యజమానులు ఈగలు తోలుకుంటున్నారు. ఎవరెన్ని హంగులకు పోయి పొంగులు వెదజల్లినా థియేటర్‌లు లేకపోతే సినిమా రీళ్లు లేదా డివిడీలు, ఇంకా ఆధునిక టెక్నాలజీ ఏదైనా కావచ్చు – మడిచి ఇంట్లో పెట్టుకోవలసిందే.

సంధ్య థియేటర్ వద్ద హత్యోదంతంతో కంగుతున్న సినీమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి బెనిఫిట్ షోలు, స్పెషల్ షోలకు మంగళం పాడతామన్నారు. టిక్కెట్ రేటు పెంపుదల సహా మొత్తం విధానాన్ని సమీక్షిస్తామన్నారు. అదీ ఒక ప్రాణం ఖరీదు. ఎర్రచందనం స్మగ్లర్ తెలివితేటలను, యుక్తులను ఆకాశానికెత్తి – ఆహా మా హీరో నటన అని పొంగిపోయేవారు సమాజానికి చేస్తున్న మేలేమైనా ఉందా?

# ప్రతిపక్షాలకు పట్టెందుకు చిక్కలేదు?

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయిన శనివారం నాడు ఆసక్తికర ఘటన చోటు చేసుకుంది. రాష్ట్ర సచివాలయంలో డిసెంబర్ 9న తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ కార్యక్రమానికి మాజీ ముఖ్యమంత్రి, ప్రధాన ప్రతిపక్ష నాయకుడు కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావుకు ప్రభుత్వం నుంచి ఆహ్వానం వెళ్ళింది. మామూలుగా సాధారణ పరిపాలనా విభాగం, ప్రోటోకాల్ అధికారులు లేదా కార్యాలయ సిబ్బంది ద్వారా ప్రభుత్వ కార్యక్రమాలకు ఆహ్వానం వెళ్ళడం ఆనవాయితీ. అందుకు భిన్నంగా ప్రతిపక్ష నాయకుడి వద్దకు ఒక క్యాబినెట్ మంత్రి వెళ్ళి ఆహ్వానించడం ద్వారా ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం సత్సంప్రదాయాన్ని నెలకొల్పింది. బిసి సంక్షేమం, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ స్వయంగా గజ్వేల్ నియోజకవర్గంలో ఎర్రవెల్లి క్షేత్రానికి వెళ్ళి ప్రతిపక్ష నాయకుడు చంద్రశేఖర్‌రావుని కలిసి తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ కార్యక్రమానికి ఆహ్వానపత్రాన్ని అందజేశారు. ఆయన వెంట ప్రభుత్వ ప్రోటోకాల్ సలహాదారుడు హర్కర వేణుగోపాల్ కూడా ఉన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్‌ను బిఆర్ఎస్ మాజీ ఎంపి సంతోష్ కుమార్, మాజీ ఎంఎల్‌ఏ జీవన్‌రెడ్డిలు కారు వద్దకు వచ్చి లోనికి తోడ్కొని వెళ్ళారు. నేరుగా కెసిఆర్ ఉన్న పై అంతస్తులోకి తీసుకెళ్ళారు. కెసిఆర్ సైతం మంత్రిని సాదరంగా ఆహ్వానించి, వారిని కూడా భోజనానికి ఆహ్వానించారు. పరస్పర యోగక్షేమాలు అడగడంతో పాటు, ఉద్యమ ఘటనలను గుర్తు చేసుకున్నట్లు సమాచారం. ఈ సందర్భంగా సుమారు గంట పాటు గడిపారు.

బిఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీ నాయకుల మధ్య ఆరోపణ, ప్రత్యారోపణలు పరాకాష్ఠకు చేరి, వ్యక్తిగత దూషణల వరకు వెళ్ళడంతో ఒకరి ముఖాలు ఒకరు చూసుకునే పరిస్థితి లేకుండా పోయింది. అధికారంలోకి వచ్చిన తొలినాళ్ళ నుంచి ఒకింత దూకుడుగా ప్రతిపక్ష నేత కెసిఆర్ పై విరుచుకుపడిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇటీవల కాలంలో పంథా మార్చారు. ఆయనను శాసనసభకు రావాలని, నిర్మాణాత్మక సూచనలు చేయాలని ఆహ్వానిస్తూనే, వారి పార్టీలోని కుటుంబసభ్యులను అదుపులో పెట్టాలని విజ్ఞప్తి చేశారు. మొత్తానికి రాజకీయ అగ్నిగుండంలో కాగుతున్న తెలంగాణలో తాజా పరిణామం ఒక ఉపశమనం. ఇది ఎక్కువకాలం ఉంటుందని ఆశించలేనప్పటికీ, అది కొనసాగాలనే కోరుకుందాం. ఎందుకంటే ఇప్పటికే నూతనంగా రూపొందించిన తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఇప్పటికే బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.టి.రామారావు కాంగ్రెస్ తల్లి అని విమర్శలు చేశారు. మంత్రి పొన్నం ప్రభాకర్ కేవలం ప్రతిపక్ష నాయకుడు కెసిఆర్‌కే కాకుండా గవర్నర్ జిష్ణుదేశ్ వర్మ, కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డిలను కూడా స్వయంగా కలిసి ఆహ్వానపత్రాలను అందజేశారు.

**బిఆర్ఎస్‌పై ఇంకా పెరగని విశ్వాసం**

గత కొద్దిరోజులుగా కాంగ్రెస్ ప్రభుత్వ ఏడాది పాలనను సమీక్షిస్తూ పుంఖానుపుంఖలుగా వ్యాసాలు, కథనాలు వస్తున్నాయి. ఇదే సమయంలో ప్రతిపక్ష పార్టీల పాత్రను కూడా సమీక్షించుకోవడం కూడా సబబే. పదేళ్ల అధికారాన్ని గరిష్ఠ స్థాయిలో అనుభవించిన బిఆర్ఎస్ ఒక్కసారిగా ప్రతిపక్ష స్థానంలోకి రావడం జీర్ణించుకోలేకపోయిందనే చెప్పొచ్చు. ముఖ్యంగా కె.చంద్రశేఖర్‌రావు ఉద్యమ కాలం నుంచి తనవైపు అందరి దృష్టి ఉండేలా దాదాపు పాతికేళ్ళపాటు 2001 నుంచి ఉద్యమ నేతగా, 2014 నుంచి ముఖ్యమంత్రిగా ప్రస్థానాన్ని కొనసాగించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో ఆయన కేంద్రంగానే రాజకీయాలు సాగాయి అనడం అతిశయోక్తి కాదేమో! 2024లో ప్రజలు కాంగ్రెస్‌ను గెలిపించడంతో బిఆర్ఎస్ ప్రతిపక్షానికి పరిమితమై, కెసిఆర్ ప్రధాన ప్రతిపక్ష నాయకుడిగానే ఉండాల్సిన పరిస్థితి. ఆయన ఒక్కరోజు మినహా ఏడాదిలో ఒక్కసారి కూడా శాసనసభకు రాలేదు. బహిరంగ దర్శనం కూడా ఇవ్వలేదు. ఆయన పార్టీ కూడా ఈ కాలంలో అనేక ఆటుపోట్లను ఎదుర్కొంది. కెసిఆర్ కుమార్తె జైలుకు వెళ్ళడం, ఇక్కడ బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో విద్యుత్, కాళేశ్వరం అంశాలపై విచారణ కమిషన్‌లు వేయడం, ఫోన్ ట్యాపింగ్, భూముల బదలాయింపు అంశాలు తెరపైకి రావడం, పార్లమెంటు ఎన్నికల్లో ఒక్కస్థానం కూడా రాకపోగా, 8 చోట్ల డిపాజిట్లు కోల్పోవడంతో ఆ పార్టీ నేతలు ఉక్కిరిబిక్కిరి అయ్యారు. మాజీ మంత్రులు కెటిఆర్, హరీశ్‌రావులు ప్రభుత్వాన్ని పలు అంశాలలో ఇరకాటంలో పెట్టేందుకు దూకుడుగా వ్యవహరించినప్పటికీ, మొన్నటి వరకు ఆ పార్టీ అధికారంలో ఉండగా వ్యవహరించిన తీరు ప్రజల స్మృతిపథం నుంచి ఇంకా చెరిగి పోకపోవడంతో వారికి ఆశించిన స్పందన లభించలేదు. ఏదేమైనప్పటికీ ప్రతిపక్ష నాయకుడు కెసిఆర్ రాజకీయాలలో క్రియాశీలకంగా వ్యవహరిస్తే రాజకీయాలు కూడా రసవత్తరంగా మారతాయి.

ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో 2016 ప్రాంతంలో ఒకసారి శాసనసభలో ప్రసంగిస్తూ తాను ప్రతిపక్ష నాయకుడు జానారెడ్డి ఇంటికి భోజనానికి వెళ్తానని కెసిఆర్ అందరినీ ఆశ్చర్యపరిచారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్యమంత్రులుగా ఉన్న అనేకమంది ప్రతిపక్ష నాయకులతో మధ్యాహ్న భోజనంచేస్తూ పలు అంశాలపై చర్చించుకునే సంప్రదాయం ఉండేదని గుర్తు చేశారు. ఆచరణలో మాత్రం

**రాజధాని సందడి**
**– బొమ్మగాని కిరణ్‌కుమార్**

కెసిఆర్ అందుకు భిన్నంగా వ్యవహరించడం, శాసనసభలో ప్రతిపక్షాలను లేకుండా చేయడం వంటి చర్యలు కూడా అందరూ చూశారు. ప్రతిపక్ష ఎంఎల్‌ఏలను గంపగుత్తగా తమ పార్టీలోకి ఫిరాయింపజేసుకోవడం, మిగిలిన వారిని అణిచివేయడం ద్వారా ప్రతిపక్షాలకు స్థానం ఉండబోదనే ఆలోచనే అత్యాశే. అదే నిజమని తెలంగాణలో కూడా రుజువైంది. ఎన్ని యత్నాలు చేసినప్పటికీ బిఆర్ఎస్‌ను ప్రతిపక్షంలోకి నెట్టి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. ప్రజాస్వామ్యంలో ప్రతిపక్ష మనుగడను ప్రజలు, ముఖ్యంగా తెలంగాణ సమాజం కోరుకుంటుందనేది అనేకమార్లు స్పష్టమైంది. తెలంగాణ ఉద్యమాన్ని కూడా మూడుసార్లు అణిచివేసినా, దశబ్దాల స్థబ్దత తరువాత కూడా ప్రజలు ఉద్యమించి ప్రత్యేక రాష్ట్రాన్ని సొంతం చేసుకున్న ఘనత తెలంగాణ ప్రజలదే.

**బిజెపి ఏమి చేసింది?**

ఇక మరో ప్రతిపక్ష పార్టీ బిజెపి గురించి మాట్లాడుకుంటూ తెలంగాణ ఏర్పడిన తరువాత మూడు ఎన్నికల్లో రెండు సార్లు ఆ పార్టీకి పార్లమెంటు ఎన్నికల్లోనే ప్రజలు ఆదరించారు. శాసనసభ ఎన్నికలకు వచ్చేసరికి బిఆర్ఎస్‌నో, కాంగ్రెస్‌నో ఎంచుకుంటున్నారు. జాతీయ స్థాయికి ఆ పార్టీని ఆదరిస్తున్నప్పటికీ రాష్ట్రానికి ప్రత్యేకంగా ఏమీ చేయలేదనే భావన తెలంగాణ ప్రజలలో ఉంది. బిజెపి కేంద్రంలో అధికారంలో ఉండి పదకొండేళ్లు కావొస్తున్నప్పటికీ తెలంగాణకు పునర్విభజన చట్టంలో ఇచ్చిన హామీలైన కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ, గిరిజన యూనివర్సిటీ, ఉక్కు కర్మాగారం కళ్ళకు కనపడడం లేదు. తెలంగాణకు ఫలానాది ఇచ్చామని గట్టిగా చెప్పుకునే పరిస్థితి బిజెపికి లేదు. రాష్ట్రానికి పన్నుల్లో రావాల్సిన వాటా, అన్ని రాష్ట్రాలకు కేంద్ర ప్రాయోజిత పథకాలకు ఇచ్చినట్లే మనకు నిధులు ఇస్తున్నారే తప్ప అదనంగా ఒరిగిందేమి లేదు. రాష్ట్ర ప్రభుత్వంపై బిజెపి నేతలు విమర్శలు చేస్తుండడంతో సిఎం రేవంత్ రెడ్డి వాటిని బలంగా తిప్పికొడుతున్నారు. కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లు రాష్ట్రానికి ఏమి తెచ్చారో చెప్పాలని ప్రశ్నిస్తున్నారు. కనీసం కిషన్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న హైదరాబాద్ జిల్లాకు మెట్రో రైలు విస్తరణకు, మూసీ ప్రక్షాళనకు నిధులు ఎన్నడైనా ఇప్పించారా? అంటూ ఇరుకున పెడుతున్నారు.

**అన్ని పక్షాలు గాడిలో పడాల్సిందే**

ఏడాదికాలంలో అధికార పార్టీ బాలారిష్టాలను, ప్రతిపక్షంలోని బిఆర్ఎస్, బిజెపిలు విశ్వసనీయత సమస్యను ఎదుర్కొన్నాయి. అటు పదేళ్ల అప్రజాస్వామిక పాలనతో వివిధ వర్గాలలో విశ్వాసం కోల్పోయిన బిఆర్ఎస్ చేస్తున్న విమర్శలు, ఆందోళనలకు ప్రజల నుంచి గడిచిన ఏడాదికాలంలో స్పందన కరువైంది. స్వంత పార్టీ కార్యకర్తలతోనే తూతూ మంత్రంగా కార్యక్రమాలు నడిపిస్తున్నారు. అలాగే ప్రతిపక్ష స్థానానికి రాష్ట్రంలో ఉన్న అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలనుకుంటున్న బిజెపికి కూడా ప్రజల నుంచి ఆదరణ లభించడం లేదు. ఎందుకంటే పదకొండేళ్ళలో రాష్ట్రానికి ఏమి చేశారనే ప్రశ్న ప్రజల్లో మెదులుతూనే ఉంది. ఇవన్నీ తమకు కలిసొచ్చేవే అని అధికార పార్టీ భావించి ఆదమరిస్తే ప్రజలు చూస్తూ ఉండబోరు. ఇచ్చిన హామీలు అన్నీ అమలుకావడం లేదనే పిసరంత అసంతృప్తి మనసులో ఉన్నప్పటికీ , ఏడాది కాలంలో కనాకష్టంగా ఉన్న ఆర్థిక పరిస్థితుల్లో కూడా, కాంగ్రెస్ ప్రభుత్వం కిందనో, మీదనో పడిచెయి తిరిగిన మేరకు హామీలను నెరవేస్తున్నారనే అభిప్రాయంతో ప్రజలు ప్రతిపక్షాల వైపు ఇప్పుడే చూడడడం లేదు. కాంగ్రెస్ పార్టీ, మంత్రివర్గ సహచరులు కూడా మొదట్లో కంటే ఇప్పుడు మరింత ఎక్కువగా ముఖ్యమంత్రితో కలిసి బహిరంగంగా ఐక్యతను చాటడం ద్వారా మంచి సంకేతాలను ప్రజలకు పంపుతున్నారు. వామపక్షాలలో సిపిఐ, సిపిఐ(ఎం) ప్రజాసమస్యలు వచ్చినప్పుడు తమ వైఖరిని కచ్చితంగా నే చెబుతున్నాయి. లగచర్లకు ప్రతినిధి బృందాలను పంపి వాస్తవ పరిస్థితులను తెలుసుకొని ముఖ్యమంత్రికి నిర్మాణాత్మక సూచనలు చేశాయి. దానిని ఆయన సానుకూలంగా స్వీకరించి ఫార్మా విలేజిని రద్దు చేశారు. ప్రస్తుతానికి కాంగ్రెస్ ప్రభుత్వానికి మిత్రపక్షంగా ఉన్నప్పటికీ, మిత్రధర్మం పాటిస్తూనే పొరపాట్లపై ఎప్పటికప్పుడు ఎత్తిచూపుతూ సిపిఐ హెచ్చరికలు చేస్తూనే ఉంది. గత ప్రభుత్వంలో సిఎం అపాయింట్ కోసం సచివాలయంలో వామపక్షాలు ధర్నా చేసిన పరిస్థితి నుంచి, ఇప్పుడు ప్రజాసమస్యలపై ముఖ్యమంత్రిని అనేకమార్లు కలిసి వివరించే స్థాయికి వచ్చింది. ప్రభుత్వం సానుకూలంగా స్పందన ఇకపై కూడా కొనసాగితే పర్వాలేదని, లేదంటే ఉద్యమబాటకు సిద్ధమయ్యేందుకు కూడా వామపక్షాలు సిద్ధంగానే ఉన్నాయి. ప్రతిపక్ష పార్టీ బిఆర్ఎస్ ఇప్పటివరకు చేసిన నిరసనలు ఎక్కువభాగం ప్రభుత్వ పనులకు ఆటంకం కలిగించే విధంగానే గోచరమవుతున్నాయని విశ్లేషకులు భావిస్తున్నారు. ప్రతిపక్ష పార్టీకి ఎప్పుడూ ఉన్నదానికంటే ఒక మాట ఎక్కువే ఆరోపణలు చేసేందుకు వెసులుబాటు ఉంటుంది. ప్రజాస్వామ్యంలో అది అవసరం కూడా. కానీ, పదేళ్లు అధికారంలో ఉండి ఇప్పుడే సమస్యల ఉన్నట్లు బిఆర్ఎస్ వ్యవహరిస్తే ప్రజలు తిరిగి ఆదరించడం కష్టం. సకారాత్మకంగా వ్యవహరిస్తూ, నిర్మాణాత్మక సూచనలిస్తేనే ఆ పార్టీ కూడదీసుకునేందుకు అవకాశం ఉంటుంది. బిజెపి కూడా రాష్ట్ర ప్రభుత్వం ఏమీ చేసిందనే కంటే, తాము అధికారంలో ఉన్న కేంద్రం నుంచి రాష్ట్రానికి రావాల్సిన బకాయిలను, జాతీయ హోదా ప్రాజెక్టును, అదనపు నిధులను తీసుకువస్తేనే, ఆ పార్టీకి విశ్వసనీయత ఉంటుంది. ఏడాది కాలంలో పూర్తయిన లాంచింగ్‌ను ఆసరా చేసుకొని, ప్రజాస్వామ్య స్ఫూర్తితో విశాలదృక్పథంతో ముందుకు సాగాల్సిన గురుతర బాధ్యత ఇప్పుడు ముఖ్యమంత్రి నేతృత్వంలోని రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై మరింత పెరిగింది.

# రేవంత్ సర్కార్ ముందు ఎన్నో సవాళ్లు...



ఉజ్జిని రత్నాకరరావు
9490952646

రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణాలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఒక సంవత్సరం పూర్తయింది. రేవంత్ సర్కార్ సంవత్సర సంబరాలు నిర్వహించుతున్నారు. ఈ ప్రభుత్వం బాధ్యత చేపట్టే నాటికి రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగానే ఉన్నప్పటికీ, తాను ఎంచుకున్న ఉన్నతమైన లక్ష్యాల సాధన దిశగా పార్టీని, మంత్రివర్గ సహచరులను ఐక్యంగా కూడగట్టుకుని రాష్ట్రాభివృద్ధికి అడుగులు వేస్తున్నారు. ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి ప్రమాణస్వీకారం చేసే నాటికి రూ.6,71,757 కోట్లు అప్పులు ఉన్నాయి. దీనివల్ల ప్రతి నెల సుమారు రూ.6వేలకోట్లకు పైగా అప్పులకు వడ్డీగా చెల్లించాల్సి వస్తున్నది. గత ప్రభుత్వంలో ప్రభుత్వ ఉద్యోగులకు ప్రతినెలా 10 నుండి 20 తారీకు వరకు వేతనాలు అందేవి. వెంటనే ప్రభుత్వ ఉద్యోగులకు 2024 జనవరి నుంచి ఒకటవ తారీఖున జీతాలు ఇచ్చే ఏర్పాటు చేసింది. ముండ్లకంచతో దుర్భేద్యముగా ఉన్న ప్రగతిభవన్ గేట్లను తొలగించి మహాత్మా జ్యోతిబాపూలె ప్రజాభవన్‌గా మార్చి వారానికి రెండురోజులు ప్రజాదర్బారుగా మార్చి సమస్యలు చెప్పుకునేటందుకు, వినతి పత్రాలు స్వీకరి స్తూ.. వాటిని పరిష్కరించే దిశగా అడుగులు వేసింది. రాష్ట్ర సచివాలయంలో ప్రభుత్వ అధికారులు, మంత్రులు అందుబాటులో ఉంటూ ప్రజలముందు పాలనకు శ్రీకారం చుట్టారు.

తెలంగాణ గీతంగా 'జయ జయహే తెలంగాణ' ప్రముఖ కవి అందెశ్రీ రాసిన గీతాన్ని రాష్ట్ర గీతంగా ఆమోదిస్తూ.. ప్రజాయుద్ధ నౌక గద్దర్ విగ్రహాన్ని తెల్లాపూర్‌లో ఏర్పాటు, గద్దర్ పేరున చిత్రకళ అవార్డ్స్ ఇవ్వాలని నిర్ణయం ఆహ్వానించదగినవి.. మహిళా యూనివర్సిటీకి తెలంగాణ పోరాట యోధురాలు వీరనారి చాకలి ఐలమ్మ పేరును పెట్టడం, తెలుగు యూనివర్సిటీకి తెలంగాణ వైతాళికుడు సురవరం ప్రతాపరెడ్డి పేరును, తెలంగాణ తల్లి విగ్రహాన్ని సచివాలయంలో డిసెంబర్ 9న ఏర్పాటు చేయటం చరిత్రలో గుర్తుండేవిగా నిలిచిపోతాయి. గత ప్రభుత్వ పాలనలో నిర్లక్ష్యానికి గురికాబడిన విద్య, వైద్య రంగాలపై దృష్టి సారించి విద్యారంగములో తీసుకురావలసిన సంస్కరణలపై ఎడ్యుకేషన్ కమిషన్ ఏర్పాటు చేశారు. తక్షణమే 11వేల ఉపాధ్యాయుల పోస్టులు డిఎస్‌సి ద్వారా భర్తీ చేయడం, పాఠశాలలో మౌలిక వసతుల కల్పనకు శ్రీకారం చుట్టారు. యూనివర్శిటీలకు వైస్ ఛాన్సలర్లను నియమించకుండా ఇన్‌ఛార్జిలతో ఉన్న స్థితి పోయి వైస్ ఛాన్సలర్లను నియామకం చేయటం, రాష్ట్రంలో ఉద్యోగ ఖాళీల భర్తీకి తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఏర్పాటుచేసి సంవత్సరాలతరబడి వాయిదాపడుతున్న ఎగ్జామ్స్ 10 మాసాలలోనే గ్రూప్ 1, గ్రూప్ 2, గ్రూప్ 3 ఎగ్జామ్స్ పారదర్శకంగా నిర్వహించటం.. నియామకాలు జరపటం, పేదలకు నాణ్యమైన వైద్య సేవలు ప్రభుత్వ, కార్పొరేట్ ఆసుపత్రులలో రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.10లక్షలకు పెంచి అందించటం, ఇప్పటివరకు రూ.54,280 కోట్లను ఖర్చు చేసింది. ఆసుపత్రులలో డాక్టర్స్, నర్సులు, పారా మెడికల్ స్టాఫ్ నియామకం చేపడుతూ పేదల వైద్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టటం జరుగుతుంది.

అసంపూర్తిగా ఉన్న కొత్త మెడికల్ కాలేజీల భవనాలు పూర్తి, కొత్తగా 3 మెడికల్ కాలేజీలు ఏర్పాటు, స్కిల్స్ టెక్నికల్ ట్రైనింగ్ డెవలప్మెంట్ కాలేజీ ఏర్పాటు, శంషాబాద్ సమీపంలో ఫోర్త్ సిటీ ఏర్పాటుకు, మూసీ పరీవాహక ప్రాంతం అభివృద్ధి,హైదరాబాదులో మెట్రో నలుదిశలా విస్తరణకు జరుగుతున్న కృషిని ప్రజలు స్వాగతిస్తున్నారు. రేవంత్ ప్రభుత్వం చేపడుతున్న సంస్కరణల కారణంగా కొన్ని పథకాల అమలులో జాప్యం అవుతున్నదే తప్ప ఇచ్చిన హామీలు అమలుకు కొంతటైం ఇవ్వాలి.. అందుకు రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఏమంత బాగాలేదు.. ఎన్నికల ముందు ఇచ్చిన ఆరు గ్యారంటీలు అమలుపై కేంద్రీకరించాల్సి ఉంది. ఇందులో ముఖ్యమైనది పేదలకు ఇందిరమ్మ ఇండ్లపథకం. ఈ పథకానికి సంవత్సరం బడ్జెట్‌లో 4.5 లక్షలు ఇండ్లు ఇస్తున్నామని అసెంబ్లీలో హామీ ఇచ్చినప్పటికి.. నేడు రేపు అంటు ఆరు నెలలు గడుస్తుంది. నేటికీ అడుగు ముందుకు పడలేదు. ఆరు హామీల్లో కొన్నింటిపై దృష్టి పెట్టినప్పటికి అమలులో ఇబ్బందులు ఎదుర్కొనక తప్పదు. మహిళలకు రాష్ట్రవ్యాప్తంగా ఉచిత బస్సు రవాణా కల్పించి.. నెలకు రూ.350కోట్లు ఆర్టిసికి చెల్లించుచున్నారు. రూ.500లకే వంట గ్యాస్ ద్వారా ఇప్పటివరకు 46,67, 510 మందికి లబ్ధి చేకూరింది. గృహజ్యోతి పథకం క్రింద అర్హులైన వారికి 200 యూనిట్ల ఉచిత కరెంటు జీరో బిల్లు క్రింద రాష్ట్రంలో 49,51,725కుటుంబాలు లబ్దిపొందుతున్నారు..ఈ పథకం క్రింద ఇప్పటివరకు రూ.1158.42 కోట్లు ప్రభుత్వం విద్యుత్ సంస్థలకు చెల్లించింది. రైతులకు రుణమాఫీ కింద రూ.2 లక్షల రుణాలు తీసుకున్నవారికి ఏకకాలంలో రుణమాఫీ చేయడం.. ఈ స్కీం క్రింద 25లక్షలకుపైగా రైతులకు రూ.21వేలకోట్లు బ్యాంకులకు చెల్లించి అప్పుల ఊబిలోఉన్న రైతులను ఆదుకొన్నది.

ఒక వైపు అప్పులు..మరోవైపు సంక్షేమం రూపంలో భారీ వ్యయాలు, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం ముందున్న అతిపెద్ద సవాళ్లు. సర్కార్ ఆ సవాళ్లను అధిగమించి ఇచ్చిన హామీలను నెరవేర్చాల్సి ఉంటుంది. తెలంగాణ ముఖ్యమంత్రి పదవిలో రేవంత్ రెడ్డి ఇప్పుడు పులిమీద సవారి చేస్తున్నాడు. అయితే ఆయనకు అనేక అవకాశాలు దారులు చూపుతున్నాయి. విద్య, వైద్యంపై చేసే వ్యయాన్ని ఖర్చుగా చూపొద్దు. ఈ రంగాల్లో పెట్టే ప్రతిరూపాయి ప్రతిఫలంగా రెండు, మూడు రెట్లు ఆర్థిక ప్రగతి సాధించి పెడుతుంది. ప్రభుత్వం విద్య, వైద్యంపై రవాణా సదుపాయాలు మెరుగ్గా అందిస్తే ప్రజల నుండి మంచి అనుకూల స్పందన ప్రభుత్వానికి వస్తుంది. ఉద్యోగాల ఖాళీలపై ఎప్పటికప్పుడు నియామకాలు జరిగే విధంగా జాబుక్యాలెండరు.. పరీక్షలు నిర్వాహణలో లోపాలు లేకుండా చూడాలి. వ్యవసాయం సమృద్ధి దిశలో పయనిస్తున్న మన రాష్ట్రంలో ఫుడ్ ప్రాసెసింగ్‌రంగంలో అద్భుతాలు సృష్టించే అవకాశాలు మెండుగా ఉన్నాయి. ఐటి, తయారీ, సేవారంగాలలో విస్తృత అవకాశాలు అందుబాటులో ఉన్నాయి. సంస్థలు కోరుకున్నట్లుగా విద్యార్థులను తీర్చిదిద్దితే నిరుద్యోగిత అనే సవాల్ని అధిగమించవచ్చు.

కొత్త ఆలోచనలను ఆచరణలో పెట్టడం, రేవంత్ సర్కారుకు కత్తి మీది సాములాంటిదే. దేశంలో పలు రాష్ట్రాలలో గతంలో చోటుచేసుకున్న పరిణామాల దృష్ట్యా కాంగ్రెస్ సర్కార్ వచ్చే నాలుగేండ్లు ఐక్యంగా ఉండి, సమష్టిగా పనిచేస్తుందనే నమ్మకాన్ని రాష్ట్ర ప్రజలలో కల్పించాల్సిన బాధ్యత నాయకుడిగా రేవంత్ భుజాలపైనే ఉంది.

# రైతులకు ఉచితంగా రాజన్న కోడెలు

మంత్రి కొండా సురేఖ



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** వేములవాడ రాజరాజేశ్వర స్వామి దేవస్థానానికి మొక్కుల రూపంలో భక్తులు సమర్పించిన కోడెలను రైతులకు ఉచితంగా ఇస్తామని దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ శనివారం ఒక ప్రకనటనలో తెలిపారు. దేవస్థానంలోని కోడెలను అక్రమంగా విక్రయించినట్లు వచ్చిన వార్తల్లో నిజంలేదని కొండా సురేఖ స్పష్టం చేశారు. ప్రభుత్వం పై బురదజల్లే రీతిలో కుట్రపూరితంగా ప్రచారమవుతున్న తప్పుడు వార్తలను మంత్రి సురేఖ ఖండించారు. గత ప్రభుత్వ హయాంలో ఈ దేవస్థానానికి భక్తులు సమర్పించిన కోడెల సంఖ్య పెరుగుతుండటంతో కోడెల నిర్వహణ భారంగా మారి చాలా కోడెలు మరణించిన విషయాన్ని మంత్రి సురేఖ గుర్తు చేశారు. ఈ నేపథ్యంలో భక్తుల విన్నపాల మేరకు మొక్కుల రూపంలో భక్తులు సమర్పించిన కోడెల నిర్వహణ నిమిత్తం విధివిధానాలను రూపొందించేందుకు ఆరు నెలల క్రితం మేలో సిరిసిల్ల జిల్లా కలెక్టర్ చైర్మన్‌గా, వేములవాడ ఆలయ ఇఒ కన్వీనర్‌గా, పలువురు ఇతర సభ్యులతో ఏర్పాటు చేసిన కమిటి మార్గదర్శకాలను రూపొందించినట్లు మంత్రి సురేఖ స్పష్టం చేశారు. ఈ మేరకు విడుదల చేసిన విషయాన్ని మంత్రి సురేఖ గుర్తు చేశారు. ఈ మార్గదర్శకాల ప్రకారం పట్టాదారు పాసు పుస్తకం, ఆధార్ కార్డు, ఫోన్ నంబర్, సంబంధిత మండల అగ్రికల్చర్ ఆఫీసర్ ధ్రువీకరణ పత్రం వుంటేనే పంపిణీ చేస్తున్నట్లు మంత్రి సురేఖ గుర్తు చేశారు. ధ్రువీకరణ పత్రాలు నిబంధనలకు అనుగుణంగా వుంటేనే ఒక రైతుకు రెండు కోడెల చొప్పున మాత్రమే ఇస్తున్న విషయాన్ని మంత్రి సురేఖ స్పష్టం చేశారు.

అంతేకాకుండా కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక కోడెల సంరక్షణ కోసం గోశాలలో సిసి ఫ్లోరింగ్, సరిపడా షెడ్లు, తాగునీటి వసతి కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు మంత్రి సురేఖ వివరించారు. మూగజీవాల పై తమ ప్రభుత్వానికున్న శ్రద్ధ అటువంటిది మంత్రి అన్నారు. ఎంతో నిబద్ధతతో గోశాలల నిర్వహణ, గోవుల సంరక్షణను చేపడుతున్న పరిస్థితుల్లో కోడెలను అక్రమంగా విక్రయించారని వచ్చిన వార్తలు వట్టి పుకార్లను మంత్రి సురేఖ కొట్టి పారేశారు. సాధారణంగా తన వద్దకు వచ్చే దరఖాస్తులను పరిశీలించమని సంబంధింత అధికారులకు సూచిస్తుంటామని, కోడెల పంపిణీకి సంబంధించి వచ్చిన దరఖాస్తులను అదే విధంగా పంపించామని మంత్రి సురేఖ స్పష్టం చేశారు. దేవస్థానం అధికారులు ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారమే రైతులకు కోడెలను పంపిణీ చేసారని మంత్రి పునరుద్ఘాటించారు. ఇందులో ఎలాంటి అవకతవకలు, అక్రమాలు జరగలేదని మంత్రి సురేఖ తేల్చి చెప్పారు. వేములవాడ రాజరాజేశ్వర దేవస్థానంలోని ప్రతి కోడెకు శాశ్వతమైన ట్యాగ్ వుంటుందని, అటువంటి ట్యాగ్ ఉన్న కోడెలు ఎక్కడా పట్టుబడలేదని మంత్రి సురేఖ స్పష్టం చేశారు. ఈ వ్యవహారానికి సంబంధించి నిజానిజాలను వెల్లడిస్తూ నిన్న వేములవాడ రాజరాజేశ్వర స్వామి దేవస్థాన ఈవో స్పష్టతనిచ్చిన విషయాన్ని మంత్రి సురేఖ గుర్తు చేశారు. ప్రభుత్వం హిందువుల మనోభావాలను దెబ్బతీస్తున్నదని అవాస్తవ ప్రచారం చేస్తూ, సమాజంలో అశాంతిని సృష్టించే అసాంఘిక శక్తులను వెలికితీసి, చట్టపరంగా చర్యలు చేపడతామని మంత్రి సురేఖ స్పష్టం చేశారు.

## బిఆర్ఎస్ విధ్వంస పాలన నుంచి..
# కాంగ్రెస్ పాలనలో పునర్వికాసం వైపు

టిపిసిసి అధ్యక్షులు
బి.మహేష్‌కుమార్ గౌడ్

**ప్రజాపక్షం / హైదరాబాద్ :** పదేళ్ల బిఆర్ఎస్ విధ్వంస పాలన నుంచి తెలంగాణ రాష్ట్రం కాంగ్రెస్ పాలనలో పునర్ వికాసం వైపు పయనిస్తోందని టిపిసిసి అధ్యక్షులు బి.మహేష్‌కుమార్ గౌడ్ అన్నారు. ప్రజా సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా సిఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క, మంత్రులు, ఎంఎల్‌ఎలు, ఎంఎల్‌సిల పాలన కొనసాగుతోందన్నారు. గాంధీభవన్‌లో శనివారం మీడియాతో మహేష్‌కుమార్‌గౌడ్ మాట్లాడారు. తెలంగాణలో చేపట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేపై దేశ వ్యాప్తంగా చర్చ జరుగుతుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు వెల్లువెత్తాయని, ఏడాదిలోనే 55 వేలకు పైగా ఉద్యోగాలు ఇచ్చి నిరుద్యోగుల ఆకాంక్షలను నెరవేర్చిందన్నారు. మరోవైపు అధ్యక్షుడి కుర్చీ కోసం బిజెపి, బిఆర్ఎస్‌లో అంతర్గత పోరు జరుగుతుందన్నారు. 'ఎవడి గోల వాడిదే' విధంగా రాష్ట్రంలో బిజెపి పరిస్థితి ఉండగా, 'మూడు ముక్కలాట' తరహాలో బిఆర్ఎస్‌లో అన్న కెటిఆర్‌ను తప్పించి కుర్చీ ఎక్కేందుకు కవిత తహతహలాడుతున్నారని, అదను కోసం హరీశ్‌రావు ఎదురు చూస్తున్నారని మహేష్‌కుమార్ వ్యాఖ్యానించారు.

**సెలెక్ట్ అండ్ ఎలెక్ట్ పద్ధతిలో అభ్యర్థుల ఎంపిక**

సెలెక్ట్ అండ్ ఎలెక్ట్ పద్ధతిలో స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను ఎంపిక చేయనున్నట్లు టిపిసిసి అధ్యక్షులు బి.మహేష్‌కుమార్ గౌడ్ ప్రకటించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో 80 శాతం స్థానాలు గెలుచుకోవాలని కాంగ్రెస్ లక్ష్యంగా లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ఎటువంటి సిఫార్సులకు తావులేకుండా ప్రజల్లో పలుకుబడి ఉన్న అభ్యర్థులకు, కాంగ్రెస్ పార్టీకి చేసిన సేవలను పరిగణలోకి తీసుకుని అభ్యర్థులను ఎంపిక చేస్తామన్నారు. పార్టీలో పదవులు కావాలన్న, స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయాలన్న నాయకులు, కార్యకర్తలు గాంధీభవన్ చుట్టు, నాయకుల చుట్టు తిరగడం మానేసి ప్రజలతో మమేకం కావాలని ఆయన సూచించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో అభ్యర్థుల ఎంపికను సర్వే నిర్వహించి ప్రజల్లో పలుకబడి ఉన్న వారికి మాత్రమే టికెట్ ఇస్తాం. తెలంగాణ ప్రదేశ్ కమిటీ (టిపిసిసి) నూతన కార్యవర్గాన్ని త్వరలో నియమించనున్నట్లు ఆయన వెల్లడించారు. ఏ సామాజిక వర్గాన్ని, మతాన్ని కించపరచదని, ఏ ఒక్క నాయకుడు పాల్పడినా ఊపేక్షించబోదన్నారు.



## ఎయిర్ షో సందర్భంగా..
## ట్యాంక్‌బండ్ వద్ద ట్రాఫిక్ ఆంక్షలు

**ప్రజాపక్షం / హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయింది. ఈ సందర్భంగా రాష్ట్రంలో ప్రజా పాలన ప్రజా విజాయోత్సవాలను రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తుంది. ఇందులో భాగంగా మహానగరం హైదరాబాద్‌లోని హుస్సేన్ సాగర్ (ట్యాంక్ బండ్) వద్ద ఇండియన్ ఎయిర్ ఫోర్స్ ఆధ్వర్యంలోని సూర్యకిరణ్ ఎరోబొటిక్ టీమ్ సారథ్యంలో ఎయిర్ షో నిర్వహించనున్నారు. ఈ మేరకు సిఎం రేవంత్ రెడ్డికి కూడా ఆహ్వానం పలికారు. దీంతో పోలీసులు, అధికారులు పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ ఎయిర్ షో కార్యక్రమంలో ఆదివారం మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించనున్నారు. ఇందుకోసం ఇప్పటికే ఏర్పాట్లు పూర్తవ్వగా.. ఎయిర్ షో కారణంగా ట్యాంక్ బండ్‌పై ట్రాఫిక్ ఆంక్షలు పెట్టారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి ఎయిర్ షో ముగిసే వరకు ఈ ట్రాఫిక్ ఆంక్షలు కొనసాగుతాయని అధికారులు తెలిపారు.

## ఒఆర్ఆర్ పరిధిలోని 51 గ్రామాలు
# సమీప మున్సిపాలిటీల్లో విలీనం

గెజిట్ విడుదల చేసిన ప్రభుత్వం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రంగారెడ్డి, మేడ్చల్‌మల్కాజిగిరి , సంగారెడ్డి జిల్లాల్లో అవుటర్ రింగ్ రోడ్ (ఓఆర్ఆర్) పరిధిలోని 51 గ్రామ పంచాయతీలను ఆ సమీప మున్సిపాల్టీలలో ప్రభుత్వం విలీనం చేసింది. ఒఆర్ఆర్ లోపల,బయట వైపు ఆనుకుని ఉన్న మొత్తం 51గ్రామ పంచాయతీలను సమీప మున్సిపాలిటీల్లో విలీనం చేయాలని మంత్రివర్గం సబ్ కమిటీ సిఫారసు చేసిన విషయం తెలిసిందే. అయితే గ్రామ పంచాయతీల విలీనాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లను ఇప్పటికే హైకోర్టు కొట్టేసిన నేపథ్యంలో పంచాయతీల విలీనానికి మార్గం సుగమమైంది. 51 గ్రామపంచాయతీలను మున్సిపాలిటీల్లో విలీనం చేస్తూ సెప్టెంబర్ 3న ప్రభుత్వం ప్రత్యేక ఆర్డినెన్స్ తీసుకొచ్చింది. గ్రామ పంచాయతీల విలీనంతో అవుటర్ రింగు రోడ్డు పరిధి మొత్తం పూర్తి పట్టణ ప్రాంతంగా మారనుంది. రంగారెడ్డి జిల్లా పరిధిలో 12 గ్రామాలను 4 మున్సిపాలిటీల్లో విలీనం చేయగా, అత్యధికంగా మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా పరిధిలోని 28 గ్రామాలను 7 మున్సిపాలిటీల్లో విలీనం చేశారు. సంగారెడ్డి జిల్లా పరిధిలో 11 గ్రామాలను అక్కడి రెండు మున్సిపాలిటీల్లో విలీనం చేశారు.

## రాష్ట్ర వ్యాప్తంగా 1,368 కేంద్రాలో గ్రూప్-2 పరీక్ష

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఈనెల 15, 16 తేదీల్లో రాష్ట్ర వ్యాప్తంగా 1,368 కేంద్రాల్లో గ్రూప్2 పరీక్షలు నిర్వహించనున్నట్టు తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టిజిపిఎస్‌సి) ఒక ప్రకటనలో తెలిపింది. 9వ తేదీ నుంచి టిజిపిఎస్‌సి వెబ్ సైట్‌లో హాల్‌టికెట్లు డౌన్లోడ్ చేసుకోవచ్చని తెలిపింది. ఉదయం, మధ్యాహ్నం మొత్తం రెండు సెషన్లలో పరీక్షలు నిర్వహించనున్నారు. ఉదయం 8.30 నుంచి 9.30 గంటల వరకు మాత్రమే అభ్యర్థులను పరీక్షా కేంద్రంలోకి అనుమతిస్తారు. మధ్యాహ్నం పరీక్షకు 1.30 నుంచి 2.30గంటల వరకు మాత్రమే అనుమతిస్తారు.

# ఎయిర్‌షోకు భారీ ఏర్పాట్లు

తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణకు
హాజరుకానున్న లక్ష మంది మహిళలు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ప్రజాపాలన విజయోత్సవాలలో భాగంగా ఆదివారం నిర్వహించే ఎయిర్ షోకు భారీ సంఖ్యలో నగర ప్రజలు హాజరయ్యే అవకాశమున్నందున, వారికి ఏవిధమైన ఇబ్బందులు కలుగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి ఆదేశించారు. ప్రజాపాలన విజయోత్సవాల సందర్భంగా 8వ తేదీన వైమానిక ప్రదర్శన, 9న తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ ఏర్పాట్లపై సచివాలయంలో శనివారం ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. జిఏడి కార్యదర్శి రఘునందన్ రావు, సమాచార శాఖ ప్రత్యేక కమిషనర్ హరీశ్, హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, అదనపు కమిషనర్(పోలీస్) విక్రంజీత్ మాన్, విద్యా శాఖ డైరెక్టర్ వెంకట నర్సింహా రెడ్డిలు ఈ సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా సి.ఎస్. శాంతి కుమారి మాట్లాడుతూ భారతీయ వైమానిక దళం ఏర్పాటు చేస్తున్న ఎయిర్‌షోలో తొమ్మిది సూర్యకిరణ్ విమానాలు పాల్గొంటాయని తెలిపారు.

**ఎయిర్‌షో నిర్వహించనున్న ప్రపంచంలోనే ఉత్తమ టీమ్..**

ఈ రకమైన విన్యాసం చేయగల సత్తా ప్రపంచంలో కేవలం 5 టీమ్‌లకు మాత్రమే ఉందన్నారు. అందులో ఒక టీమ్ హైదరాబాద్‌లో చేయటం మన రాష్ట్రానికే గర్వ కారణమన్నారు. ముఖ్యంగా, ముఖ్యమంత్రితో పాటు, రాష్ట్ర మంత్రులు, వివిఐపిలు, వైమానిక దళానికి చెందిన సీనియర్ అధికారులు ఈ ఎయిర్‌షో వీక్షించడానికి హాజరవుతున్నందున విస్తృత ఏర్పాట్లు చేయాలని స్పష్టం చేశారు. సాయంత్రం 4 గంటలకు ప్రారంభమయ్యే ఈ ఎయిర్‌షోలో సూర్యకిరణ్‌కు చెందిన తొమ్మిది విమానాలు పాల్గొంటాయన్నాను.

ఈ షోతోపాటు సాయంత్రం నిర్వహించే మ్యూజికల్ కాన్సర్ట్‌కు నెక్లెస్ రోడ్, పి.వి. మార్గ్‌లలో భారీ సంఖ్యలో ప్రజలు హాజరవుతారని, వారి సౌకర్యార్థం ఇప్పటికే ఫుడ్ స్టాళ్లు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ ఎయిర్‌షో అనంతరం రాహుల్ సింప్లి గంజ్ మ్యూజికల్ కాన్సర్ట్ కార్యక్రమానికి కూడా పెద్ద సంఖ్యలో హాజరయ్యే అవకాశమున్నందున తగిన మౌలిక సదుపాయాలు, భద్రతా ఏర్పాట్లను చేపట్టాలని సూచించారు.

**లక్ష మంది మహిళల సమక్షంలో 9న తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ**

ప్రజాపాలన విజయోత్సవాల ముగింపు రోజైన సోమవారం సాయంత్రం 6 గంటలకు సచివాలయంలో తెలంగాణ తల్లి విగ్రహాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ఆవిష్కరిస్తారని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి తెలిపారు. సచివాలయ ఆవరణలో జరిపే ఈ ఆవిష్కరణ కార్యక్రమానికి దాదాపు లక్ష మంది పాల్గొంటారని, ఇందుకు తగిన ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఆవిష్కరణ సందర్భంగా దాదాపు 150 మంది ప్రముఖులు ఆసీనులయ్యేలా ప్రధాన వేదికతో పాటు సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకు మరో వేదిక ఏర్పాటు చేయాలన్నారు. తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ కార్యక్రమానికి ప్రజా ప్రతినిధులకు, నగర ప్రముఖులకు ఆహ్వానాలను సకాలంలో పంపాలన్నారు. అనంతరం, ఈ కార్యక్రమాలకు హాజరయ్యే వారి వాహనాల పార్కింగ్, వారికి కనీస సౌకర్యాల ఏర్పాటు, తదితర అంశాలపై మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి దాన కిషోర్, జిహెచ్‌ఎంసి కమిషనర్ ఇలంబర్తి, సిడిఎంఎ కమిషనర్ శ్రీదేవి, హైదరాబాద్, రంగా రెడ్డి, మేడ్చల్ జిల్లాల కలెక్టర్లతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించి సమీక్షించారు. 9వ తేదీన తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ కార్యక్రమానికి హాజరయ్యే స్వయం సహాయ బృందాల మహిళలు, ఇతరులకు మధ్యాహ్నం నాలుగున్నరలోగా సభా ప్రాంగణానికి చేరుకునేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

నెక్లస్ రోడ్, పీపుల్స్ ప్లాజా, గోశాల రోడ్, నిజాం కాలేజ్, పబ్లిక్ గార్డెన్‌లలో పార్కింగ్‌కు ఏర్పాట్లు చేశామని నగర పోలీస్ అదనపు కమిషనర్(పోలీస్) విక్రంజీత్ సింగ్ మాన్ తెలిపారు. అనంతరం పార్కింగ్ ఏర్పాట్లు చేపట్టాలని సి.ఎస్. సూచించారు.

## ఈ ఏడాదిలో బిఆర్ఎస్‌కు గడ్డు కాలం

అధికారాన్ని కోల్పాయం..కవిత జైలుకు పోయింది..
ఒక్క ఎంపి సీటూ రాలె : కెటిఆర్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** బిఆర్ఎస్ అధికారాన్ని మాత్రమే కోల్పోయిందని, పోరాడే తత్వాన్ని కోల్పోలేదని బిఆర్ఎస్ వర్కింగ్ పుఎతెలిపారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఊహించని విధంగా బిఆర్ఎస్ ఓడిపోయిందని, పార్లమెంట్ ఎన్నికల్లో ఒక్క సీటు కూడా రాలేదని,ఎంఎల్‌సి కవితను ఐదు నెలల పాటు జైలులోపెట్టారని, సంవత్సర కాలం బిఆర్ఎస్‌కు అత్యంత గడ్డుకాలమని చెప్పారు. మాజీ ఎంఎల్‌ఎ రసమయి బాలకిషన్ ఆధ్వర్యంలో 'ఏడాది కాంగ్రెస్ పాలన'పై రూపొందించిన 22 నిమిషాల నిడివి గల 'నమ్మి నానబోస్తే 'లఘు చిత్రాన్ని తెలంగాణ భవన్‌లో శనివారం బిఆర్ఎస్ నాయకులతో కలిసి కెటిఆర్ వీక్షించారు. ఎంఎల్‌సిలు మధుసుధనా చారి ,దేశపతి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కెటిఆర్ మాట్లాడుతూ వచ్చే ఏప్రిల్‌తో బిఆర్ఎస్ స్థాపించి 24 ఏళ్ళు పూర్తి చేసుకుని, 25వ సంవత్సరం లోకి అడుగు పెడుతోందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై ఒక సంవత్సరంలోనే వ్యతిరేకత వచ్చిందని, నేడు గాంధీ భవన్ బోసిపోయిందని, తెలంగాణ భవన్ నిత్యం కళకళలాడుతోందని అన్నారు. అసెంబ్లీ సమావేశాల్లో ప్రజల సమస్యలను లేవనెత్తుతామన్నారు.

**లగచర్ల భూసేకరణ బాధితులకు అండగా ఉంటాం: కెటిఆర్**

లగచర్ల భూసేకరణ బాధితులు బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్‌ను తెలంగాణ భవన్‌లో శనివారం కలిశారు.ఈ సందర్భంగా కెటిఆర్ మాట్లాడుతూ లగచర్ల బాధితులకు బిఆర్ఎస్ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ప్రభుత్వం వేధింపులను మానుకొని బాధితుల డిమాండ్లను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

# గురుకులాలతో రాజకీయాలొద్దు

20 సంవత్సరాలుగా
గురుకులాల్లో ఇదే పరిస్థితి
2012 నుంచి 2023 వరకు
విచారణ చేపట్టండి : గురుకులాల జెఎసి




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** దురదృష్టవశాత్తు ప్రభుత్వ గురుకులాల్లో జరుగుతున్న కొన్ని చిన్న, చిన్న సంఘటనలను రాజకీయ పార్టీలు, వాటి అనుబంధ సంఘాలు తమ స్వార్థ ప్రయోజనాలకు ఉపయోగించుకుంటున్నాయని గురుకులాల జెఎసి మండిపడింది. ప్రస్తుతం జరుగుతున్న ఘటనలు గత 20 సంవత్సరాలుగా జరుగుతున్నాయని, ఈఘటనలు గతంలో ఎప్పుడూ జరగలేనట్టుగా, కేవలం ఇప్పుడే జరుగుతున్నట్టుగా కొన్ని రాజకీయ పార్టీలు తమ స్వార్థం కోసం వాడుకోవడాన్ని గురుకుల జెఎసి ఖండించింది. 2012 సంవత్సరం నుండి 2023వరకు గురుకులాల్లో జరిగిన అన్ని అవినీతి, అక్రమాలపైన విద్యార్థి, ఉపాధ్యాయ, ఉద్యోగులకు జరిగిన అనేక నష్టాలపైన విచారణ చేపడితే, దోషులను శిక్షించేందుకు , తాము సాక్షాలతో సహా నిరూపించేందుకు గురుకుల జెఎసి విచారణకు పూర్తిగా సహకరిస్తుందని తెలిపింది. తెలంగాణ రాష్ట్ర గురుకులాల జెఎసి ప్రతినిధుల సమావేశం హైదరాబాద్, నాగోల్‌లో శనివారం జరిగింది. ఈ సమావేశంలో జెఎసి అధ్యక్షుడు మామిడి నారాయణ, ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎ. మధుసూదన్, కార్యనిర్వాహక కార్యదర్శి కె. జనార్ధన్, ఎస్‌డబ్ల్యు యూనిట్ రాష్ట్ర అధ్యక్షుడు అలగోని నరసింహులు గౌడ్, ప్రధాన కార్యదర్శి ఎస్.గణేష్, ఉపాధ్యక్షుడు బి. బిక్షంయాదవ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుత వివిధ రాజకీయ పార్టీల చర్యలు గురుకుల పాఠశాలను నిర్వీర్యం చేసేలా ఉన్నాయని మండిపడింది. గురుకులాల్లో జరుగుతున్నటువంటి సంఘటనలు కేవలం మానవ తప్పిదాలే తప్ప, వ్యవస్థపరమైన లోపాలు కావని వారు తెలిపారు. ఈ వ్యవస్థ పట్ల పూర్తి అవగాహన కలిగిన వ్యక్తులు కూడా సమస్యలను పక్కదారి పట్టిస్తూ, ప్రభుత్వాన్ని, ఇందులో పని చేస్తున్న ఉపాధ్యాయ, ఉద్యోగ వర్గాన్ని దోషులుగా చిత్రీకరిస్తున్నారని తెలిపారు. కొన్ని రాజకీయ పార్టీల కార్యక్రమాలతో గురుకులాలో పనిచేస్తున్న ప్రతి ఉపాధ్యాయ, ఉద్యోగ వర్గం క్షణక్షణం భయభ్రాంతులకు గురవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి సుమారు 40 శాతం మెస్‌చార్జీలు పెంచడం ఒక చారిత్రకమని వారు తెలిపారు.

## ఎస్‌సిఆర్‌లో మహిళా అధికారుల సమర్థ నాయకత్వం

చరిత్రలో మొట్టమొదటిసారిగా సెక్యూరిటీ,
కమర్షియల్, ఆపరేటింగ్, మెడికల్
విభాగాధికారులుగా మహిళలు





**ప్రజాపక్షం / హైదరాబాద్:** దక్షిణ మధ్య రైల్వే (ఎస్‌సిఆర్) చరిత్రలో మొట్టమొదటిసారిగా సెక్యూరిటీ, కమర్షియల్, ఆపరేషన్స్, మెడికల్ నాలుగు కీలక విభాగాలకు ప్రస్తుతం మహిళా అధికారులు సమర్ధవంతంగా నాయకత్వం వహిస్తున్నారు. ఎస్‌సిఆర్ రైల్వే భద్రతా విభాగం ఇన్‌స్పెక్టర్ జనరల్, ప్రిన్సిపల్ చీఫ్ సెక్యూరిటీ కమిషనర్‌గా అరోమా సింగ్ ఠాకూర్, ఆపరేటింగ్, కమర్షియల్ రెండు విభాగాలకు ప్రిన్సిపల్ చీఫ్ కమర్షియల్ మేనేజర్ కమ్ ప్రిన్సిపల్ చీఫ్ ఆపరేషన్స్ మేనేజర్‌గా కె.పద్మజ, రైల్వే వైద్య విభాగానికి నూతన ప్రిన్సిపల్ చీఫ్ మెడికల్ డైరెక్టర్‌గా డాక్టర్ నిర్మల నరసింహన్ బాధ్యతలు స్వీకరించి మహిళా అధికారులే నాయకత్వం వహిస్తుండడం గమనార్హం. ఈ మహిళా అధికారులు రైల్వే బోర్డు మరియు జోనల్ స్థాయిలో తమ సంబంధిత విభాగాల విజయాలు, పనితీరును తెలియజేస్తూ ఉన్నత స్థాయి సమావేశాలలో క్రమం తప్పకుండా పాల్గొంటారు. రైలు కార్యకలాపాలను మెరుగుపరచడంలో, జోన్ మొత్తం పనితీరును మెరుగుపరచడంలో కీలకమైన సూచలను అందించడం ద్వారా భద్రత పనితీరు సమీక్ష సమావేశాలలో కూడా వారు ప్రధానపాత్రను పోషిస్తున్నారు.

ప్రిన్సిపల్ చీఫ్ కమర్షియల్ మేనేజర్‌గా కె.పద్మజ 2024 జూలైలో బాధ్యతలు స్వీకరించి వినియోగదారుల సంతృప్తి, రాబడిని నిర్ధారించే విధంగా ప్రయాణీకుల, సరుకు రవాణా సేవల సమర్థవంతమైన నిర్వహణను పర్యవేక్షిస్తున్నారు. తద్వారా రూ.3,817 కోట్లు ప్రయాణీకుల ఆదాయాన్ని ఆర్జించిం ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో మొత్తంగా (నవంబర్ వరకు) స్థూల మూలాధార ఆదాయం రూ.13,231 కోట్లు సాధించారు. ఎస్‌సిఆర్ ఇన్‌స్పెక్టర్ జనరల్ కమ్ ప్రిన్సిపల్ చీఫ్ సెక్యూరిటీ కమిషనర్ అరోమా సింగ్ ఠాకూర్ 2023 జూలైలో బాధ్యతలు స్వీకరించి జోన్‌వ్యాప్తంగా ప్రయాణికుల ప్రాణాలను, రైల్వే ఆస్తులను కాపాడేందుకు ఆపరేషన్ యాత్రి సురక్ష, ఆపరేషన్ అమానత్, ఆపరేషన్ నాన్హే ఫరిస్తే, ఆపరేషన్ సతార్క్ వంటి పలు కార్యక్రమాలను పెద్ద ఎత్తున చేపట్టడంలో ఆమె కీలక పాత్ర పోషించారు . డాక్టర్ నిర్మల నరసింహన్ 2024 డిసెంబర్‌లో ప్రిన్సిపల్ చీఫ్ మెడికల్ డైరెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించి ఉద్యోగుల ఆరోగ్య సంరక్షణ, ప్రయాణీకులకు అత్యవసర వైద్య సహాయం, పరిశుభ్రత, పారిశుధ్యం, ఉద్యోగులు, వారి కుటుంబాలు, ప్రయాణీకుల సంక్షేమానికి భరోసా ఇవ్వడంలో ముఖ్యమైన పాత్ర పోషిస్తున్నారు. తద్వార జోన్ సమర్థవంతమైన, సురక్షితమైన పనితీరుకు గణనీయంగా తోడ్పడుతున్నారు. మహిళా అధికారుల ప్రావీణ్యానికి, వివిధ రంగాల్లో మహిళలు పెరుగుతున్న శక్తికి జోన్‌కు చెందిన చైతన్యవంతమైన మహిళా అధికారులే తొలిసారిగా నాలుగు విభాగాలకు నేతృత్వం వహించడం నిదర్శనమని పట్ల ఎస్‌సిఆర్ జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్ హర్షం వ్యక్తం చేశారు.

## పూర్తయిన ప్రజాపాలన
# విజయోత్సవాల ఏర్పాట్లు

నెక్లెస్ రోడ్‌లో బిర్యాని, చాట్, ఐస్ క్రీం, తెలంగాణ,
నార్తన్ రకాల ఫుడ్ స్టాళ్ల ఏర్పాటు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ప్రజాపాలన విజయోత్సవాలలో భాగంగా పి.వి. నర్సింహ రావు మార్గ్‌లో నరగంలోని ప్రముఖ హుటల్స్ ఫుడ్ స్టాళ్లను శనివారం నుండి సోమవారం వరకు ఏర్పాటు చేశారు. హైదరాబాద్, మొగలాయి, తెలంగాణ, ఆంధ్ర వంటకాలతో పాటు బేకరి ఐటమ్స్, ఐస్ క్రిమ్ పార్లర్లను విజయోత్సవాల్లో పాల్గొనే సందర్శకుల సౌకర్యార్థం వందకు పైగా ఫుడ్ స్టాళ్లను అందుబాటులోకి తెచ్చారు. వందేమాతరం శ్రీనివాస్ మ్యూజికల్ నైట్ నిర్వహణకు ఐమాక్స్ హెచ్‌ఎండిఏ గ్రౌండ్స్‌లో విశాలమైన వేదిక, సౌండ్ సిస్టంతో పాటు సందర్శకులకు సీటింగ్ ఏర్పాట్లు చేశారు. ఈ ఏర్పాట్లను సమాచార శాఖ ప్రత్యేక కమిషనర్ డాక్టర్ హరీశ్‌తో పాటు శాఖ ఉన్నతాధికారులు దగ్గరుండి పనులను పర్యవేక్షించారు.

అంతర్జాతీయంగా పేరొందిన హైద్రాబాదీ దమ్ బిర్యానితో పాటు మొగలాయి, జఫ్రాని బిర్యాని పర్యాటకులకు అందిచేదుంకు ప్యారెడైజ్, పిస్తా హౌజ్, షాదాబ్, బడేమియా కబాబ్ తదితర హోటళ్లు తమ బ్రాండ్ స్టాల్స్‌ను ఏర్పాటు చేశాయి. వీటితో పాటు తెలంగాణ వంటకాలుగా పేరొందిన పాలమూర్ గ్రిల్, తెలంగాణ విందు, అంకాపూర్ నాటు కోడి చికెను, ఫుడ్ జాయింట్స్‌ను అందుబాటులోకి తెచ్చారు. నిలోఫర్ కెఫె, బ్రౌన్ బేర్ బేకరీలు ప్రాంకిల్ మ్యాగి హాట్‌స్పాట్ కాంటినెంటల్ కాఫీ, ప్రాంకి అండ్ రోల్స్, మొమోస్ అండ్ ఫ్రైస్‌తో పాటు గోకుల చాట్ కూడ తమ సంస్థ ఫుడ్ స్టాళ్లను ఏర్పాటు చేసింది. వీటితో పాటు ఆగ్రా చాట్ అండ్ స్వీట్స్ ఐస్ కంనప్షన్ ఎం బైట్స్, స్టాళ్లను ఏర్పాటు చేశారు. స్త్రీ శక్తి క్యాంటిన్లను కూడ పెద్ద ఎత్తున అందుబాటులోకి తెచ్చారు.

# రైతులకు గిట్టుబాటు ధరపై చర్యలు

మార్కెట్ కమిటీ వైస్ చైర్మెర్ బాబర్ ఖాన్

**ప్రజాపక్షం/ఫరూఖ్‌నగర్:** రైతులకు గిట్టుబాటు ధర కల్పించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని విధాల చర్యలు తీసుకుంటుందని షాద్‌నగర్ వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మెన్ బాబర్ అలీఖాన్ వివరించారు. శనివారం షాద్‌నగర్‌లో నూతనంగా ఎన్నికైన మార్కెట్ కమిటి వైస్ చైర్మెన్‌తోపాటు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, కాంగ్రెస్ శ్రేణులను ఘనంగా శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా బాబర్‌ఖాన్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీకి యెనలేని సేవలు అంధించడంతోనే తనకు ఈ పోస్టు వచ్చిందని, వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఎల్లప్పుడు రైతులకు అందుబాటులో ఉండటంతోపాటు గిట్టుబాటు ధర కల్పించేందుకు చర్యలు తీసుకుంటానని వివరించారు. ప్రతి కాంగ్రెస్ కార్యకర్త గ్రామీణ స్థాయి నుండి ఉన్నతమైన స్థాయికి ఎదిగేందుకు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కొందుర్గు మండల పార్టీ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, తంగేపల్లి శంకర్, కత్తి చంద్రశేఖర్ అప్ప, వీరమోని యాదయ్య, మహ్మద్ ఇబ్రహీం, చౌదరిగూడ మండల అధ్యక్షుడు రాజులు ఉన్నారు.

## గురుకుల పాఠశాలల్లో ఉన్న
# సమస్యలను పరిష్కరించాలి

పి.రాజ్‌కుమార్,
ఖాజా మహమ్మద్

**ప్రజాపక్షం/యాచారం :** కాంగ్రెస్ ప్రభుత్వం గురుకుల పాఠశాలలో నెల కొన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని బిఆర్ఎస్‌వి రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పి. రాజ్‌కుమార్, నాయకులు ఖాజుమహహ్మద్ డిమాండ్ చేశారు. శనివారం యాచారం మండల పరిధిలోని శంషాబాద్ గురుకుల పాఠశాల, కళాశాలను గురుకుల బాట కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సంధర్భంగా వారు మాట్లాడుతూ నాయకులను గురుకుల పాఠశాల యాజమాన్యం లోపలికి రాకుండా అడ్డుకోవడం ఎంతవరకు సమంజసమని ఆగ్రమం వ్యక్తం చేశారు.పాఠశాల బయటనే ఉండి సమస్యలను తెలుసకుంటుంటే ఉపాధ్యాయులు విద్యార్థులను భయభ్రాంతుకు గురిచేస్తున్నారని అన్నారు.విద్యార్థులు తమ సమస్యలను చెప్పుకోలేని పరిస్తితి ఉందని అన్నారు. కనీస వసతులులేక కిటికిలు లేక విద్యార్థులు చలికి వణుకుతూ నానా ఇబ్బందులు పడుతున్నారని అన్నారు.తెనేతెట్టలను చూసి విద్యార్థులు భయపడుతున్నారని అన్నారు. విద్యార్థుల సమస్యలపై రాజీలేని పోరాటం నిర్వహిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో సాయికిరణ్ పాల్గోన్నారు.

ఎల్‌బి నగర్ ఏసిపి కృష్ణయ్యకు
## రాంరెడ్డి పరామర్శ

**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్ :** ఎల్‌బి నగర్ ఏసిపి క్రిష్ణయ్య ఇటీవల అనారోగ్యానికి గురికావడంతో ఎల్‌బి నగర్‌లోని కామినేని హాస్పటల్‌లో చికిత్స పొందుతున్న వారిని తెలంగాణ రాష్ట్ర రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రామ్‌రెడ్డి శనివారం కామినేని హాస్పటల్‌లో వారిని పరామర్శించారు. ఈ సందర్భంగా వారి ఆరోగ్య పరిస్థితులు హాస్పటల్ డాక్టర్‌ను అడిగి తెలుసుకున్నారు. ఏసిపి క్రిష్ణయ్యను ధైర్యంగా ఉండాలని, మనోధైర్యం కల్పించారు. వారి వెంట సరూర్ నగర్ సిఐ సైదిరెడ్డి, కాంగ్రెస్ చైతన్యపురి డివిజన్ అధ్యక్షులు బండ సురేందర్‌రెడ్డి, గడ్డిఅన్నారం ఏఎంసి డైరెక్టర్ పన్యాల జైపాల్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

**ఏసిపిని కమిషనర్ పరామర్శ :** రాచకొండ సిపి సుధీర్‌బాబు కామినేని హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న ఎల్‌బి నగర్ ఏసిపి కృష్ణయ్యను రాచకొండ సీపీ సుధీర్‌బాబు శనివారం హాస్పిటల్‌లో పరామర్శించారు. కృష్ణయ్య ఆరోగ్య పరిస్థితిని ఆసుపత్రి డాక్టర్లలతో చర్చించి పులు సూచనలు తెలుసుకున్నారు.కృష్ణయ్య కుటుంబానికి మనోధైర్యం కల్పించారు.

# గంజాయి నిర్మూలించే వరకూ దాడులు కొనసాగింపు

ఆపరేషన్ దూల్‌పేట్‌పై
ఎక్సైజ్ శాఖ సమీక్ష



**ప్రజాపక్షం/హైదరాబాద్:** గంజాయి నిర్మూలించే వరకు దాడులు కొనసాగిస్తునే ఉండాలని ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ విబి కమలాసన్ రెడ్డి అధికారులను ఆదేశించారు. శనివారం ఆబ్కారీ భవన్‌లో 'ఆపరేషన్ దూల్‌పేట్'పై అధికారులతో కమలాసన్‌రెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..గంజాయి, డ్రగ్స్‌పై ప్రభుత్వం సీరియస్‌గా ఉందని, ఏడాది కాలంలో కొంత మేర సత్ఫలితాలు ఇచ్చాయని, అయినా ఇంకా హైదరాబాద్‌కు గంజాయి, డ్రగ్స్ సరఫరా అవుతునే ఉన్నాయన్నారు. ఆపరేషన్ దూల్‌పేట్‌లో భాగంగా 80 శాతం వరకు విజయాలు సాధించామన్నారు. కొంతమంది జైలుకు వెళ్లి వచ్చినా తిరిగి గంజాయి వ్యాపారం కొనసాగిస్తున్నారని, దూల్‌పేట్‌లో గంజాయి అమ్మకాలు పూర్తిగా నిలిచిపోయేంతవరకు విశ్రమించేదిలేదన్నారు.పోలీసులు, ఎక్సైజ్ అధికారులు సంయుక్తగా దాడులు చేయడం వల్లనే గంజాయి అమ్మకాలు పూర్తిగా అరికట్టవచ్చన్నారు.

గంజాయి అమ్మకాలను పూర్తిగా లేకుండా చేయాలని సిఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన అదేశాల మేరకు ఎక్సైజ్, పోలీసులు కఠినంగా వ్యవహరించాలని అదేశించారు.గంజాయి అమ్మకందార్ల ప్రొఫైల్స్ తయారీ చేయాలని అధికారులకు సూచించారు.ఎక్సైజ్ అధికారులు చేపడుతున్న అపరేషన్ దూల్‌పేట్‌కు పోలీసుల నుంచి పూర్తి సహకారం అందిస్తామని సౌత్, నార్త్ జోన్ డిసిపి జి .చంద్రమోహన్ హామీ ఇచ్చారు. కొత్త సంవత్సరం వేడుకలు, ఇతర పండుగల నేపథ్యంలో స్టేట్ టాస్క్‌ఫోర్స్ టీమ్‌లు, డ్రగ్స్, నాన్‌డ్యూటీ పెయిడ్ లిక్కర్‌పై గట్టి నిఘా పెట్టాలని కమలాసన్‌రెడ్డి తెలిపారు.నార్కోటిక్, ఎస్‌ఓటి స్థాయిలో ఎస్‌టిఎఫ్ టీమ్లు పని చేయాలని అదేశించారు. బాగా పని చేసిన టీమ్‌లకు క్యాష్ అవార్డు ను కూడ అందిస్తామని అన్నారు. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చె డ్రగ్స్, మద్యంపై ప్రత్యేక నిఘా పెట్టాలన్నారు. ఈ సమావేశంలో ఎక్సైజ్ ఎన్ ఫోర్స్మెంట్ డైరెక్టర్ కమలాసన్‌రెడ్డితో పాటు సౌత్, నార్త్ జోన్ డిసిపి జి .చంద్రమోహన్ పాల్గోన్నారు. జాయింట్ కమిషనర్లు ఖురేషి, కెవిబి శాస్త్రీ, అసిస్టేంట్ కమిషనర్లు అనిల్ కుమార్‌రెడ్డి, ప్రణవీ, అడిషనల్ ఎస్‌పి భాస్కర్, అపరేషన్ దూల్‌పేట్ ఇన్‌చార్జీ నంద్యాల అంజి రెడ్డి , డిఎస్‌పిలు తుల శ్రీనివాసరావు, తిరుపతి యాదవ్, ఎక్సైజ్ సూపరిండెంట్లు ప్రణిత్రావు, మంగళ్‌హాట్ సిఐ మహేష్, ఎస్ఐ అస్లమ్ ఎక్సైజ్ సిబ్బంది పాల్గన్నారు.



## చేనేత కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వ పథకాల సద్వినియోగం

**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధి :** చేనేత, జౌళి శాఖ ఆధ్వర్యంలో ప్రజా పాలన విజయోత్సవాల సందర్భంగా చేనేత కార్మికుల తో శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో సమావేశం ఏర్పాటు చేసి అవగాహన కలిగించారు. ఈ సమావేశం లో రెవెన్యూ అదనపు కలెక్టర్ మోహన్ రావు మాట్లాడుతూ దేశంలో వ్యవసాయం తర్వాత చేనేత రంగంలో జీవనోపాధి పొందుతున్న చేనేత కార్మికులు ఎక్కువగా ఉన్నారని తెలిపారు. వస్త్రాల తయారీ లో వస్తున్న ఆధునాతన సాంకేతిక మార్పుల కారణంగా చేనేత రంగంలో కార్మికులు ఇబ్బందులు ఎదుర్కొన్నప్పటికి, నూతన డిజైన్ లు, వైవిధ్యత తో వస్త్రాల తయారి తో ముందుకు పోవాలని అన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న నేతన్న కు చేయూత ద్వారా చేనేత కార్మికుడు పొదుపు చేసుకున్న డబ్బుకు రెండింతలు ప్రభుత్వం వాటాగా వారి అకౌంట్లలో జమ చేస్తుందని అన్నారు, నేతన్న బీమా ద్వారా చనిపోయిన కార్మికుని కుటుంబ సభ్యులకు 5 లక్షల బీమా చెల్లిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా నేతన్నకు చేయూత ద్వారా 2 కోట్ల 15 లక్షల 59 వేల రూ.లు చెక్కును అంద చేశారు. తొలత సమావేశం కు హాజరైన చేనేత కార్మికులు ప్రభుత్వ పథకాల ద్వారా ఏ విధంగా లబ్ధి జరిగింది. వివరించారు. సమావేశంలో చేనేత కార్మికుల ను అదనపు కలెక్టర్ శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సమావేశం లో చేనేత, జౌళి శాఖ డిప్యూటీ డైరెక్టర్ నాగ లత, సహాయ సంచాలకులు బాబు, బిక్షప్ప, అభివృద్ధి అధికారి రాజేష్ బాబు, సహాయ అభివృద్ధి అధికారులు లావణ్య, విజయ్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.



## సిఎం కప్ క్రీడలు ప్రారంభించిన ఎమ్మెల్యే

**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధి :** సిఎం కప్ క్రీడలను మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి శనివారం మహబూబ్‌నగర్ మండలం లోని కోడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ప్రారంభించారు. ఈసందర్భంగా క్రీడాకారులను ఆయన పరిచయం చేసుకుని, శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సియం కప్ గ్రామీణ క్రీడాకారులను ఒక గొప్ప వరమని, ఈ అవకాశం అని ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలి సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, మార్కెట్ కమిటీ చైర్మన్ బెక్కెరి అనిత మధుసూదన్ రెడ్డి, ఎంఇఓ కృష్ణయ్య, ప్రిన్సిపాల్ వెంకటేశ్వరమ్మ, నాయకులు ధర్మాపూర్ నర్సింహారెడ్డి, శ్రీనివాస్ యాదవ్, ఆంజనేయులు, గోపాల్, రవి తదితరులు పాల్గొన్నారు.



## నవోదయ మంజూరు పట్ల హర్షం

**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధి :** పాలమూరు జిల్లా కేంద్రంలోని బిజెపి జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో పాలమూరు జిల్లాకు జవహర్ నోవదయ విద్య కేంద్రం మంజూరు చేసినందుకు గాను ప్రధాని నరేంద్ర మోడీ, పాలమూరు ఎంపీ డీకె అరుణ చిత్రపటానికి పాలభిషేకం చేయడం జరిగింది. ఈ సందర్భంగా శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ పార్లమెంట్ ఎన్నికలలో భాగంగా పాలమూరు పార్లమెంట్ సభ్యురాలు డి కె అరుణ ఇచ్చిన హామీ ప్రకారం నవోదయ విద్యా కేంద్రాన్ని జిల్లాకు మంజూరు చేసేలా చేశారని అన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర, జిల్లా మండల నాయకులు, వివిధ మోర్చ లో అధ్యక్షులు పాల్గొన్నారు.

## ఎంవిఎస్ కళాశాల సమీకృత విద్యా భవనానికి శంకుస్థాపన

**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధి :** మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని, క్రిష్టియన్ పల్లి లోని ఎంవిఎస్ కళాశాల సమీకృతి విద్యా భవనానికి శనివారం మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మహబూబ్‌నగర్ ను ఎడ్యుకేషనల్ హబ్ గా మార్చుటక నిరంతరం కృషి చేస్తామని, రానున్న రెండు మూడు సంవత్సరాల్లో అన్ని ప్రభుత్వ విద్యా సంస్థల్లో మౌళిక సదుపాయాల కల్పన చేస్తామని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ రాణి రాజు,గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పద్మావతి, టిడిసిసి ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ, నాయకులు అజ్మత్ అలి, గుండా మనోహర్, హాస్పిటల్ డెవలప్మెంట్ కమిటీ సభ్యులు బెజ్జుగం రాఘవేందర్, ఎంవిఎస్ కళాశాల అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.




## హైటెక్ బస్టాండ్ ఏర్పాటుకు కృషి

### ఎమ్మెల్యే డాక్టర్ రాజేష్‌రెడ్డి

**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌టౌన్ :** పట్టణంలో ఆర్‌టిసిబస్టాండు ఖాళీస్థలంలో హైటెక్ బస్టాండుఏర్పాటుకు మంత్రితోచర్చించి ఏర్పాటుచేస్తానని ఎమ్మెల్యే డాక్టర్ రాజేష్‌రెడ్డి అన్నారు. శనివారం ప్రజాపాలన విజయోత్సవాలలో భాగంగా ఆర్‌టిసి బస్టాండు ఆవరణలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారంటీలనుఅమలుచేయడమే లక్ష్యంగా పనిచేస్తుందని, ఇప్పటికే 90శాతం పథకాలను అమలుచేయడం జరిగిందన్నారు. మహిళలకు ఉచితబస్సు సౌకర్యం కల్పించడంవలన 25వేలమంది ఉచితంగా ప్రయాణించడం జరిగిందని ఆర్‌టిసి సంస్థకు డిపో పరిధిలో 42లక్షల ఆదాయం లభించినట్లు తెలిపారు. త్వరలో డిపోకు కొత్తబస్సులను మంజూరు చేయించడం జరుగుతుందని త్వరలో ప్రజలకు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌టిసి డిఎం యాదయ్య, ఆర్‌టిసి సీఐ బాలసరస్వతి, కౌన్సిలర్లు శ్రీనివాసులు, నిజాం, రాజ్‌కుమార్‌రెడ్డి, సునీంద్ర సుల్తాన్, అమృతరెడ్డి నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

# ఆడపిల్లలను నిర్లక్ష్యం చేయొద్దు

### మౌలిక వసతులు కల్పించే బాధ్యత నాది : ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి



**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధిః** భవిష్యత్తు బాగుకోసం కష్టపడే తత్వం అలవర్చుకోవాలని విద్యార్థులకు మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి సూచించారు. శనివారం నాడు ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో జరిగిన తల్లిదండ్రుల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగాహాజరై మాట్లాడారు. రెండు సంవత్సరాలు కష్టపడితే జీవితం అంతా కూడా సంతోషంగా ఉంటుందని అందుకు తల్లిదండ్రులు పిల్లల భవిష్యత్తు కు తోడ్పాటు అందించడం, పిల్లల చదువు పట్ల శ్రద్ధ వహించడం బాధ్యత గా భావించాలని ఆయన చెప్పారు. పిల్లలు మంచిగా చదువుకుని సమాజంలో పేరు ప్రతిష్టలు పొందితే అది తల్లి దండ్రులకు లభించే గౌరవమే కదా అని ఆయన అన్నారు. మహబూబ్‌నగర్‌లోని ప్రభుత్వ కళాశాలల్లో కూడా నాణ్యమైన విద్య అందుబాటులో ఉందని, ఇక్కడ ఇంజనీరింగ్ మెడికల్ ఎంట్రెన్స్ కోసం శిక్షణ పొందుతున్న వారు ఈ సంవత్సరం 100 మంది ఉన్నారని, రానున్న సంవత్సరం రెండు వందల మంది విద్యార్థులకు శిక్షణ ఇప్పిస్తామని, వారు మంచి ర్యాంకులు సాధించి తీసుకురావాలని ఆయన కోరారు. ఆడపిల్లలు మంచిగా చదువుకుని బాగుపడితే, సమాజం అభివృద్ధి చెందుతుందని, ఆడపిల్లలు అంటే అన్నం పెట్టే వారని, వారిని నిర్లక్ష్యం చేయకండి అని ఆడపిల్లలు ఎక్కడ ఉన్నా తల్లిదండ్రుల గుర్తించి మంచి ఆలోచన చేస్తారని ఆయన చెప్పారు. అందుకే ఉన్నత చదువుల కోసం దూర ప్రాంతాలకు మన పిల్లలు పోవాల్సిన పనిలేదని, పాలమూరు యూనివర్సిటీలోనే ఇంజనీరింగ్‌లా కళాశాలలను ఏర్పాటు చేయడం జరిగిందని వచ్చే విద్యాసంవత్సరం నుంచి ఇక్కడ తరగతులకు ప్రారంభించడం జరుగుతుందని, అలాగే ఆల్ మదినా కళాశాలలో సైతం ఒక మైనార్టీ ఇంజనీరింగ్ కళాశాల తెచ్చుకునే ప్రయత్నం చేస్తున్నామని ఆయన చెప్పారు. మహబూబ్‌నగర్ అంటేనే చదువుల నిలయంగా పేరు తీసుకురావాలని ఆయన చెప్పారు. మహబూబ్‌నగర్ ను ఎడ్యుకేషనల్ హబ్‌గా దేశంలోనే మొదటి స్థానంలో నిలపాలనే ఉద్దేశంతో నేను ఎమ్మెల్యేగా కృషి చేస్తున్నానని, మన మహబూబ్‌నగర్ కు నవోదయ స్కూల్ కూడా సాధించామని, అలాగే మహబూబ్‌నగర్‌ఫస్ట్ పేరుతో మహబూబ్‌నగర్ పట్టణంలోని బికె రెడ్డి కాలనీలో సొంత నిధులతో స్కిల్ డెవలప్‌మెంట్ లలో ఉచితంగా శిక్షణ ఇప్పిస్తున్నామని, అక్కడ ఇచ్చే శిక్షణ వల్ల వారు వాళ్ల కాళ్ల మీదనిలబడితే అంతకుమించిన ఆనందం ఏమి ఉండదని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కౌసర్ జహాన్, గ్రంథాలయ సంస్థచైర్మన్ మల్లు నర్సింహ్మా రెడ్డి ముడాచైర్మన్ లక్ష్మణ్ యాదవ్, టిపిసిసి ప్రధాన కార్యదర్శి వినోద్‌కుమార్, డిసిసి ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రి తదితరులు ఉన్నారు.

# ప్రతి ఒక్కరికి నాణ్యమైన వైద్యం



**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధి :** నాణ్యమైన వైద్యం ప్రతి ఒక్కరికి అందించటమే ప్రధాన లక్ష్యం అని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. శనివారం మహబూబ్‌నగర్ మండలం లోని జమిస్తాపూర్ గ్రామంలో 20 లక్షలతో నిర్మాణం చేపట్టనున్న ప్రైమరీ హెల్త్ సెంటర్ కోసం ఆయన భూమి పూజ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ శనివారం నిజంగా శుభ దినమని, సంవత్సర కాలం ప్రజా ప్రభుత్వం పూర్తి చేసుకుని, శనివారం హెల్త్ సెంటర్ కోసం భూమి పూజ కార్యక్రమం నిర్వహించుకోవడం ఆనందంగా ఉందని, మూడు నాలుగు నెలల సమయంలో హెల్త్ సెంటర అందుబాటు లో కి వస్తుందని ఆయన తెలిపారు. తెలంగాణ రాష్ట్ర లో ప్రజా ప్రభుత్వం ఏర్పడిన వెంటనే రాజీవ్ ఆరోగ్య శ్రీ పథకాన్ని 10 లక్షలకు పెంచిన విషయాన్ని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. విద్యా వైద్యం ఈ రెండు ఉచితంగా ప్రజలకు అందుబాటులోకి తెచ్చినప్పుడే అభివృద్ధి సాధ్యం అని ఆయన స్పష్టం చేశారు. ప్రైమరీ హెల్త్ సెంటర్ కోసం స్థలం దానం చేసిన మన్నె పెద్ద వెంకట్రాములు కుటుంబ సభ్యులు ఆదర్శంగా నిలిచారని, ఇలాంటి వ్యక్తులను ఆదర్శంగా తీసుకోవాలని ఆయన సూచించారు. ఈ సందర్భంగా అంబులెన్స్ సేవలను ఆయన ప్రారంభించారు. అనంతరం బిఆర్ఎస్ పార్టీ కి చెందిన పలువురు నాయకులు కార్యకర్తలు లో ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్ పార్టీ లో చేరారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, మార్కెట్ కమిటీ చైర్మన్ బెక్కెరి అనిత, టిపిసిసి ప్రధాన కార్యదర్శి వినోద్ కుమార్, డిసిసి ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ, నీటూరి బాలయ్య, నాగరాజు, సత్యనారాయణ, రాంచంద్రయ్య, వెంకట్ రాములు, సావిత్రి, రఘు, మాధవులు, ధర్మాపూర్ నర్సింహ్మారెడ్డి, శ్రీనివాస్ యాదవ్, గోవిందు యాదవ్, డి యం హెచ్ ఓ డాక్టర్ కృష్ణ, డాక్టర్ అజ్గర్ అలి, ఎఇ టి రాములు,వి. శంకర్ నాయక్, వైద్య సిబ్బంది ప్రజలు పాల్గొన్నారు.



## బాలికల వసతిగృహాన్ని కలెక్టర్ తనిఖీ

**ప్రజాపక్షం/కల్వకుర్తి :** పట్టణంలోని గిరిజన బాలికల వసతిగృహాన్ని శనివారం నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బదావత్‌సంతోష్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన వంటసరుకులను, బియ్యాన్ని పరిశీలించారు. తాజాగా ఉన్న కూరగాయలను వంటకు ఉపయోగించాలని , పాడైనవాటిని ఎట్టిపరిస్థితుల్లోను వంటలో వాడొద్దని సూచించారు. బియ్యాన్ని తీసుకునేముందు పరిశీలించిన తర్వాతనే తీసుకోవాలని తెలియజేశారు. డ్రైనేజీ సమస్యను హాస్టల్ వివరించగా త్వరలో పరిష్కరిస్తామని తెలిపారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, విద్యార్థులకు నాణ్యమైన బోజనాన్ని అందించాలని వార్డెన్‌కి సూచించారు. అనంతరం విద్యార్థులతో తరగతిగదిలో మెనూ ప్రకారం బోజనం అందిస్తున్నారా అని అడిగి తెలుసుకున్నారు. బాగాచదివి లక్ష్యాలను చేరుకోవాలని, పాఠశాలకు తల్లి దండ్రులకు జిల్లాకు మంచిపేరు తేవాలని సూచించారు. కలెక్టర్‌వెంట తహసీల్దార్ ఇబ్రహీం, గురుకుల పాఠశాల వైస్‌ప్రిన్సిపాల్ పార్వతమ్మ పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ నేతల వేధింపులు భరించలేక వ్యక్తి ఆత్మహత్య

**ప్రజాపక్షం/ హైదరాబాద్:** ఓ భూవివాదంలో డబ్బు కోసం ఎమ్మెల్యే అనుచరుడు తనను బ్లాక్ మెయిల్ చేస్తున్నాడంటూ సూసైడ్ నోట్ రాసి మరీ ఉరేసుకుని శ్రీనివాస్ గౌడ్ అనే వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. సూసైడ్‌కు ముందు మృతుడు శ్రీనివాస్ గౌడ్ రాసిన సూసైడ్ నోట్, తీసుకున్న వీడియో సోషల్ మీడియాలో ప్రచారం అయ్యింది. వివరాల్లోకి వెళితే.. బోరబండ ప్రాంతానికి చెందిన శ్రీనివాస్ గౌడ్ అనే వ్యక్తి వద్ద నుండి 7 సంవత్సరాల క్రితం బిఆర్ఎస్ పార్టీకి చెందిన ప్రశాంత్ సాయి చరణ్ అనే వ్యక్తులు ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ అనుచారులం అని చెప్పుకునీ శ్రీనివాస్ గౌడ్ వద్ద భూ వివద పత్రాలను, 8 లక్షల డబ్బును తీసుకుని రాజు అనే తమ స్నేహితుడు తో కలిసి భూమి పత్రాలను వేరే వాళ్ళకి అమ్మరని, తన భూమి, పత్రాలు, డబ్బులు ఇవ్వకపోగా ఇంకా 22 లక్షలు 50 వేలు డిమాండ్ చేశారని, మా భూమి, మా డబ్బు మధ్యలో మీరెవరు అని ప్రశ్నించగా సాయి చరణ్ వేధింపులు ఎక్కువ అయ్యాయని,సూత్రధారి ప్రశాంత్ అని శుక్రవారం శ్రీనివాస్ గౌడ్ సూసైడ్ నోట్ రాశాడు.

## మహిళల రక్షణే ‘షీ టీమ్స్’ ప్రధాన లక్ష్యం

**ప్రజాపక్షం / నారాయణపేట :** మహిళలు, యువతులు, బాలికలు ఆకతాయిల వలన ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లయితే నిర్భయంగా పోలీసులను సంప్రదించవచ్చని జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్ ఒక ప్రకటనలో తెలిపారు. నారాయణపేట జిల్లాలో మహిళల రక్షణ కోసం షీ టీమ్స్ యాంటి ఉమెన్ ట్రాఫికింగ్ టీంలు పని చేస్తున్నాయని తెలిపారు. విద్యార్థినులు, మహిళలు అన్యాయానికి గురైనప్పుడు భయపడొద్దని, గృహహింసకు గురైన ధైర్యంగా ముందుకు వచ్చి ఫిర్యాదు చేస్తే నిందితులపై ఖచ్చితంగా చర్యలు తీసుకుంటామన్నారు. కళాశాల, పాఠశాలల విద్యార్థినులు బస్టాండ్ల దగ్గర, గ్రామాలలో , కాలనీలలో ర్యాగింగ్ , ఈవ్ టీజింగ్‌కు గురైనా ఉద్యోగ మహిళలు పని చేసే ప్రదేశాల వద్ద వేధింపులకు గురైన బాలికలపై ఎవరైనా లైంగిక వేధింపులకు పాల్పడినా వెంటనే నిర్భయంగా షీ టీం పోలీసులను ఆశ్రయిస్తే సత్వర న్యాయం చేకూరుస్తామని ఎస్పీ తెలిపారు. నేరుగా సంప్రదించలేని వారు 8712670398 ఫోన్ నంబరుకు లేదా డయల్ 100కు ఫోన్ చేసి సమాచారం అందించాలని వారి వివరాలను గోప్యంగా ఉంచడం జరుగుతుందని , ఈ వ్యక్తులపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఎస్పీ తెలిపారు.



మహిళా సంఘాలకు రుణాలు పంపిణీ

ప్రజాపక్షం / కొత్తకోట : కొత్తకోట మండలం కానయపల్లి గ్రామంలో మహిళలను కోటీశ్వరులను చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన ఇందిరా మహిళా శక్తి పథకంలో 38 మహిళ సంఘాలకు 4 కోట్ల 37 లక్షల రూపాయల వడ్డీ లేని రుణాలను , నాటు కోళ్ల ఫాం కోసం 6 లక్షల 18వేల చెక్కులను మహిళా సంఘాలకు ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి పంపిణీ చేశారు. ప్రభుత్వ ఆర్డర్ మేరకు విద్యార్థులకు యూనిఫాం కుట్టినందుకు రూ. 1,68,000లను గతంలో ఎన్నడు లేని విధంగా మహిళ సంఘాల్లోని సభ్యుల ఇన్సూరెన్స్ కింద రూ. 1,80,714ల చెక్కులను వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. రాష్ట్రంలో మహిళలకు పెద్దపీట వేస్తూ వారిని లక్షధికారులను, కోటీశ్వరులను చేయడమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందన్నారు. మహిళలను మహలక్ష్మీ గా ప్రజా ప్రభుత్వం గౌరవిస్తున్నదని, సమాజంలో ఉన్న మహిళలు సాధికారత సాధించే లక్ష్యంగా , ప్రజా ప్రభుత్వం అనేక ప్రణాళికలు తీసుకొని ముందుకు వెళ్తున్నదన్నారు. ఇందిరా శక్తి పథకంలో పెరటికోళ్ల పెంపకం, ఇందిరా డెయిరీ, మిల్క్ పార్లర్లు, ఈవెంట్ మేనేజ్మెంట్ , మహిళ క్యాంటీన్ తదితర వినూత్న పథకాలతో మహిళలను వ్యాపార రంగంలో ప్రోత్సహిస్తున్నామన్నారు. మహిళ సంఘాల సభ్యులకు ప్రభుత్వం అందిస్తున్న రుణాలను సద్వినియోగం చేసుకొని వ్యాపార రంగంలో రాణించాలన్నారు.

ఖైదీలు, కరెక్షన్ హోమ్ పిల్లల్లో పరివర్తన కోసం..

## ‘ప్రిజన్ టూ ప్రైడ్’, ‘నయీ దిశ - రీడిఫైనింగ్ ది ఫ్యూచర్’ ప్రారంభం




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఖైదీలు, కరెక్షన్ హోమ్స్‌లో ఉన్న పిల్లల జీవితాలలో మార్పు కోసం ‘పరివర్తన్ ప్రిజన్ టూ ప్రైడ్’ ఫేజ్ తొమ్మిది, ‘నయీ దిశ రీడిఫైనింగ్ ది ఫ్యూచర్’ ఫేజ్ ఆరుని ఇండియన్ ఆయిల్ ఛైర్మన్ ఏ.ఎస్. సాహ్నీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఫేజ్‌లో 28 జైళ్లు, 14 కరెక్షన్ హోమ్స్‌లో ఉన్న 1650 మందికిపైగా వ్యక్తులకు ఇండియన్ ఆయిల్ చేరువ కానుందన్నారు. ఇది ఖైదీలకు మరో అవకాశం కల్పించడమేనన్నారు. క్రీడల రూపంలో ప్రయోజనం కల్పించడం ఆనందాన్ని ఇస్తుందన్నారు. 38 నెలల్లో 29 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లోని 150 ప్రదేశాలకు చేరువయ్యామని చెప్పారు. ఈ కార్యక్రమాల ద్వారా 7,300 పైగా వ్యక్తుల జీవితాలు ప్రభావితమయ్యాయన్నారు. ఈ ప్రయత్నాలన్ని ‘దేశానికి అగ్రస్థానం’ అనే ఇండియన్ ఆయిల్ సిద్ధాంతాన్ని ప్రతిధ్వనింప చేస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమాలే కాకుండా ‘ఉమీద్ ఏ హోప్’ ద్వారా పరివర్తన తెస్తున్నామన్నారు. జైలు శాఖ సహకారంతో ప్రస్తుత, ఒకప్పటి ఖైదీలతో ఇంధన స్టేషన్లను ఏర్పాటు చేశామన్నారు. న్యూఢిల్లీలోని ఒకానొక ఇండియన్ ఆయిల్ ఫ్యూయల్ స్టేషన్లో గత సంవత్సరం మొట్టమొదటి తీహార్ జైల్ స్టోర్ (టిజె) ప్రారంభించడమనేది అట్టడుగు వర్గాలను ప్రధాన స్రవంతిలోకి తీసుకురావడంలో ఒక మైలురాయిగా నిలిచిందన్నారు. ఆజాద్ కా మహోత్సవ్ పేరుతో దేశ 75వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా ఆగస్ట్ 15, 2021న ఈ పరివర్తన్ ప్రిజన్ టూ ప్రైడ్ కార్యక్రమం ప్రారంభించారని తెలిపారు. ఈ కార్యక్రమంతో 29 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లోని 192 ప్రదేశాల్లోని 8950 మంది ఖైదీలు, కరెక్షన్ హోమ్స్‌లోని పిల్లలకు పది క్రీడల్లో శిక్షణ అందించడం ద్వారా సాధికారత కల్పించనున్నామన్నారు. ఇండియన్ ఆయిల్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలన్ని సామాజిక ప్రభావంతో పాటు ప్రపంచ స్థాయి గుర్తింపు సాధించాయన్నారు. 2024లో ఎఫ్ఐడిఈ నిర్వహించిన 4వ ఇంటర్ కాంటినెంటల్ ఆన్‌లైన్ చెస్ పోటీలో భోపాల్ కరెక్షనల్ హోమ్‌కు చెందిన ఖైదీలు స్వర్ణ పతకం, ఏలూరు కరెక్షనల్ హోమ్ ఖైదీలు కాంస్య పథకం గెలుచుకున్నారని వివరించారు.



## ఇవిఎం గోడౌన్‌ను పరిశీలించిన కలెక్టర్

**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి :** ప్రతినెల ఎన్నికల నియమావళి ప్రకారం ఎన్నికల కమీషన్ ఆదేశాలమేరకు గుర్తింపుపొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు అధికారులతో కలిసి ఇవిఎంలను భద్రపర్చిన గౌడౌన్‌ను జిల్లా కలెక్టర్ బదావత్‌సంతోష్ శనివారం ఇవిఎం గోదాంలో ఉన్న ఇవిఎంల స్ట్రాంగ్‌రూమ్‌దగ్గర పూర్తిభద్రత, పోలీసు బందోబస్తు వీటన్నింటిని పరిశీలించారు. చుట్టూ పరిసరాలను పరిశీలించి అక్కడున్న సిబ్బందికి తగు సూచనలు చేశారు. తాగునీరు మౌలిక వసతులు ఏర్పాటుచేయాలని సిబ్బందికి ఆదేశించారు. రిజిస్టర్‌లను తనిఖీచేసి రిజిస్టర్‌లో సంతకాలుచేశారు. కలెక్టర్‌వెంట డిప్యూటి డిఇ అరుణరెడ్డి, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు రవికుమార్, ఎలక్షన్ డిటిరఘు, గుర్తింపుపొందిన వివిధ రాజకీయ పార్టీలప్రతినిధులు శ్రీనివాసులు, హుస్సేన్, బాలకృష్ణ, వెంకటయ్య, రామకృష్ణ ఉన్నారు.



## సిసిరోడ్డు పనులు ప్రారంభం

**ప్రజాపక్షం/కల్వకుర్తి :** పట్టణంలోని 11వవార్డులో ఎమ్మెల్యే కసిరెడ్డినారాయణరెడ్డి సహకారంతో మాజీసర్పంచ్ ఆనంద్‌కుమార్ పట్టణ అధ్యక్షులు శ్రీకాంత్‌రెడ్డిలతోకలిసి విద్యానగర్‌కాలనీలో సిసిరోడ్డు ప్రారంభించడం జరిగిందని కాంగ్రెస్‌పార్టీ నాయకులు పాండురంగారెడ్డి తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌పార్టీ నాయకులు రామకృష్ణ, కాలనీవాసులు ఉన్నారు.

## వన్యప్రాణి సంరక్షణ దినోత్సవం

**ప్రజాపక్షం/అచ్చంపేట :** నల్లమల అడవిప్రాంతంలోని మన్ననూరులో వన్యప్రాణి సంరక్షణ దినోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమానికి ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ హాజరై ఆయన మాట్లాడుతూ వన్యప్రాణులను సంరక్షించుకోవడం మనందరి బాధ్యత కావున ప్రజలందరూ వన్యప్రాణులకు హాని కలిగించకూడదన్నారు. అడవుల సంరక్షణయే ధ్యేయంగా వన్యప్రాణి సంరక్షణ విభాగం పనిచేస్తుందన్నారు. ప్రపంచ వన్యప్రాణి సంరక్షణ దినోత్సవం సందర్భంగా తాను భాగంపంచుకోవడం సంతోషంగా ఉందన్నారు. ఐసిసిఎస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అటవీశాఖకు డ్రోజర్స్ అందించారు. కార్యక్రమంలో అటవీశాఖ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## మురుగునీటి సమీపంలో ఆశ్రమపాఠశాల

**ప్రజాపక్షం/అచ్చంపేట :** నల్లమల అడవిలో పదర మండలం ఉడిమిల్లలో ఉన్న ఆశ్రమపాఠశాల మురుగునీటితో నిండిపోయింది. ఎప్పటినుంచో మురుగునీరు నిల్వ ఉండటంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. శనివారం ఆశ్రమ పాఠశాలను స్థానిక చెంచునాయకులు సందర్శించి ఆవేదన వ్యక్తంచేశారు. గతంలోనే ఈవిషయంపై సంబంధిత ఉన్నతాధికారులకు ఫిర్యాదుచేయగా మురుగునీరు లేకుండా శాశ్వత చర్యలు పరిష్కరిస్తామని చెప్పి ఇంతవరకు చేయలేదన్నారు. ఇందుకోసం ఇంకుడుగుంతకాని, డ్రైనేజీ నిర్మాణం చేయాలని గతంలో మన్ననూరు ఐటిడిఎ పిఓ రోహిత్‌గోపిడికి డిటిడిఓ ఫిరంగి దృష్టికి చెంచు ఐక్యవేదిక తరపున సమాచారం ఇచ్చామన్నారు. పదిరోజుల్లో చేస్తామనిచెప్పి మూడునెలలైన చర్యలు తీసుకోలేదని వారు ఆరోపించారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోకపోతే త్వరలో ధర్నా చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో చెంచు నాయకులు మల్లిఖార్జున్, చిన్న, అంజయ్య, సోమయ్య పాల్గొన్నారు.

## పిల్లర్‌లో ఇరుక్కున్న విద్యార్థిని తల

**ప్రజాపక్షం/అచ్చంపేట :** అచ్చంపేట మండలం పుల్జాల గ్రామానికిచెందిన ప్రాథమిక పాఠశాలలో సరిత అనే విద్యార్థిని ఆటకువెళ్లి గోడపిల్లర్‌లో తల ఇరికించింది. అది గమనించిన విద్యార్థులు స్థానిక ఉపాధ్యాయుడికి తెలపగా ఉపాధ్యాయుడు ప్రయత్నించగా రాలేదు. దీంతో గ్రామస్తుల సహాయంతో పిల్లర్‌ను ధ్వంసంచేసి అమ్మాయిప్రాణాలు రక్షించారు.

## సిపిఎం జిల్లా మహాసభల పోస్టర్

**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌టౌన్ :** అచ్చంపేట పట్టణంలో జరుగుతున్న సిపిఎం పార్టీ మూడో జిల్లామహాభలను జయప్రదంచేయాలని నాగర్‌కర్నూల్ జిల్లాకేంద్రంలోని మహాసభల వాల్‌పోస్టర్లను శనివారం సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్దన్‌పర్వతాలు, మాజీ ఎంపిటిసి యాదయ్య, మండల ఏరియా కార్యదర్శి పొదిలరామయ్య, మండల కమిటిసభ్యులు అశోక్, సురేష్, డివైఎఫ్ఐ జిల్లా నాయకులు మధు, సిపిఎం నాయకులు వెంకటేష్, కేతేపల్లి సత్యనారాయణ, నర్సింహ్మా, శివశంకర్ విడుదల చేశారు.




పశుసంపద అభివృద్ధికి

## ప్రత్యేకమైన ప్రణాళికలు

### కలెక్టర్ బదావత్‌సంతోష్

**ప్రజాపక్షం/కల్వకుర్తిరూరల్ :** ప్రత్యేకమైన ప్రణాళికలతో పశుసంపద అభివృద్ధికి కృషిచేయాలని జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. శనివారం కల్వకుర్తి పట్టణంలోని భ్రమరాంబిక మల్లిఖార్జున కళాశాలలో ఏర్పాటుచేసిన పివి నరసింహారావు పశువైద్య విశ్వవిద్యాలయం , పశువైద్యకళాశాల రాజేంద్రనగర్ ఆఖరి సంవత్సరం విద్యార్థుల ఎన్ఎస్ఎస్ క్యాంపుముగింపు సమావేశానికి జిల్లాకలెక్టర్ బదావత్‌సంతోష్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈసమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ బివి ఎస్సి ఎహెచ్ కోర్సు పూర్తిచేసుకున్న విద్యార్థులకు శుభాకాంక్షలు తెలియజేశారు. విద్యార్థులు ఇప్పుడు క్షేత్రస్థాయిలో ఎన్ఎస్ఎస్ క్యాంపులో పాల్గొనుటద్వారా ఎంతో అనుభవాన్ని పొందారని, పశుసంపదకు పుట్టిన ఇల్లుఅయినటువంటి నాగర్‌కర్నూల్ జిల్లాలో ఎన్ఎస్ఎస్ క్యాంపు నిర్వహించడం అభినందనీయమన్నారు. విద్యార్థులు పశుసంపద పరిరక్షణకు పటిష్టమైన ప్రణాళికలతో ముందుకురావాలని తెలియజేశారు. ఈప్రాంతంలో ఉన్నటువంటి పశువులలో గోమారుల సమస్యకు పటష్టమైన చర్యలద్వారా నియంత్రించడం జరుగుతుందని తెలియజేశారు. పశువులకు ఖనిజలవణ మిశ్రమాల వినియోగం కొరకు ప్రజల్లో అవగాహన కల్పించాలని తెలియజేశారు. పునరుత్పత్తి సమస్యల పరిష్కారానికి పునరుత్పత్తి చికిత్స శిబిరాలు నిర్వహిస్తామని తెలియజేశారు. కార్యక్రమంలో పశువైద్య కళాశాల ఆసోసియేటెడ్ డాక్టర్ ఉదయ్‌కుమార్, జిల్లాపశువైద్య పశుసంవర్ధక అధికారి డాక్టర్ జివి రమేష్, విజయడైరీ డిడి ధనరాజు, ఎన్ఎస్ఎస్ క్యాంపు ఇంచార్జీ డాక్టర్ వెంకటరమణ, డాక్టర్ కెసిఎస్‌రెడ్డి, డాక్టర్ లక్ష్మి , డాక్టర్ విజయ్, డాక్టర్ గోపాల్, పశుసంవర్ధకశాఖ డాక్టర్లు పాల్గొన్నారు.



## పార్లమెంటులో బిసి బిల్లు పెట్టాలి

బిసి సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్ కృష్ణయ్య

**ప్రజాపక్షం/భువనగిరి:** పార్లమెంటులో బిసి బిల్లు పెట్టాలని, దేశ వ్యాప్తంగా కులగణన చేయాలని, పంచాయతీరాజ్ ఎన్నికలలో బిసిలకు 42 శాతం కేటాయించాలని, దేశ వ్యాప్తంగా ఉద్యమం చేపడతామని బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్.కృష్ణయ్య హెచ్చరించారు. భువనగిరి ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్‌లో బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పల్లగొర్ల మోదీరాందేవ్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆర్.కృష్ణయ్య మాట్లాడారు. అన్ని రంగాలలో అభివృద్ధి చెందిన అగ్రకులాలకు ఒకే రోజులో బిల్లు పెట్టి ఆఘమేఘాల మీద 10 శాతం రిజర్వేషన్లు పెట్టారని బిసిలకు చట్ట సభలలో రిజర్వేషన్లు పెట్టాలని 30 సంవత్సరాలుగా పోరాడుతున్న కేంద్ర ప్రభుత్వం పట్టించుకోవడంలేదని విమర్శించారు. ఈ దేశంలో బిసిలను బిచ్చగాళ్ళను చేశారని విమర్శించారు. బిసిలకు రాజ్యాధికారంలో వాటా ఇవ్వకుండ గొర్రెలు, బర్రెలు, పందులు, పెన్షన్లు ఇచ్చి ఓట్లు వేయించుకొని బిసిలను శాశ్వత బిచ్చగాళ్ళను చేస్తున్నారన్నారు. ఈ సమావేశంలో బీసీ సంఘం జాతీయ సంఘం బీసీ కన్వీనర్ గుజ్జ కృష్ణ, వేముల రామకృష్ణ, నందగోపాల్, ఉదయ్, జయంతి, రవి యాదవ్, పుట్టా వీరేష్, గుండెబోయిన సురేష్, వంశీ, జంగయ్య, బాలస్వామి, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

## కమ్యూనిస్టుల పోరాట ఫలితంగానే స్వాతంత్ర్యం : సిపిఐ



**ప్రజాపక్షం/వలిగొండ :** వలిగొండ మండలంలోని నర్సాపురం గ్రామ శాఖ సమావేశం శాఖ కార్యదర్శి నార్కట్పల్లి మచ్చగిరి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా సిపిఐ మండల కార్యదర్శి పోలెపాక యాదయ్య హాజరై మాట్లాడుతూ భారత కమ్యూనిస్టు పార్టీ 100 సంవత్సరాల వసంతోత్సవాలను మండల కేంద్రంలో గ్రామాలలో ఘనంగా నిర్వహించాలని అన్నారు. భారతదేశంలో బ్రిటిష్ సామ్రాజ్యానికి వ్యతిరేకంగా సోషలిస్టు, కమ్యూనిస్టు భావాలను వ్యాప్తి చేసి ప్రజల్ని చైతన్య పరచి భారతదేశానికి స్వతంత్రం కొరకు పోరాటాలు నిర్వహించారని అన్నారు. అదేవిధంగా తెలంగాణ సాయుధ పోరాటంలో కమ్యూనిస్టులు చేసిన త్యాగాలు ఎంతో గొప్పవని అన్నారు. తెలంగాణ మలిదశ ఉద్యమంలో తెలంగాణ రాష్ట్ర సాధన కొరకు మొట్టమొదటిగా భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ అంగీకారం తెలియజేసినదని అన్నారు. పార్టీ బలోపేతానికి సభ్యులందరూ కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు ఎల్లంకి మహేష్, ఏఐవైఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి మహమ్మద్ నయీమ్, శాఖ సభ్యులు వడ్డేపల్లి లక్ష్మమ్మ, కూరెళ్ళ దేవేందర్, యాదయ్య, చందు, తదితరులు పాల్గొన్నారు.

## బిసిలకు ప్రత్యేక మంత్రిత్వశాఖను ఏర్పాటు చేయాలి



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** జనాభాలో సగానికి పైగా ఉన్న బీసీలకు కేంద్రంలో ప్రత్యేక మంత్రిత్వశాఖను ఏర్పాటు చేయాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ ఢిల్లీలో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కు వినతిపత్రం అందచేసి కోరారు. ఈ సందర్భంగా లింగంగౌడ్ మాట్లాడుతూ దేశంలో అనేక సామాజిక వర్గాలకు మంత్రిత్వ శాఖలు ఉన్నాయి కాని బీసీలకు ఎందుకు లేదని ప్రశ్నించారు. ప్రత్యేక మంత్రిత్వ శాఖతోనైనా కులాల సాంఘీక ఆర్థిక అభివృద్ధి జరుగుతుందన్నారు. జనవరి 2025లో జరిగే జనగణనలో బీసీ కులగణన చేయాలని కోరారు. కులగణనతోనే కులాల సామాజిక, ఆర్థిక, రాజకీయ పరిస్థితులు తెలుస్తాయన్నారు. మంత్రిని కలిసిన వారిలో ఈడిగ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## 12 నెలల జీతాలు అందించాలి



**ప్రజాపక్షం/దేవరకొండ:** దేవరకొండ పట్టణంలోని బస్టాండ్ వద్ద తెలంగాణ సమగ్ర శిక్షా ఉద్యోగులు శనివారం నిర్వహించిన రిలే నిరాహార దీక్షకు మాజీ ఎంఎల్ఏ రమావత్ రవీంద్రకుమార్ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ సమగ్ర శిక్షా ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని కోరారు. సమగ్ర ఉద్యోగులకు 12 నెలల జీతాలు అందించాలని, పనికి తగిన వేతనం అందించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగుల సమస్యలపై బిఆర్ఎస్ అసెంబ్లీ సమావేశాలలో ప్రస్తావించనున్నట్లు తెలిపారు. మహిళా ఉద్యోగులకు ప్రసూతి సెలవులు ఇవ్వాలని అన్నారు. ఈకార్యక్రమంలో బిఆర్ఎస్‌వి రాష్ట్ర ఉపాధ్యక్షులు బొడ్డుపల్లి కృష్ణ, రమేష్, జానిబాబు, ఇలియాస్, బాలు, గోవర్ధన్, నజీర్, మధు, జమీర్‌బాబు, సమగ్ర శిక్షా ఉద్యోగుల సంఘం రాష్ట్ర అసోసియేషన్ అధ్యక్షులు క్రాంతి, డివిజన్ అధ్యక్షులు శ్రీను, ప్రధాన కార్యదర్శి విజయ్, శ్రీరాములు, రవి, శ్రీనివాస్, జమీర్, పాండు, రాధ, యాదమ్మ, శ్రీనివాస్, విజయలక్ష్మీ పాల్గొన్నారు.

## స్కూల్ యూనిఫామ్ పంపిణీ

**ప్రజాపక్షం/ఉండవెల్లి:** శ్రీ శిశు సంక్షేమ పరిధిలోని అంగన్వాడీ విద్యార్థులకు పిల్లలకు స్కూల్ యూనిఫామ్ లు ఎమ్మెల్యే విజయుడు చేతుల మీదుగా పంపిణీ కార్యక్రమానికి అధికారులు శ్రీకారం చుట్టారు. శనివారము ఉండవెల్లి మండల పరిధిలోని పుల్లూరు గ్రామంలోని అంగన్వాడీ కేంద్రం విద్యార్థులకు పిల్లలకు యూనిఫామ్ ఇతర పరికరాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విజయుడు మాట్లాడుతూ పిల్లలకు పౌష్టికాహారం లోపం నివారించేందుకు ప్రభుత్వం అన్ని రకాలుగా చర్యలు తీసుకుంటుందని వారు తెలిపారు. ఆహారంతో పాటు విద్యార్థులకు యూనిఫారంలో ఆటలు వస్తువులు సెంటర్లకు ఇవ్వడం జరిగింది.అని తెలిపారు. గర్భిణీలకు కిశోర బాలికలకు బాలింతలు కూడా ప్రభుత్వం పౌష్టికాహారాన్ని ఇస్తుందని వీటిని సద్విని చేసుకొని ఆరోగ్యంగా జీవించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ అధికారి సుజాత సూపర్వైజర్ ఆస్మా మాజీ ఎంపిటిసి సర్పంచులు అంగన్వాడి టీచర్లు వర్కర్స్ ఆయాలు స్థానికులు పాల్గొన్నారు.



# ప్రాజెక్టులను బిఆర్ఎస్ నిర్లక్ష్యం చేసింది

బ్రాహ్మణ వెల్లంల ప్రాజెక్టును సిఎం రేవంత్ రెడ్డి ప్రారంభించడం అభినందనీయం

సిపిఐ జాతీయ సమితి సభ్యులు పల్లా వెంకటరెడ్డి



**ప్రజాపక్షం/సంస్థాన్ నారాయణపురం :** ప్రాజెక్టులను బిఆర్ఎస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని మాజీ ఎమ్మెల్యే సిపిఐ జాతీయ సమితి సభ్యులు పల్లా వెంకటరెడ్డి ఆరోపించారు. నిర్ణీత సమయంలోపు ఎస్ఎల్బీసీ, డిండి లిఫ్టులను పూర్తి చేసే ప్రారంభిస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారని ఆయన గుర్తు చేశారు. శనివారం మునుగోడు నియోజకవర్గంలోని కొన్ని గ్రామాలకు కూడా నీరును అందించే బ్రాహ్మణ వెల్లంల ప్రాజెక్టును ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించడం అభినందనీయమన్నారు. శనివారం యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలోని సిపిఐ పార్టీ కార్యాలయంలో పల్లా వెంకటరెడ్డి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎస్ఎల్బీసీలో రెండు టన్నెల్ ద్వారా నీటిని అందిస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పడం సంతోషకరమన్నారు. రెండు మూడు సంవత్సరాలలోపే కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే పూర్తి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేసిందని, డిండి లిఫ్ట్ డీపీఆర్ తయారుచేసి పూర్తి చేస్తామని కూడా హామీ ఇచ్చిందని అన్నారు. మునుగోడు నియోజకవర్గంలోని కొన్ని గ్రామాలు బ్రాహ్మణ వెల్లంల ప్రాజెక్టు ద్వారా లబ్ది పొందే జాబితా నుండి తొలగించారని వాటిని కూడా కలపాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి విన్నవిస్తామని తెలిపారు. డిసెంబర్ 26న సిపిఐ పార్టీ 100 సంవత్సరాలు పూర్తిచేసుకున్న సందర్భంగా నల్లగొండలో 50 వేల మందితో డిసెంబర్ 30న బహిరంగ సభను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. స్వాతంత్ర పోరాటంలో కమ్యూనిస్టుల పాత్ర ఎనలేనిదని నిర్బంధాలు, జైలు అనుభవించిన వారిలో కమ్యూనిస్టులు ముందు ఉన్నారని అన్నారు. ఎలాంటి చరిత్ర లేని పార్టీ నాయకులు నేడు పోజులు కొడుతున్నారని, దేశ నిర్మాణం భూ పంపిణీలో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం, కమ్యూనిస్టుల పాత్ర అమోఘమైందని గుర్తు చేశారు. సిపిఐ పార్టీ 100 సంవత్సరాల చరిత్రను తెలియజేసేందుకు డిసెంబర్ 30 నుండి సంవత్సరం పాటు కార్యక్రమాలు నిర్వహిస్తామని ఈ బహిరంగ సభకు సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా, జాతీయ నాయకులు సురవరం సుధాకర్ రెడ్డిలు కూడా హాజరవుతారని తెలిపారు. ఈ సమావేశంలో సిపిఐ నాయకులు ఉజ్జిని రత్నాకర్ రావు, అంజాచారి, కే.శ్రీనివాస్, బచ్చనగోనీ గాలయ్య, దుబ్బాక భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# డిండి ఎత్తిపోతల త్వరగా పూర్తి చేయాలి



**ప్రజాపక్షం/డిండి :** దేవరకొండ నియోజకవర్గంలోని ఎస్ఎల్‌బిసి, డిండి ప్రాజెక్టు పనులు వీలైనంత త్వరగా ప్రభుత్వం పూర్తి చేసి ప్రాజెక్టుల పట్ల రైతాంగం పట్ల కాంగ్రెస్ ప్రభుత్వ చిత్తశుద్ధిని చాటాలని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నర్సింహారెడ్డి అన్నారు. శనివారం మండలంలోని కందుకూరు గ్రామ సిపిఐ గ్రామశాఖ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన నర్సింహారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో రైతాంగం ఎదురు చుస్తున్న రైతు భరోసాను వానాకాలం, ఎసంగి రెండు పంటలకు ఒకేసారి ఎసంగి పెట్టుబడిగా ఇవ్వాలని అన్నారు. ఇప్పటికే రైతాంగం ఎసంగి పంటలకు శ్రీకారం చుట్టారని వీలైనంత త్వరగా రైతు భరోసా నిధులు రైతుల ఖాతాల్లో జమ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్రంలో నూతన పెన్షన్‌లకు, రేషన్ కార్డులకు ఆన్‌లైన్ నమోదుకు అవకాశం కల్పించాలని, రేషన్ కార్డులేక ఒకవైపు, నూతన పెన్షన్ కోసం మరోవైపు ప్రజలు ఎదురు చూస్తున్నారని అన్నారు. రైతులకు సబ్సిడిపై ఎరువులు, విత్తనాలు, వ్యవసాయ పరికరాలు, యంత్రాలను ఇవ్వాలని ప్రభుత్వానికి సూచించారు. డిసెంబర్ 30వ తేదిన నల్గొండలో నిర్వహించే సిపిఐ బహిరంగ సభకు పార్టీ శ్రేణులు తరలించాలని తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల కోసం పనిచేయాలని, పార్టీ కార్యక్రమాల్లో పార్టీ కార్యకర్తలు భాగస్వాములు కావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బొడ్డుపల్లి వెంకటరమణ, జిల్లా కౌన్సిల్ సభ్యులు తూం బుచ్చిరెడ్డి, జిల్లా రైతు సంఘం అధ్యక్షులు మైనొద్దిన్, సిపిఐ డిండి మండల కార్యదర్శి కనకాచారి, సహాయ కార్యదర్శి విజేందర్‌రెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం డిండి మండల కార్యదర్శి హుస్సేన్, సిపిఐ గ్రామ శాఖ కార్యదర్శి శ్రీను, బాబా, జమిల్ పాల్గొన్నారు.

# యువజన కాంగ్రెస్ ఎన్నికల్లో దామన్న ప్యానెల్ ఘన విజయం




**ప్రజాపక్షం/సూర్యాపేట:** యువజన కాంగ్రెస్ ఎన్నికల్లో మాజీ మంత్రి, సూర్యాపేట నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జీ రాంరెడ్డి దామోదర్ రెడ్డి ప్యానెల్ సభ్యులు ఘన విజయం సాధించారు. సూర్యాపేట జిల్లా అధ్యక్షుడిగా ఎలిమినేటి అభినయ్, నియోజకవర్గ అధ్యక్షుడిగా కరీంబేగ్, పట్టణ అధ్యక్షుడిగా సాయికృష్ణలు గెలుపొందారు. శనివారం జిల్లా కేంద్రంలోని జిల్లా పార్టీ కార్యాలయంలో యువజన కాంగ్రెస్ ఎన్నికల్లో గెలుపొందిన వారితో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పార్టీ పట్టణ అధ్యక్షులు అంజద్ అలీ, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కక్కిరేణి శ్రీనివాస్‌లు మాట్లాడుతూ జిల్లా అధ్యక్షుడిగా పోటీ చేసిన ఎలిమినేటి అభినయ్ 6440 ఓట్ల మెజార్టీతో ఘన విజయం సాధించారని తెలిపారు. ఇంతటి ఘన విజయానికి సహకరించిన రాష్ట్ర పౌర సరఫరాల, నీటి పారుదల శాఖ మంత్రి ఎన్ ఉత్తమ్ కుమార్ రెడ్డి, మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్ రెడ్డి, కోదాడ ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మవతి, ఎఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తంరెడ్డి, రైతు సంక్షేమ కమిషన్ సభ్యులు, డిసిసి అధ్యక్షులు చెవిటి వెంకన్న యాదవ్, పిసిసి సభ్యులు, పబ్లిక్ క్లబ్ కార్యదర్శి కొప్పుల వేణారెడ్డి, రాష్ట్ర నాయకులు పోతు భాస్కర్‌తో పాటు మాజీ యూత్ కాంగ్రెస్ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. గెలుపొందిన యువజన కాంగ్రెస్ నాయకులను వారు అభినందించారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఎస్‌సిసెల్ వైస్ చైర్మన్ చింతమళ్ళ రమేష్, జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి నాగుల వాసు, రమేష్, మాణిక్యం పాల్గొన్నారు.

# సూర్యాపేట మున్సిపాలిటీలో ‘డబ్బు’ జలగలు?

పైసలు ఇవ్వనిదే ఫైలు కదలదు

ఖాళీ ప్లాట్లకు కూడా ఇంటి నెంబర్లు

సూర్యాపేట మున్సిపాలిటీ రెవెన్యూ విభాగంలో వసూళ్ళ పర్వం



**సూర్యాపేట మున్సిపాలిటి రెవెన్యూ విభాగంలో అవినీతి అక్రమాలకు అంతే లేదు. పైసలు ఇవ్వనిదే ఈ విభాగంలోని పని చేస్తున్న కింది స్థాయి ఉద్యోగుల నుండి అధికా రుల వరకు పని చేయని పరిస్థితి. ఇది ఇలా ఉంటే ఏకంగా ఇళ్లు నిర్మాణం చేపట్టని ఖాళీ ప్లాట్లకు కూడా ఇంటి నెంబర్లు కేటాయిస్తూ వేల రూపా యలు దండుకుంటు న్నారు. ఈ అవినీతి అక్రమాల్లో మున్సిపల్ ఉన్నత స్థాయి అధికా రుల ప్రమేయం ఉన్నట్లు ఆరోపణలు లేకపోలేదు.**

**ప్రజాపక్షం/సూర్యాపేట ప్రతినిధి:** సూర్యాపేట మున్సిపాలిటిలో ప్రభుత్వానికి ఆదాయం వచ్చే ప్రధాన విభాగమైన రెవెన్యూ సెక్షన్ అవినీతి అక్రమాలకు నిలయంగా మారింది. ఇక్కడ పని చేస్తున్న ఉద్యోగులు పైసలు ఇవ్వనిదే ఫైలు ముట్టుకోవడం లేదు. ప్రతి పనికి ఒక రేటు నిర్ణయించి కార్యాలయానికి వచ్చే ప్రజల నుండి ముక్కుపిండి డబ్బులు వసూళ్లు చేస్తున్నారు. ఇందులో ప్రధానంగా మ్యూటేషన్ (ఆస్తిమార్పిడి), ఇంటి నెంబర్ల కేటాయింపు, ఇంటి పన్నుల విధింపు, వసూళ్లు చేయడంలో ఇందులో పని చేస్తున్న ఉద్యోగుల పాత్ర కీలకం. ఈ విభాగంలో రెవెన్యూ ఆఫీసర్ (ఆర్ఓ)తో పాటు మరో ముగ్గురు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు(ఆర్ఐ)లు వీరితో కలిపి మొత్తం 12 మంది ఈ విభాగంలో విధులు నిర్వహిస్తున్నారు. సూర్యాపేట పట్టణంలో 30వేలకు పైగా నివాసాలు ఉన్నాయి. ఈ విభాగంలో పనుల కోసం వచ్చే వారి నుండి పైసలు ముట్టజెప్పనిదే ఫైల్ ముట్టరన్నది అక్షర సత్యం. ఆస్తి మార్పిడికి రూ. వెయ్యి, ఇంటి నెంబర్ కేటాయింపుకు రూ. 2500, ఇంటి నెంబర్ కేటాయించిన తరువాత పన్నులు విధించేందుకు మరో రేటు కట్టి అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారు. భవనాల యజమానులతో ఇంటి పన్నులు లెక్కకట్టేందుకు వెళ్లే అధికారులు మీకు ఇంటి పన్ను తక్కువ వచ్చేలా చూస్తాం... మాకు ఏమిస్తారంటూ బేరసారాలు ఆడి పన్నులు నిర్ణయిస్తున్నారు. వేలల్లో తగ్గిస్తే మాకు ఇంత ఇవ్వాలి... లక్షల్లో తగ్గిస్తే మాకు అంత ఇవ్వాలి అంటూ ప్రభుత్వ ఖజానాకు గండికొట్టి వారి జేబులు నింపుకుంటున్నారు. ఇదే విషయం గత ప్రభుత్వం భువన యాప్‌ను తీసుకవచ్చి ఏజెన్సీ సంస్థల ద్వారా సర్వే చేయిస్తే అనేక అవినీతి అక్రమాలు వెలుగులోకి వచ్చాయి. కొత్తబస్టాండ్ సమీపంలో హైద్రాబాద్ విజయవాడ 65వ జాతీయ రహదారి అండర్ పాస్ సమీపంలోని ఓ వస్త్ర దుకాణ భవన యజమానికి సంబంధించిన బహుళ అంతస్తుకు ఏడాదికి కేవలం రూ. 1.50లక్షలు ఇంటి పన్ను నిర్ణయించగా అనుమానం వచ్చిన ఉన్నతాధికారులు పునఃపరిశీలించాలని ఆదేశించడంతో ఏకంగా రూ. 7.50లక్షలు ఇంటి పన్నులు లెక్క రావడం గమనార్హం. ఇలా సూర్యాపేట పట్టణంలోని బహుళ అంతస్తులు ఉన్న అనేక మంది యజమానులతో ఇలా ఒప్పందాలు చేసుకొని రెవెన్యూ విభాగం ఉద్యోగులు తక్కువ పన్నులు విధించారనే ఆరోపణలు అనేకం ఉన్నాయి. ప్రధానంగా ఆసుపత్రి భవనాలు, షాపింగ్ మాల్స్, విద్యాసంస్థల భవనాలకు సాధారణ పన్నులు విధించి ఉద్యోగులు జేబులు నింపుకున్నారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వం అనుమతులు లేని వెంచర్లలో కొనుగోలు చేసిన ఖాళీ స్థలాలకు రిజిస్ట్రేషన్‌లు నిలివేయడంతో ఇళ్లు నిర్మించుకొని ఇంటి నెంబర్ పొందితే రిజిస్ట్రేషన్ అయ్యే అవకాశాలు ఉండడంతో మున్సిపల్ రెవెన్యూ ఉద్యోగులను అనేక మంది ఆశ్రయిస్తున్నారు. దీంతో ఇంటి నిర్మాణం లేకపోయిన పెద్ద మొత్తంలో డబ్బులు తీసుకొని ఖాళీ స్థలాలకు ఇంటి నెంబర్లు ఇస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో మున్సిపాలిటి పరిధిలోని గాంధీనగర్, కుడకుడ, దురాజ్‌పల్లి, ఎస్వీ ఇంజనీరింగ్ కళాశాల, జనగాం క్రాస్ రోడ్డు, అంజనాపురి, పిల్లమర్రి తదితర ప్రాంతాల్లో ఈ విభాగంలో పని చేస్తున్న అధికారులు ఖాళీ స్థలాలకు ఇంటి నెంబర్లు కేటాయించారు. ఇటీవల కుడకుడ ప్రాంతంలో ఖాళీ స్థలానికి ఇంటి నెంబర్ కేటాయించడంతో అది వెలుగులోకి వచ్చింది. వెనువెంటనే ఆ నెంబర్‌ను రద్దు చేసి కింది స్థాయి ఉద్యోగిని ఆ విధుల నుండి తాత్కాలికంగా పక్కకు పెట్టారు. కీలకమైన అధికారిణికి కేవలం మెమో జారీ చేసి చేతులు దులుపుకున్నారు. ఇలా చెప్పుకుంటుపోతే ఈ విభాగంలో జరిగే అవినీతి అక్రమాలకు అంతే లేదు. వీరు చేసే అక్రమ వసూళ్లలలో పై అధికారులకు కూడా వాటాలు ఉండడంతో నామమాత్రపు చర్యలు తీసుకుంటున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నా యి. ఇప్పటికైన ఉన్నతాధికారులు స్పందించి సూర్యాపేట మున్సిపాలిటిలో కొనసాగుతున్న అవినీతి పర్వంపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



సంస్థాన్ నారాయణపురం మాజీ ఎంపిపి మంచికంటి జనార్ధన్ పార్థివ దేహంపై మాజీ ఎమ్మెల్యేలు పల్లా వెంకటరెడ్డి, ఉజ్జిని యాదగిరిరావులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాజీ ఎంపిపి జనార్ధన్ కుటుంబానికి ప్రగాఢ సానుభూతి సంతాపాన్ని తెలియజేశారు. సిపిఐ నాయకులు ఉజ్జినీ రత్నాకర్ రావు, కె.శ్రీనివాస్, అంజయ్యచారి, బచ్చనగోని గాలయ్య, దుబ్బాక భాస్కర్, రాములు పాల్గొన్నారు. -ప్రజాపక్షం/చౌటుప్పల్

## దేశంలో సిపిఐది ఘనమైన చరిత్ర

సిపిఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు




**ప్రజాపక్షం/తుంగతుర్తి:** భారతదేశంలో సిపిఐకి ఘనమైన చరిత్ర ఉందని పార్టీ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం మండల కేంద్రంలో మండల కౌన్సిలల్ సమావేశాన్ని రామస్వామి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ స్వాతంత్ర సంగ్రామంలో అగ్రభాగాన నిలబడి జైలు జీవితాలు అనుభవించి ప్రాణత్యాగాలు చేసిన పార్టీ సిపిఐదని కొనియాడారు. ఆనాటి నుండి నేటి వరకు ప్రత్యేక తెలంగాణ కోసం పోరాడిన ఘతన పార్టీదన్నారు. ఈనెల 26కు పార్టీ ఆవిర్భావించి 100 సంవత్సరాలు అవుతున్న సందర్భంగా డిసెంబర్ 30న నల్లగొండ ఉమ్మడి జిల్లా భారీ బహిరంగ సభ వేడుకలకు కార్యకర్తలు, అభిమానులు భారీ సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. నేడు మతోన్మాదులు, విచ్చినకార శక్తుల భారీనుండి దేశాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత నేటి తరం యువతపై ఉందని గుర్తు చేశారు. నియోజకవర్గ ఇన్‌చార్జ్, జిల్లా కార్యవర్గ సభ్యులు యల్లంల యాదగిరి, మండల కార్యదర్శి పొల్పాయి పున్నయ్య, మణికంత, వసంత పాల్గొన్నారు.

## విజయోత్సవాలకు విస్తృత ఏర్పాట్లు



**ప్రజాపక్షం/యాదాద్రి :** తెలంగాణ రాష్ట్రంలో ప్రజాపాలన యేడాది పూర్తి అవుతున్న సందర్భంగా ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రజాపాలన ప్రజా విజయోత్సవాలు కార్యక్రమానికి విస్తృత ఏర్పాట్లు పూర్తి చేయడం జరుగుతుందని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంత రావు తెలిపారు. ప్రజా పాలన విజయోత్సవాల్లో భాగంగా ఈ నెల 8వ తేదీన యాదాద్రి భువనగిరి జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో సాయంత్రం 6.00 గంటలకు తెలంగాణ సంగీత నాటక చైర్మన్ అలేఖ్య పుంజల బృందం చే కార్యక్రమాలు అట్టహాసంగా నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో కలెక్టర్ హనుమంతరావు మాట్లాడుతూ తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు ఈ కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు. దీనికి సంబంధించి సన్నాహక ఏర్పాట్లు పూర్తి అవుతున్నాయని అన్నారు. తెలంగాణ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల పైన సంగీత, నాటక అకాడమీ ప్రొఫెసర్ అలేఖ్య పుంజల, బృందం అన్ని జిల్లాలో పర్యటించడం జరిగిందని ఇందులో భాగంగా యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలో రేపు సాయంత్రం 6 గంటలకు ప్రొఫెసర్ అలేఖ్య పుంజల బృందం ప్రజా విజయోత్సవాల కార్యక్రమాన్ని నిర్వహిస్తుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లాలోని ప్రజాప్రతినిధులు, జిల్లా ప్రజలు,పెద్దలు, మీడియా ప్రతినిధులు, అందరు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

## ఎస్ఎస్ కంపెనీ కాలుష్యంపై ఫిర్యాదు

**ప్రజాపక్షం/ఎర్రవల్లి :** ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న ఎస్ఎన్ఎస్ కంపెనీపై చర్యలు శేకుపల్లి, కొండేరు, జింకలపల్లి, శేకుపల్లి, దువాసిపల్లి, వీరాపురం, పూటన్ దొడ్డి, మునగాల, గ్రామాల నుంచి దాదాపు 200 మంది ప్రజలు, మాజీ ప్రజాప్రతినిధులు కలిసి ఎర్రవల్లి మండలం తహసీల్దార్ నరేష్ లిఖితపూర్వకంగా పిర్యాదుచేయడం జరిగింది. తాగేనీటిని, పంటపొలాలను, పీల్చే గాలిని విషపూరితం చేస్తూ జనం శవాలపై సొమ్ములు ఏరుకుంటున్న కంపెనీపై కఠిన చర్య లు తీసుకోవాలని వారు పిర్యాదులో పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణ చట్టాన్ని, నదీజలాల కాలుష్య నియంత్రణ చట్టాన్ని యధేచ్చగా కాలరాస్తున్న ఎస్ఎన్ఎస్ కంపెనీని శాశ్వతంగా మూసివేయాలి వారు కోరారు. శేకుపల్లి మాజీ సర్పంచ్ జి.రవీందర్ రెడ్డి, ఇటిక్యాల మండలం మాజీ ఎంపీపీ భర్త జి. శ్రీధర్ రెడ్డి, బిమేశ్వర్ రెడ్డి, కొం దేరు మాజీ సర్పంచ్ వీరన్న, ఎంపీటీసీ భర్త వీర న్న, సుధాకర్ రెడ్డి, బండి గోవింద్, కాంత రెడ్డి, సంజీవ్ నాయుడు, రవి, ఉప్పరివెంకటన్న, మదిలేటి, కషాపోగు బీచుపల్లి, కుమార్ పాల్గొన్నారు.

## అలంపూర్ నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలి

**ప్రజాపక్షం/ఎర్రవల్లి:** నాగర్ కర్నూల్ పార్లమెంట్ సభ్యుడు డాక్టర్ మల్లు రవి కి స్వాగతం పలికి ప్రజా సమస్యలపై వివరంగా వివరిస్తున్న జోగుల రవి కాంగ్రెస్ అధికారంలోని రావడం సంవత్సరం పూర్తవుతున్న శుభ సందర్భంలో కాంగ్రెస్ చేస్తున్న అభివృద్ధి పనులను చూడలేక ఇంత అభివృద్ధి మా ప్రభుత్వంలో కాలేదు అని ఇఆర్ఎస్ ప్రభుత్వం కాంగ్రెస్ పార్టీపై దుమ్మెత్తి పోవడం సరికాదన్నారు మండిపడ్డారు. అలంపూర్ నియోజకవర్గంలో ఇంతకుముందు అభివృద్ధి జరి గింది. అంటే కాంగ్రెస్ ప్రభుత్వం చేసింది తప్ప బిఆర్ఎస్ ప్రభుత్వం చేసింది ఏమీ లేదన్నారు. అందుకుగాను నాగర్ కర్నూల్ పార్లమెంట్ సభ్యులు డాక్టర్ మల్లు రవి సానుకూలంగా స్పందించి అలంపూర్ నియోజకవర్గం కానీ ఎర్రవల్లి మండల ఆయా పంచాయతీ పరిధిలోని గాని అభివృద్ధి పనులు జరిగేల చూస్తానని హామీ ఇచ్చారు. అలంపూర్ నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు, ఎర్రవల్లి గ్రామ మాజీ సర్పంచ్ రవి, ఉమాపతి నాయుడు, పెద్ద లక్ష్మన్న పాల్గొన్నారు.



## 10న రంగారెడ్డి జిల్లాకు ఎస్‌సి కమిషన్

**ప్రజాపక్షం/రంగారెడ్డి ప్రతినిధి:** ఎస్‌సి వర్గీకరణ కోసం రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఏకసభ్య కమిషన్ డిసెంబర్ 10వ తేదీ విచారణ కమిషన్ డాక్టర్ జెస్టిస్ షమీమ్ అక్తర్ షెడ్యూల్డ్ కులాల ఉప వర్గీకరణపై విచారణాత్మ అదయానం కోసం ఉమ్మడి రంగారెడ్డి జిల్లా (మేడ్చల్ మల్కాజగిరి, వికారాబాద్ ) పరిధిలో బై రంగా విచారణకు ఈ నెల 10న రంగారెడ్డి జిల్లాకు రానున్నట్లు జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి శనివారం ఒక పత్రిక ప్రకటన తెలిపారు. కావున ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలోని ఎస్‌సి కుల సంఘాల నాయుకులు,అధిక సంఖ్యలో బహిరంగ విచారణకు హాజరై తమ వినతులు ఇవ్వాలని కోరారు.10వ తేది ఉదయం 11:00 నుండి 2:00 గంటల వరకు వినతులు స్వీకరిస్తారని కలెక్టర్ పేర్కొన్నారు.

# మహానగరి

## రాజేంద్ర నగర్‌లో '2కె రన్' కార్యక్రమం



**ప్రజాపక్షం/రాజేంద్ర నగర్ :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రజాపాలన విజయోత్సవాల కార్యక్రమంలో భాగంగా ఈనెల 9వ తేదీన తెలంగాణ సెక్రెటేరియట్ యందు జరుగన్ను తెలంగాణ తల్లీ విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరుతూ జిహెచ్ఎంసి చార్మినార్ జోన్ రాజేంద్ర నగర్ 11సర్కిల్‌లో 2కె రన్ కార్యక్రమం జరిగింది.ఈ2కె రన్ కార్యక్రమం రాజేంద్రనగర్ సర్కిల్ కార్యలయం నుంచి ప్రారంభమై డైరీ ఫాం చౌరస్తా నుంచి బుద్వేల్ వద్ద ముగిసింది.

## గ్రంథాలయాలు... ఆధునిక దేవాలయాలు



**ప్రజాపక్షం/షాబాద్:** గ్రంథాలయాలు ఆధునిక దేవాలయాతో సమానంగా భావించి విషయ పరిజ్ఞానాన్ని సంసాదించుకునేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని చేవెళ్ల శాసన సభ్యులు కాలే యాదయ్య సూచించారు. శనివారం షాబాద్ మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన గ్రంథాలయ భవనాన్ని ఎమ్మెల్యే కాలే యాదయ్యతోపాటు గ్రంథాలయ సంస్థ చైర్మర్ ఎల్గంటి మధుసూదన్‌రెడ్డిలతో కలిసి ప్రారంభించారు. అదే విధంగా నాగర్‌కుంట గ్రామానికి చెందిన కాంగ్రెస్ నేత మల్లీ మహేష్ తండ్రి జ్ఞాపకార్థం దైవాలగూడ బస్సు స్టేజీ వద్ద ప్రయాణికులకు ఉపయోగపడే బస్ షెల్టర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాలే యాదయ్య మాట్లాడుతూ గ్రంథాలయాలు ఆధునిక దేవాలయాలతో సమానంగా భావిస్తూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో షాబాద్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కావలి చంద్రశేఖర్, సర్ధానగర్ మార్కెట్ కమిటి చైర్మెన్ సీసర్ సురేందర్‌రెడ్డి, చేవెళ్ల మార్కెట్ కమిటి చైర్మెన్ పెంటయ్య గౌడ్, చేవెళ్ల మండల అధ్యక్షుడు వీరేందర్‌రెడి తదితరులువెంకటయ్యలు పాల్గొన్నారు.

## చెక్కు ఇచ్చి చేతులు దులుపుకుంటే ఊరుకునే ప్రసక్తే లేదు: సబితా



**ప్రజాపక్షం/సరూర్ నగర్:** కాంగ్రెస్ పార్టీ ఎన్నికల హామీలు కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్‌తో పాటు తులం బంగారం ఇస్తానన్న హామీని నిలబెట్టుకోవాలని మాజీ మంత్రి, మహేశ్వరం శాసన సభ్యులు పటోళ్ల సబితా ఇంద్రారెడ్డి అన్నారు. శనివారం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ బాలాపూర్ మండల కార్యాలయంలో 113 కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి కెసిఆర్ హయాంలో పేద ప్రజల కోసం ఎన్నో సంక్షేమ పథకాలు తీసుకొచ్చారని అందులో భాగంగానే కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకం అని తీసుకురావడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో బడంగ్పేట్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ చి గురింత పారిజాత నరసింహారెడ్డి,డిప్యూటీ మేయర్ ఇబ్రహీం శేఖర్, ఎమ్మా ర్వో ఇందిరా దేవి, బడంగ్‌పేట్ మున్సిపల్ కమిషనర్ తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ నిర్మాణాలపై హెచ్‌ఎండిఎ కొరడా



**ప్రజాపక్షం/నార్సింగి:** అక్రమ నిర్మాణపై హెచ్‌ఎండిఎ అధికారులు పోలీసుల బంధవస్తు నడుమ కూల్చివేతలు చేపట్టారు. రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని ఎయిర్పోర్ట్ ర్యాం పక్కనే ఉన్న హెచ్‌ఎండిఎ భూములలో అక్రమ నిర్మాణాలు చేపట్టారని ఫిర్యాదు రావడంతో శనివారం హెచ్‌ఎండిఎ అడిషనల్ కలెక్టర్ షర్మిల ఆధ్వర్యంలో కూల్చివేతలు చేపట్టారు. ఈ సందర్భంగా అక్రమ దారులు అధికారులను అడ్డుకొని ముందే మాకు సమాచారం ఇస్తే తీసేసే వాళ్ళం అని అడ్డుకునే ప్రయత్నం చేశారు. పోలీసులు వారిని చదరగొట్టి అక్రమ నిర్మాణాలను పూర్తిగా కూల్చడం జరిగింది. ఎయిర్పోర్ట్ ఫ్లై ఓవర్ నిర్మించే సమయంలో ర్యాంపు పక్క ఉన్న భూములను హెచ్‌ఎండిఎ అప్పట్లోనే ఆ భూములను ఆధీనంలోకి తీసుకుందని ఆమె తెలిపారు. కానీ కొందరు అక్రమార్కులు ఆ భూముల్లో షెడ్లు నిర్మించార ని అని అన్నారు. కూల్చిన స్థలంలో మళ్లీ నిర్మాణాలను చేపడితే చట్టపరంగా క్రిమినల్ కేసులు పెడతామని ఆమె హెచ్చరించారు.

## అభివృద్ధి పనులు ప్రారంభించిన ఎమ్మెల్యే




**ప్రజాపక్షం/నార్సింగి:** సిఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ అభివృద్ధికి కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ అన్నారు. శనివారం నార్సింగి మునిసిపాలిటీ పరిధిలోని వివిధ వార్డులలో రూ.14.25 కోట్లతో నిర్మించ తలపెట్టిన మహిళా శక్తి క్యాంటీన్ జంక్షన్‌లు,పార్క్,సిసి రోడ్లు, డ్రైనేజీ వంటి అభివృద్ధి పనులను తెలంగాణ అర్బన్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ (టియుఎఫ్ఐడిసి) చైర్మన్ చల్లా నరసింహారెడ్డి, ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ జ్ఞానేశ్వర్ లతో కలిసి ఎంఎల్ఏ ప్రకాష్ గౌడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ మాట్లాడుతూ నియోజకవర్గంలోనే నార్సింగి మున్సిపాలిటీని అభివృద్ధి పథంలో నడిపించడానికి ఎక్కువ నిధులు కేటాయించి అభివృద్ధి పథంలో నడిపిస్తానని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ మైలరం నాగపూర్ణ శ్రీనివాస్ , వైస్ చైర్మన్ గోపాల విజయ్ , కౌన్సిలర్స్ పత్తి ప్రవీణ్ , కె లక్ష్మి ప్రవల్లిక కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## 9న తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ

**ప్రజాపక్షం/రాజేంద్ర నగర్ :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రజా పాలన విజయోత్సవాల కార్యక్రమంలో భాగంగా ఈనెల 9వ తేదీన తెలంగాణ సెక్రెటేరియట్ యందు జరుగన్ను తెలంగాణ తల్లీ విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని బండ్లగూడ జాగీర్ మున్సిఫల్ కార్పొరేషన్ కమీషనర్ బి.శరత్ చంద్ర హిమాయత్ సాగర్ ప్రధాన కార్యలయం లో మున్సిఫల్ సిబ్బందితో సన్నహాక సమావేశం నిర్వహించారు. ఈసమావేశానికి హాజరైన మున్సిఫల్ వార్డు అధికారులు,రిసోర్సు పర్సన్స్(ఆర్‌పి)లతో జరిగిన ఈ సమావేశంలో కమీషనర్ మాట్లాడుతూ....ప్రజా పాలన విజయోత్సవాల్లో భాగంగా ఈనెల 9వ తేదీన జరుగనున్న తెలంగాణ తల్లీ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి బిజెఎంసి నుంచి మహిళల్ని బాగాస్వామ్యం చేయాలని ఆదేశించారు.ఈకార్యక్రమంలో పలువురు వార్డు ఆఫీసర్లు,ఆర్‌పిలు పాల్గొన్నారు.



# పోలీసులు ప్రజల విశ్వాసం పొందాలి

### డిజిపి డాక్టర్ జితేందర్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** పోలీసులు ప్రజలకు సేవ చేయడంలో నిబద్ధత కలిగి ఉండి ప్రజల విశ్వాసంపొందాలని డిజిపి డాక్టర్ జితేందర్ కోరారు. శనివారం ఆర్‌బివిఆర్‌ఆర్ తెలంగాణ పోలీస్ అకాడమీ (టిజిపిఎ)లో ఎస్‌ఐ శిక్షణ పొందుతున్న 323 మంది ఎస్‌ఐ (ప్రీప్రమోషనల్ ట్రైనీ)లతో జితేందర్ ఇంటరాక్షన్ సమావేశం జరిగినది. ఈ సమావేశములో తెలంగాణ డిజిపి డాక్టర్ జితేందర్ మాట్లాడుతూ ప్రజలకు సేవ చేయడంలో నిబద్ధత కలిగి ఉండి ప్రజల విశ్వాసం పొందాలని కోరారు. ప్రజా సేవ చేయాలనే అభిరుచి కూడా కలిగి ఉండాలన్నారు. ముఖ్యంగా శిక్షణ పొందుతున్న వారిలో ఎక్కువ మంది పదవి విరమణకు దగ్గరగా ఉన్నందున ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. పదవీ విరమణ తర్వాత అర్థవంతమైన లక్ష్యాలపై దృష్టి పెట్టాలని ఆయన వారికి సూచించారు. వారు సేవ చేసే ప్రజల అంచనాలను అందుకోవాలని వారిని ప్రోత్సహించారు. శిక్షణ పొందుతున్న వారిలో జోన్6 (చార్మినార్) నుండి 145 మంది, జోన్ 5 (యాదాద్రి) నుండి 90 మంది, మల్టీజోన్1 మరియు మల్టీజోన్2 ప్రాతినిధ్యం వహిస్తున్నారు. టిజిపిఎ డైరెక్టర్ అభిలాషా బిష్ , మాట్లాడుతూ ప్రీప్రమోషనల్ ట్రైనీల శిక్షణకు అకాడమీ ఆరోగ్యం మరియు నాయకత్వ అభివృద్ధిపై దృష్టి సారించి అత్యాధునిక మౌలిక సదుపాయాలను కల్పించామన్నారు. వీరికి శిక్షణలో స్టేషన్ హౌస్ మేనేజ్మెంట్, సైబర్ క్రైమ్, నాయకత్వం, యోగా, ఫీల్ వ్యూహాలలోని అంశాలను బోధించడం జరుతోందన్నారు. ట్రైనీలకు ఈ శిక్షణ జనవరి 13న ముగుస్తుంది. కార్యక్రమంలో జాయింట్ డైరెక్టర్ మురళీధర్, ఐపిఎస్, డిప్యూటీ డైరెక్టర్లు వెంకటేశ్వర్లు, నర్మద, అకాడమీలోని అసిస్టెంట్ డైరెక్టర్లు, ఫ్యాకల్టీ సభ్యులు, ట్రైనీలు పాల్గొన్నారు.

### సైబర్ షీల్డ్ ల్యాబ్‌ను ప్రారంభించిన డిజిపి..

తెలంగాణ పోలీసు అకాడమీలో అత్యాధునిక సదుపాయాలతో రూపొందించిన సైబర్ షీల్డ్ ల్యాబ్‌ను డిజిపి డాక్టర్ జితేందర్ ప్రారంభించా రు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆధునిక పోలీసింగ్‌లో సాంకేతిక పరిజ్ఞానం యొక్క ప్రాముఖ్యతను నొక్కి చెప్పారు. వారి సామర్థ్యాలను పెంచుకోవడానికి ఈ కొత్త సౌకర్యాన్ని ఉపయోగించుకోవాలని అధికారులను కోరారు. అధునాతన సాధనాలను ఉపయోగించి సైబర్ నేరాలను ఎదుర్కొవడానికి పోలీసు అధికారులను సిద్ధం చేయడానికి ఈ అత్యాధునిక సదుపాయాలు కల్పించారన్నారు. సైబ ర్ షీల్డ్ ల్యాబ్ అభివృద్ధి చెందుతున్న సైబర్ బెదిరింపులను ఎదుర్కోవడంలో అవసరమైన నైపుణ్యాలను అందించడం లక్ష్యంగా సైబర్ షీల్డ్ ల్యాబ్ పనిచేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పోలీసు అకాడమీ డైరెక్టర్ అభిలాషా బిష్, జాయింట్ డైరెక్టర్ డి.మురళీధర్, డిప్యూటీ డైరెక్టర్లు వెంకటేశ్వర్లు, సి.నర్మదతో పాటు అసిస్టెంట్ డైరెక్టర్లు, ఫ్యాకల్టీ సభ్యులు పాల్గొన్నారు.

## జనవరి వరకు ఎస్‌టిపిలు పూర్తి

### ఎస్‌టిపి ప్రాజెక్టుల పనులను సమీక్షించిన జలమండలి ఎం.డి. అశోక్ రెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** రానున్న జనవరి నాటికి కచ్చితంగా సీవరేజ్ ట్రీట్ మెంట్ ప్లాంట్ల(ఎస్‌టిపి) ప్రారంభానికి సిద్ధం చెయ్యాలని నిర్మాణ సంస్థలను జలమండలి ఎండి. అశోక్ రెడ్డి ఆదేశించారు. నిర్మాణంలో ఉన్న ఎస్‌టిపిలను శనివారం ఎస్‌టిపి విభాగం ఉన్నతాధికారులు, నిర్మాణ సంస్థల ప్రతినిధులతో జలమండలి ప్రధాన కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. ఎస్‌టిపిల నిర్మాణానికి సరిపడా కార్మికులు లేకుండా పనులు ఆలస్యం చేస్తున్న నిర్మాణ సంస్థపై ఎండి. అసంతృప్తి వ్యక్తం చేశారు. సరిపడా కార్మికులను ఇఎస్‌టిపిల నిర్మాణానికి కేటాయించాలని సదరు నిర్మాణ సంస్థను ఆదేశించారు. వివిధ దశల్లో పనులు పూర్తి చేయడానికి నిర్దేశించుకున్న గడువులోగా పనులు పూర్తి కాకపోతే జరిమానా విధిస్తామని ఆయన హెచ్చరించారు. ఎస్‌టిపిల నిర్మాణంలోని వివిధ దశల పనులు అవకాశం ఉన్నంత వరకు సమాంతరంగా జరగాలని సూచించారు. రెండు షిఫ్టుల్లో పనులు జరగాలన్నారు. పనులు జరిగేటప్పుడు భద్రత విషయంలో ఏమాత్రం అజాగ్రత్తగా ఉండొద్దన్నారు. కార్మికులు కచ్చితంగా భద్రతా పరికరాలను వినియోగించేలా చూడాలని చెప్పారు.

**వివిధ దశలో 9 ఎస్‌టిపిలు..**

జలమండలి ఎస్‌టిపి ప్రాజెక్టుల్లో నిర్మిస్తున్న వాటిలలో ఇప్పటికే 11 ప్రారంభమయ్యాయి. మరో 9 ఎస్‌టిపిలు నిర్మాణం దశలో ఉన్నాయి. వీటిలో డిసెంబర్‌లో పాలపిట్ట, వెన్నల గడ్డ ఎస్‌టిపిలు, జనవరిలో అంబర్ పేట్, ముల్లకత్వ చెరువు, శివాలయ నగర్, నలగండ్ల, అత్తాపూర్, రెయిన్ బోవిస్తా, రామ చెరువు దగ్గర నిర్మిస్తున్న ఎస్‌టిపి లు ప్రారంభానికి సిద్ధం చెయ్యాలని ఎండి. అశోక్ రెడ్డి ఆదేశించారు. ఈ సమావేశంలో ప్రాజెక్ట్ డైరెక్ట ర్ సుదర్శన్, ఎస్‌టిపి ప్రాజెక్టు సిజిఎం పద్మజ, జిఎంలు, నిర్మాణ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

## 'గొర్రెల కాపరుల అభివృద్ధికి చర్యలు చేపట్టాలి'

**ప్రజాపక్షం/ఖైరతాబాద్:**రాష్ట్ర ప్రభుత్వం గొర్రెల కాపరులపై నిర్లక్ష్యం వీడి, వారి సంక్షేమం, అభివృద్ధికి తక్షణ చర్యలు చేపట్టాలని గొర్రెల కాపరుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు పోచబోయిన శ్రీహరి యాదవ్, ప్రధాన కార్యదర్శి మారం తిరుపతి యాదవ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ గత ఎన్నికల కాంగ్రెస్ మేనిఫెస్టోలో ఇచ్చిన గొర్రెల కాపరులకు రూ.2 లక్షల నగదు బదిలీ హామీని ఎప్పటిలోగా నెరవేరుస్తారో అసెంబ్లీ సమావేశాల వేదికగా ప్రకటించాలని కోరారు. రాష్ట్ర క్యాబినెట్‌లో గొల్ల కురుమలకు చోటు కల్పించాలన్నారు. రాష్ట్ర, జిల్లా నామినేట్ పదవుల్లో తమ జనాభా ప్రాతిపదికన అవకాశం కల్పించాలని కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎన్‌సిడిసి ద్వారా తీసుకున్న సుమారు రూ.100 కోట్ల రుణాలను మాఫీ చేయాలని, రూ.10 వేల కోట్లతో యాదవ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సంఘం ఉపాధ్యక్షులు అయోధ్య యాదవ్, నాయకులు సూర్యనారాయణ యాదవ్, వెంకటయ్య యాదవ్, తదితరులు పాల్గొన్నారు.



## 'స్వాతి ఆర్ట్ క్రియేషన్స్ గోల్డెన్ స్క్రీన్ టీవీ' అవార్డుల ప్రదానం



**ప్రజాపక్షం/ఖైరతాబాద్ :** టీవీ కళాకారులను ప్రోత్సహిస్తూ స్వాతి ఆర్ట్ క్రియేషన్స్ అధినేత కె.వై.గిరి రాజ్ ఆధ్వర్యంలో 'స్వాతి ఆర్ట్ క్రియేషన్స్ గోల్డెన్ స్క్రీన్ టీవీ అవార్డ్స్ ప్రదానోత్సవం రవీంద్రభారతిలో ఘనంగా నిర్వహించారు. స్వాతి ఆర్ట్ క్రియేషన్స్ 29వ వార్షికోత్సవం సందర్భంగా జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంఎల్ఏ కసిరెడ్డి నారాయణరెడ్డి, మాజీ డిజిపి గోపీనాథ్ రెడ్డి, తెలుగు టీవీ ఫెడరేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు నాగబాల డి. సురేశ్ కుమార్, ప్రముఖ నిర్మాత బిఎస్ రెడ్డి , హైకోర్టు న్యాయవాది ఎం వెంకటేశ్వరి, డా.నాగులవల్లి పద్మిని, శత చిత్ర నిర్మాత తుమ్మలపల్లి రామ సత్యనారాయణ , స్వాతి ఆర్ట్ క్రియేషన్స్ వ్యవస్థాపక అధ్యక్షులు కెవై గిరిరాజు, టీవీ స్టిల్ ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ చిలంకుర్తి శేషు హాజరయ్యారు. ముందుగా ముఖ్య అతిథులు జ్యోతి ప్రజ్వలన చేసి, కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం టివి కళాకారులకు స్వాతి ఆర్ట్ క్రియేషన్స్ గోల్డెన్ స్క్రీన్ టీవీ అవార్డ్స్ ప్రదానం చేశారు. ఈ సందర్భంగా 11 మంది దివ్యాంగులకు రూ.5వేల చొప్పున ఆర్థిక సాయం చేశారు. సమాజానికి ఉపయోగపడే కార్యక్రమాలు చేస్తూ కళాకారులను ప్రోత్సహిస్తున్న గిరిరాజు జీవితం ఆదర్శనీయమని పలువురు ప్రముఖులు కొనియాడారు. కార్యక్రమంలో కళాకారుల నాట్య ప్రదర్శనలు సభికులను ఆకట్టుకొన్నాయి.

## నెక్లస్ రోడ్‌లో ఫుడ్‌స్టాళ్లను.. ప్రారంభించిన స్పీకర్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ప్రజాపాలన విజయోత్సవాలలో భాగంగా నెక్లెస్ రోడ్‌లో ఏర్పాటు చేసిన ఫుడ్ స్టాళ్లను రాష్ట్ర శాసన సభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ శనివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రవాణా శాఖమంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ సలహాదారులు వేం నరేందర్ రెడ్డి, హర్కర వేణుగోపాల్, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి , మున్సిపల్ ముఖ్యకార్యదర్శి దాన కిషోర్, జిఏడి కార్యదర్శి రఘునందన్, జిఏడి ప్రోటోకాల్ డైరెక్టర్ వెంకట్ రావు పాల్గొన్నారు. పలు పసందైన వంటకాలతో ఫుడ్ స్టాల్స్ సందర్శకులను ఆకట్టుకుంటున్నాయి. నగరంలో ప్రసిద్ధి చెందిన పలు బ్రాండెడ్ హోటల్స్ ఈ ఫుడ్ స్టాళ్ళ కౌంటర్స్ ఏర్పాటు చేశాయి. అనంతరం వారు సాంస్కృతిక కార్యక్రమాలు తిలకించారు.

## వెలమలని ఉద్దేశించి తప్పగా మాట్లాడలేదు : వీర్లపల్లి



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** వెలమలని ఉద్దేశించి అలా మాట్లాడలేదని.. తప్పుగా భావిస్తే నా మాటలను ఉపసంహరించుకుంటున్నానని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ వివరించారు. శనివారం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో మీడియా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ నియంతృత్వ ధోరణి అవలంభిస్తున్న మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్, కెటిఆర్, హరిష్‌రావులను విమర్శించానే తప్పా వెలమలను ఉద్దేశించి అలా మాట్లాడలేదని, నేడు మాట్లాడిన మాటలను ఉప సంహరించుకుంటున్నానని వివరించారు. నేను ఒక శాసన సభ్యుడిగా అన్ని వర్గాల ప్రజలను గౌరవిస్తానని, ఏ ఒక్క వర్గాన్ని విమర్శించనని పేర్కొన్నారు. తాను మాట్లాడిన మాటలను వెనుక ముందు కత్తిరించి కొన్ని మాటాలను మాత్రమే వివాదాస్పదంగా మార్చి కొంతమంది సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేశారని స్పష్టం చేశారు.గత పదేళ్ళుగా నియంతృత్వ ధోరణి అవలంభించిన కల్వకుంట్ల కుటుంబం గురించి ఉద్దేశించి మాట్లాడానే తప్పా వెలమ సమాజంపై తనకు ఎలాంటి తప్పుడు అభిప్రాయం లేదని క్లారిటి ఇచ్చారు.

**యువజన కాంగ్రెస్ బలోపేతం కోసం కృషి చేస్తా**

యువజన కాంగ్రెస్ బలోపేతం కోసం నిరంతరం కృషి చేయనున్నట్లు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మెన్ వీర్లపల్లి శంకర్ వివరించారు. శనివారం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో నూతనంగా ఎన్నికైన యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అందె మోహన్ ముదిరాజ్‌తోపాటు షాద్‌నగర్ అసెంబ్లీ అధ్యక్షుడు రాజేష్ గౌడ్, వివిధ మండలాల అధ్యక్షులు, పట్టణ అధ్యక్షులను ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. కాగా మున్సిపల్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం అన్ని విధా ల చర్యలు తీసుకుంటుందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ వివరించారు. శనివారం క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేకు మున్సిపల్ కార్మికులు సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మున్సిపాటిలో కాంట్రాక్టు పద్దతిలో పని చేస్తున్న కార్మికులకు ఎల్లప్పుడు అండగా ఉంటామని, పారిశుద్ధ్య కార్మికుల ఉద్యోగాల క్రమబద్ధీకరణ, జీతాల పెంపు, సరైన పని సమయాల నిర్వహణ కోసం చర్యలు తీసుకోవాలని కార్మికులు తమ దృష్టికి తీసుకువచ్చారని, ఈ విషయాలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్ళి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని వివరించారు. అదే విధంగా షాద్‌నగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కొనసాగుతున్న భవన నిర్మాణ పనులను పరిశీలించారు.

## విద్యార్థుల శ్రేయస్సుకు భరోసా : దరిపల్లి



**ప్రజాపక్షం/ చంపాపేట:** ప్రభుత్వ పాఠశాల్లో సరియైన మౌళిక సదుపాయాలు కల్పించి, విద్యార్థుల శ్రేయస్సు కోసం భరోసాగా పనిచేస్తానని జీహెచ్ఎంసీ కాంగ్రెస్ పార్టీ ఫ్లోర్ లీడర్ దరిపల్లి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. లింగోజిగూడ డివిజన్ పరిధి ఎల్బీనగర్ ప్రధాన రహదారి చెంతనే ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉండడం వలన ప్రమాదాలు చోటు చేసుకుంటుడంతో, ఇటీవలే ఆయన పాఠశాలను పరిశీలించి వెంటనే పాఠశాల వెనుక వైపున రాకపోకలు సాగించే విధంగా ప్రధాన గేటు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. శనివారం రాజశేఖర్‌రెడ్డి విద్యార్థులు ఉపాధ్యాయులతో కలిసి ప్రధాన గేటును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రభుత్వ పాఠశాల్లో చదివే పేద మధ్యతరగతి విద్యార్థులకు విద్యాబుద్దులను నేర్పిస్తే, సమాజం అభివృద్ధి దిశగా పయనిస్తుందని అన్నారు. పాఠశాల పరిసరాల్లో గుంతలు పూడ్చడం, ప్యాచ్ వర్కు పనులు సైతం చేపట్టడం జరిగిందని అన్నారు. నిధులు మంజూరు చేసినందుకు జోనల్ కమీషనర్ హేమంత్ పాటిల్‌కు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు గోపాల్‌రెడ్డి, కృష్ణరెడ్డి, శ్రీనివాస్, శ్రీధర్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

## సిఎం రిలీఫ్ ఫండ్ ఎంతో మంది పేదలకు లబ్ధి

### ఎంఎల్ఎ దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి



**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్ :** సిఎం రిలీఫ్ ఫండ్ ఎంతో మంది పేదలకు లబ్ధి చేకురుతుందని ఎల్‌బి నగర్ నియోజకవర్గ శాసన సభ్యులు దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. శనివారం హస్తినాపురం డివిజన్ ఇంద్రప్రస్త కాలనీకు చెందిన బాధితురాలు ధనమ్మ అనారోగ్యం పట్ల ఆమె కుటుంబ సభ్యులకు 2 లక్షల ఎల్.ఓ.సీ అందచేశారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ పేదల ఆరోగ్య పరిరక్షణకు సీ.యం సహాయనిధి దోహదపడుతుదన్నారు. ఈ పథకం పేదలకు ఓ వరం లాంటిది అని ఆయన పేర్కొన్నారు. పేద ప్రజలకు నాణ్యతమైన అధునాతన వైద్య సేవలను పొందేందుకు సిఎం సహాయనిధి అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో రవి ముదిరాజ్, చంద్రశేఖర్‌రెడ్డి, ప్రవీణ్ కుమార్, సూరంపల్లి యాదయ్య తదితరులు ఉన్నారు.

## ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను కలిసిన ఎండి ముస్తాఫా



**ప్రజాపక్షం/ఫరూక్‌నగర్:** నిజామాబాద్ ఎమ్మెల్సీ, భారత జాగృతి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితను శనివారం మర్యాదపూర్వకంగా నియోజకవర్గ జాగృతి సీనియర్ నాయకులు ఎండి ముస్తాఫా కలిశారు. రానున్న రోజుల్లో తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా జాగృతిని బలోపేతం చేసేందుకు కార్యకర్తలు ప్రణాళిక బద్ధంగా పని చేయాలని సూచించారు. జాగృతి ఆధ్వర్యంలో అనేక కార్యక్రమాలను నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నామని, ఇందుకు ప్రజలందరు సంపూర్ణ మద్దతు తెలపాలని కోరారు. అనేక రకాల సమస్యలపై ఉద్యమాలు చేసేందుకు సిద్ధంగా ఉండాలని జాగృతి నేతలకు సూచించారు.

## ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలు ప్రజలకు అందజేయడమే లక్ష్యం

### మాదాపూర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు డి.నాగేష్ నాయక్



**ప్రజాపక్షం/శేరిలింగంపల్లి :** శేరిలింగంపల్లి నియోజకవర్గం మాదాపూర్ డివిజన్ 107 కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొద్ది రోజుల క్రితం సురేష్ నాయక్ అకాల మరణంతో మాదాపూర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ మంచి నాయకుడినీ వదులుకుందని గుర్తు చేస్తూ. ఎంబిసి చైర్మన్ జేరిపాటి జైపాల్ రెడ్డి, నాగేష్ నాయక్, రఘునందన్ రావు సురేష్ నాయక్‌కి నివాళులు అర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ అనుకోకుండా సురేష్ నాయక్ అకాల మరణం కాంగ్రెస్ పారీకి తీరనిలోటని గత 30 సంవత్సరాలుగా పార్టీకి ఎంతో కృషి చేశారని తెలిపారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీకి కట్టుబడి సేవ చేసిన ప్రతి కార్యకర్తకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని భావించి సురేష్ నాయక్ తమ్ముడు డి.నాగేష్ నాయక్ గతంలో మాదాపూర్ డివిజన్ నుండి కార్పొరేటర్‌గా కాంటెస్టెడ్ చేసిన అనుభవం వుంది అలాగే ప్రజలతో మమేకం అయ్యే గుణం వారి కుటుంబానికి ఉందని డి.నాగేష్ నాయక్‌కి మాదాపూర్ డివిజన్ కాంగ్రెస్ పార్ట్ అధ్యక్షుడిగా నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఈ నాడు ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో నాగేష్ నాయక్ మట్లాడుతూ.. నాపై నమ్మకంతో పార్టీ గుర్తించి నాకు ఆ పదవి ఇవ్వడం చాలా ఆనందంగా ఉందని అలాగే కాంగ్రెస్ పార్టీకి తప్పకుండా నా వంతు కృషి చేస్తానని తెలిపారు. ఎంబిసి కార్పొరేషన్ చైర్మన్ జేరిపాటీ జైపాల్ ,శేరిలింగంపల్లి కాంగ్రెస్ పార్టీ కోఆర్డినేటర్ రఘునందన్ రావు, స్థానికులు, కార్యకర్తలు సురేష్ నాయక్ అభిమానులు పాల్గొన్నారు.

## సిఎం సహాయనిధి నిరుపేదలకు వరం

### ఇబ్రహింపట్నం శాసన సభ్యులు మల్‌రెడ్డి రంగారెడ్డి

**ప్రజాపక్షం/యాచారం :** ముఖ్యమంత్రి సహయనిధి నిరుపేదలకు కొండంత అండగాఉందని ఇబ్రహింపట్నం శాసన సభ్యులు మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. శనివారం యాచార మండల పరిధిలోని మేడిపల్లి గ్రామానికి చెందిన గడ్డం రాములుకు రెండు లక్షల 50 వేల రూపాయల ఎల్ ఓసి అందజేశారు. ఈ సందర్భంగా ఎంఎల్ఏ మాట్లాడుతూ గడ్డం రాములు అనారోగ్యం రిత్యా అసుపత్రి ఖర్చుల నిమిత్తం కాంగ్రెస్ పార్టీ యాచారం మండల వర్కింగ్ ప్రెసిడేంట్, మాజీ ఎంపిటిసి మోటే శ్రీశైలం సహకారంతో గడ్డం రాములు కుటుంబానికి ఎల్‌ఓసి అందజేసినట్లు తెలిపారు. ఆపద సమయంలో ఎవ్వరు సహయం కోసం వచ్చిన ఎప్పుడు తలుపులు తెరిచే ఉంటాయని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్లప్పుడు ప్రజల పక్షాన నిలబడి పనిచేస్తుందని అన్నా రు. నియోజక వర్గంలోని పేద ప్రజల సమస్యలను పరిష్కరించడానిక తాను ఎప్పుడు ముందుండి పని చేస్తానని అన్నారు. అధికారులు, నాయకులందరు సహకారం అందిస్తే నియోజక వర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో మేడిపల్లి కాంగ్రెస్ పార్టీ నాయకులు బన్నే జంగయ్య, గ్రామ యూత్ అధ్యక్షులు ముంత గణేశ్, గడ్డం శ్రీకాంత్, గడ్డం కుమార్ తదితరులు పాల్గోన్నారు.



# మహానగరి

## జైలు అదాలత్‌లో 45 కేసులు పరిష్కారం

ప్రజాపక్షం/చర్లపల్లి: జైలు అదాలత్‌లతో కేసులు త్వరితగతిన పరిష్కారమవుతాయని అడిషనల్ మెట్రోపాటిటన్ రెండవ మెజిస్ట్రేట్ జె ప్రశాంతి అన్నారు.శనివారం చర్లపల్లి కేంద్ర కారాగారంలో జైల్ అదాలత్ కార్యక్రమంను నిర్వహించారు.మేడ్చల్ మల్కాజ్‌గిరి పరిధి న్యాయస్థానంలో ఉన్న 45 కేసులలో పరిష్కారం చేస్తూ 26 మంది ఖైదీలకు విముక్తి కల్గించారు.ఈ కార్యక్రమంలో జిల్లా 9వ అడిషనల్ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ ఎస్‌ఆర్ దిలీప్‌కుమార్‌నాయక్,జైలు పర్యవేక్షణాధికారి జి రామచంద్రం,ఉప పర్యవేక్షణాధికారులు,జైలర్లు,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## విజయోత్సవాల్లో కార్మికులకు పిపి కిట్లు అందజేత

ప్రజాపక్షం/దమ్మాయిగూడః ప్రజా పాలన విజయోత్సవాలు దమ్మాయిగూడ మున్సిపాలిటీ పరిధిలో ఘనంగా నిర్వహిస్తున్నారు.అందులో భాగంగా శనివారం మున్సిపాలిటీ కార్యాలయం వద్ద మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులు,సిబ్బందికి మున్సిపల్ చైర్మన్ ప్రణీతగౌడ్ ఆధ్వర్యంలో పిపి కిట్లు అందజేశారు.ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ మాదిరెడ్డి నరేందర్‌రెడ్డి,కమిషనర్ నాగమణి,మేనేజర్ వెంకటేశం,మున్సిపల్ సిబ్బంది, నాయకులు తదితరులు పాల్గొన్నారు.




## ఉచిత వైద్య శిబిరాలతో పేద ప్రజలకు మేలు

ప్రజాపక్షం/అల్వాల్ : ఉచిత వైద్య శిబిరాలతో పట్టణ ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షులు చరణ్ రెడ్డి అన్నారు. శనివారం కౌకూర్ బస్ స్టాప్ వద్ద బీజేవైఎం జాతీయ కోశాధికారి అస్సాం ఇంచార్జ్ టీం సాయి వ్యవస్థాపక సభ్యులు పీఎంసాయి ప్రసాద్ నేతృత్వంలో ప్రత్యేక వైద్య బృందంతో వైద్య క్యాంపును నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతంలో కూడా ఆయుష్మాన్ మల్కాజ్గిరి పేరుతో టీం సాయి పలు ప్రదేశాలలో వైద్య శిబిరాలను నిర్వహించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంల బిజెపి సీనియర్ నాయకులు దండుగుల వెంకటేష్,పద్మిని, అజిత్ సాయి, ప్రకాష్ చౌదరి, మల్లికార్జున్ యాదవ్, ఆంథోని రవి కిరణ్, సత్యనారాయణ బాబు, తదితరులు పాల్గొన్నారు.



## లయోలా కళాశాలలో యువజనోత్సవ సంబరాలు

ప్రజాపక్షం/అల్వాల్ : ఆల్వాల్ పట్టణంలోని లయోలా కళాశాలలో రెండు రోజులపాటు యువజనోత్సవ సంబరాలు నిర్వహించారు. కార్యక్రమానికి కేశవ చంద్ర రామావత్ చిత్ర బృందం లవ్ యువర్ ఫాదర్ చిత్ర బృందం ముఖ్య అతిథులుగా హాజరై విద్యార్థిని విద్యార్థులతో కలసి సందడి చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుతం మనం డిజిటల్ సమాజంలో జీవిస్తున్నాం మనం నిత్యం సమాజంలో మారుతున్న పరిణామాలకు దీటుగా విద్యార్థులు జ్ఞానాన్ని పెంచుకుంటూనే తమలో దాగివున కలలను బయటికి తీయాలని అమూల్యమైన జీవితాన్ని ఆనందంగా గడపాలన్నారు. అనంతరం విద్యార్థులు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ ఫ్రాన్సిస్ జేవియర్, ప్రిన్సిపాల్ ఎన్‌బి బాబు, వైస్ ప్రిన్సిపాల్స్ ఫాదర్ అరుల్ జ్యోతి, డాక్టర్ జోసఫ్ కుమార్, ఫాదర్ ప్రభు, కళాశాల విద్యార్థి విభాగ కోఆర్డినేటర్ శరత్ చంద్ర, అధ్యాపకులు, అధ్యాపాకేతరులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## కీసరలో గంజాయి పట్టివేత.. నిందితులు అరెస్టు




ప్రజాపక్షం/నాగారంః గంజాయిని విక్రయిస్తున్న వ్యక్తులను అరెస్టు చేసిన సంఘటన కీసర పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సిఐ వెంకటయ్య తెలిపిన వివరాల ప్రకారం పిఎస్ పరిధిలోని భోగారం హోలీ మేరీ కాలేజ్ వద్ద గంజాయి విక్రయిస్తున్నారని సమాచారం తెలుసుకున్న కీసర పోలీసులు, టిఎస్ఎన్ఏబి అధికారులు అక్కడి కి వెళ్లి ఓడిసాకు చెందిన ఏ1 బిష్ణు ప్రధాన్, ఏ2 సమీర్‌కుమార్‌లు అక్రమంగా గంజాయిని తీసుకువచ్చి 10 గ్రాములు ప్యాకెట్ 600 వందల నుండి 800 వందల రూపాయలకు ఆకుల కిశోర్ అనే వ్యక్తి ద్వారా విక్రయించి డబ్బులు సంపాదిస్తున్నారు. వీరి వద్ద నుండి 1 కేజీ 90 గ్రాములు గంజాయి,మూడు ద్విచక్ర వాహనాలు, సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకుని కీసర పిఎస్‌కు తరలించారు.గంజాయి కోసం వచ్చిన ఉద్దెమర్రికి చెందిన ఏ4 వట్టెల సాయికుమార్,మూడుచింతలపల్లికి చెందిన ఏ5 సినిగల్ల చింటూ, కీసర నందినగర్‌కు చెందిన మద్దం సుందర్,నర్సంపల్లికి చెందిన బండారి సాయికుమార్, అమీర్, తిమ్మాయిపల్లికి చెందిన వినయ్,పరమేశం,బాలుకీసర అమ్ముల కళ్యాణ్, గుంజా రాజేష్, భోగారంకు చెందిన కొమిరి సాంబలకు విక్రయిస్తున్నారు. నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని సిఐ తెలిపారు.

## బ్యాడ్మింటన్‌లో లియోషాకు పతకం



ప్రజాపక్షం/దుండిగల్ : మహారాష్ట్ర జరిగిన నేషనల్ మీట్ బౌరంపేటకు చెందిన కోరుకొండ లియోషా జాతీయ బ్యాట్మెంటన్‌లో విజయం సాధించింది. థానేలో జరిగిన 3వ మినీ (U11) జాతీయ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్ 2024లో పతకాన్ని గెలుచుకుంది. సింగిల్స్ మరియు డబుల్స్ లో గోల్డ్ మెడల్ సాధించి సిక్కి సుమీత్ బ్యాడ్మింటన్ అకాడమీలో ప్రాక్టీస్ కోరుకొండ లియోషా సుమీత్ రెడ్డి కోచ్ వృత్తి పరంగా 2.5 ఏళ్ల నుంచి కష్టపడి సాధన చేస్తుంది. డీపీఎస్ ప్రిన్సిపాల్ గౌరీ సర్కార్ ప్రో వైస్ చైర్మన్ డీపీఎస్ బౌరంపేట గోరంట్ల రమేష్, సిక్కి రెడ్డి, సుమీత్ రెడ్డి, గోపీ చంద్, క్రీడాకారుడిని, తల్లిదండ్రులను అభినందించారు.



## సైబర్ బాధితులు పోగొట్టుకున్న సొమ్ము వాపస్

ప్రజాపక్షం/మల్కాజిగిరి : సైబర్ నేరస్తుల బారిన పడి సొమ్ము పోగొట్టుకొన్న 47 మంది బాధితులకు నేరేడ్‌మెట్ పోలీసులు వారి సొమ్ము రాబట్టి తిరిగి న్యాయస్థానం ద్వారా అందచేసారు. ఇనస్పెక్టర్ సందీప్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం వివిధ రకాలుగా సైబర్ నేరస్తుల మాయమాటలను నమ్మి సొమ్ము పోగొట్టుకొన్న వారి కోసం ప్రత్యేకంగా రూపొందించిన సైబర్ పోర్టల్ ద్వారా కేసులు నమోదు చేసారు. ఈ మేరకు సాంకేతికతను వినియోగించుకొని చేపట్టిన దర్యాప్తు ఫలితంగా ఈ కేసులను దర్యాప్తు చేపట్టిన ఎస్సైలు రమేష్, సైదులు, కానిస్టేబుల్ కాంతయ్య, నాగలతలు నిందితుల నుండి రాబట్టిన సొమ్ము రూ. 3లక్షల 60 వేలు న్యాయస్థానం ద్వారా వారికి అంద చేసేందకు జారీ అయిన కోర్టు ఆదేశాల ప్రతులను ఇనస్పెక్టర్ సందీప్‌కుమార్ శనివారం బాధితులకు అందించార.

## వాగ్దానాలు నెరవేర్చిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

ప్రజా పాలన విజయోత్సవాల్లో మేయర్ తోటకూర అజయ్ యాదవ్



ప్రజాపక్షం/బోడుప్పల్ : మార్పు కావాలంటే.. కాంగ్రెస్ రావాలంటూ..రాష్ట్రంలో అధికారాన్ని చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకిచ్చిన హామీల్లో ఇచ్చిన మాటను ప్రభుత్వం నిలబెట్టుకుందని, కాంగ్రెస్ హయాంలో బోడుప్పల్ ప్రగతి పథంలో ముందుకు పయనిస్తుందని నగర మేయర్ తోటకూర అజయ్ యాదవ్ అన్నారు.

హస్తం పార్టీ అధికారంలోకి వచ్చిఏడాది కావస్తున్న నేపథ్యంలో బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ప్రజాపాలన విజయోత్సవాలపై నగర పార్టీ అధ్యక్షుడు కార్పొరేటర్ పోగుల నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నగర మేయర్ తోటకూర అజయ్ యాదవ్, కార్పొరేటర్లు, పార్టీ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నగర మేయర్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వ అమలు చేస్తున్న ఆరు గ్యారంటీలలో భాగంగా మహాలక్ష్మి, ఇందిరా మహిళాశక్తి, గృహ జ్యోతి, రైతు రుణ మాఫీ (భరోసా), ఇందిరమ్మ ఇళ్లు, యువతకు ఉద్యోగ అవకాశాలు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, స్కిల్ యూనివర్సిటీ, రెసిడెన్షియల్ స్కూల్స్, స్వయం సహాయక సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున మహిళలకు రుణాలు ఇస్తున్నామని ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఈ పథకాన్ని అర్హులై వారు వినియోగించుకోవాలన్నారు. గత నాలుగున్నర సంవత్సరాల లో బోడుప్పల్ కార్పొరేషన్ లో అధికారంలో ఉన్న బిఆర్ఎస్ పాలనలో స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర మంత్రిగా ప్రాతినిథ్యం వహించి రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఎలాంటి నిధులు తీసుకురాలేదన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో నగర మేయర్‌గా తోటకూర అజయ్ యాదవ్ పదవి బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి 35కోట్ల తీర్మానాలు చేసి లింక్ రోడ్లు అయినటువంటి బోడుప్పల్ నుండి ఉప్పల్ డిపో వరకు, బంగారం మైసమ్మ గుడి నుంచి చెంగిచెర్ల వరకు, మల్లన్న గుడి నుంచి మల్లాపూర్ వరకు, అంబేద్కర్ విగ్రహం నుండి చిలకానగర్ వరకు లింక్ రోడ్లను పనులు పూర్తయ్యే లా చేశామన్నారు.

మేడ్చల్ జిల్లా ఇంచార్జి మంత్రి శ్రీధర్ బాబు చొరవతో 20 కోట్లు బోడుప్పల్ కు కేటాయించి అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశామన్నారు. చెరువుల అభివృద్ధి కోసం హెచ్‌ఎండిఏ నుండి 15 కోట్లు మంజూరు చేసి త్వరలో పనులు ప్రారంభించడానికి ముందుకు వెళ్తున్నామన్ని తెలిపారు. హుడా ఆధ్వర్యంలో కార్పొరేషన్‌లోని పలు పార్కులను సుందరీకరణకు ప్రణాళికలకు సిద్ధం చేసి టెండర్లు పెట్టడానికి సన్నాహాలు చేస్తున్నామన్నారు. రాష్ట్ర ప్రభు త్వం నుంచి మేడ్చల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి తోటకూర వజ్రేష్ యాద వ్ ఒకటిన్నర కోట్లతో ప్రత్యేక బడ్జెట్ తీసుకోవచ్చి అభివృద్ధి పనులు చేస్తున్నామన్నారు. త్వరలోనే జరిగే ఇందిరమ్మ ఇండ్లు అర్హులైన లబ్ధిదారులకు అందేలా చూస్తామని అన్నారు.

ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా బి బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిషోర్ గౌడ్, బోడుప్పల్ నగర ప్రధాన కార్యదర్శులు కొత్త ప్రభాకర్ గౌడ్, విశ్వేశ్వర్ గుప్తా, కార్పొరేటర్లు రాసాల వెంకటేష్ యాదవ్, కొత్త చందర్ గౌడ్, చీరాల నర్సింహ్మా, బొమ్మక్ కళ్యాణ్ కుమార్, భూక్య సుమన్ నాయక్, కుంభం కిరణ్ కుమార్ రెడ్డి, సీసా వెంకటేష్ గౌడ్, కో ఆప్షన్ సభ్యులు రంగా బ్రహ్మన్న గౌడ్, నాయకులు హరినాథ్ రెడ్డి, రాపోలు ఉపేందర్, తదితరులు పాల్గొన్నారు.

## గౌతంనగర్‌లో ఆర్‌యుబి నిర్మించాలి

- చీటికిమాటికి రైల్వేగేట్ మూసివేతతో ఇబ్బందులు
- అంబులెన్స్, అగ్నిమాపక దళవాహనాలకూ తప్పని తిప్పలు



ప్రజాపక్షం/మల్కాజిగిరి : అడపా దడపా రైల్వే గేట్ మూసి వేస్తుండటంతో వాహనదార్లు నానా ఇబ్బందులకు గురవుతున్నారు. విద్యాలయాలకు, తమ కార్యాలయాలకు వందలాది మంది తమ వాహనాలపై గౌతంనగర్, నెహ్రూనగర్, మల్లికార్జుననగర్, సాయినగర్, దయానంద్‌నగర్, వాణినగర్,భవానినగర్ తదితర అనేక ప్రాంతాల నుండి మల్కాజిగిరి చౌరాస్తా అనుటెక్స్ వైపు వెళ్లే మార్గంలో భవానినగర్ సమీపాన ఉన్న రైల్వే గేట్ మీదుగా ప్రయాణిస్తుంటారు. ఈ మార్గంలో పాసింజర్, గూడ్స్ రైళ్లు రాకపోకలు చేసే సమయాల్లో పది నుండి పదిహేను నిమిషాల పాటు ప్రతి రోజూ పది సార్లయినా రైల్వే గేట్ వేస్తుండటంతో ఇరువైపులా ఆగిపోయి సమయానికి చేరుకోలేక పోతున్నారు. ఈ రహదారిపై నుండి ఉన్న రైల్వేలైను వెళుతుండటంతో వాహనదారులకు, పాదచారులకు రైళ్ల ప్రమాదాలకు గురి కాకుండా ఉండేందుకు ఈ మార్గంలో రైళ్లు రాక పోకలు చేసే సమయంలో రహదారిపై వెళ్లే వాహనాలను నిలిపి వేసేందుకు దశాబ్దాల కాలం క్రితమే రైల్వే గేట్ ఏర్పాటు చేసి అక్కడ ఉండే రైల్వే సిబ్బంది గేట్ మూసి వేయటం, తెరవటం చేస్తుంటారు. గేట్ మూసేసిన తర్వాత ఒక రైలు వెళ్ళేందుకు కనీసం పది నుండి పదిహేను నిమిషాల సమయం, కొన్ని సందర్భాల్లో ఒకే సారి రెండు రైళ్లు వెళ్లే సందర్భాల్లో అరగంటకు పైగా గేట్ మూసి వేస్తుంటారు. ఇలాంటి సమయంలో రైల్వే లైనుకు ఇరు వైపులా వందకు పైగా ద్విచక్ర, త్రిచక్ర వాహనాలు, కార్లతో పాటు అంబులెన్సు, అగ్నిమాపక దళవాహనాలు మరో ప్రత్యామ్నాయ మార్గం లేకపోవటంతో రైల్వే గేట్ తెరచే వరకు ఆగి పోతుంటాయి. మరో దారిలో వెళ్ళాలంటే నాలుగు కిలోమీటర్లు అదనంగా ప్రయాణించాల్సి ఉంటుందని, ఒక వేళ మధ్యలో ఇరుక్కు పోతే వెనక్కి తిరిగి రావటం అసాధ్యమై గేట్ తెరిచే వరకు వేచి చూడాల్సిన పరిస్థితులు ఎదురవుతాయన్నారు. నిత్యం రద్దీగా ఉండే ఈ ప్రాంతం లో రైల్వే గేట్ సమీపాన ప్రత్యామ్నాయంగా రైల్వే అండర్ బ్రిడ్జి (ఆర్‌యుబి) నిర్మించాలని ఇక్కడి ప్రాంతవాసులు పలు సార్లు ప్రజా ప్రతినిధులకు, రైల్వే అధికారులకు వినతిపత్రాలిచ్చారు. మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు ఈ విషయంలో కృషి చేసినప్పటికి ఇప్పటి వరకు ఫలితం లేక పోవటంతో ఈ కాలనీవాసులందరూ మరో సారి ప్రస్తుత శాసనసభ్యుడు మర్రి రాజశేఖరరెడ్డిని శనివారం కల్సి ఆర్‌యుబి నిర్మాణం చేపట్టి సమస్య పరిష్కరించాలని కోరారు. పలు సందర్భాల్లో ఈ మార్గంలో అంబులెన్స్, అగ్ని మాపక దళవాహనాలు సమయానికి రాలేక పోవటం వల్ల సమస్య తీవ్రంగా మారిన విషయాన్ని వారు తెలిపారు.

## పారదర్శకంగా ఇందిరమ్మ ఇళ్ల సర్వే

జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్



ప్రజాపక్షం/వికారాబాద్ ప్రతినిధిః వికారాబాద్ జిల్లా వ్యాప్తంగా ఇందిరమ్మ ఇళ్లపథకం కింద అర్హులైన లబ్దివారుల గుర్తింపు కోసం జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీలు మున్సిపల్ డివిజన్ ,వర్డుల లో క్షేత్రస్థాయిలో చేపట్టే సర్వే ప్రక్రియను ప్రభు త్వ మార్గదర్శకాలను అనుసరిస్తూ పూర్తి పారదర్శకంగా నిర్వహించాలని అదనపు కలెక్టర లింగ్యానాయక్ అధికారులను అదేశించారు. అర్హులైన లబ్దిదారుల గుర్తింపుకోసం ప్రభుత్వం పూపోందించిన ఇందిరామ్మ ఇళ్ల సర్వే ముబైల్ యాప్ ద్వారా సర్వే నిర్వహించాల్సిన విధానంపై మున్సిపల్ కమిషనర్లు అయా మండలాల,ఎంపిడిఓలు, ఏంపిఓ తహసీల్దార్లుకు అవగాహన సమావేశం నిర్వహించారు. ముబైల్ యాప్‌ను వినియోగిస్తూ క్షేత్రస్థాయిలో సర్వే చేయాల్సిన తీరును వారి సందేహలను నివృత్తి చేశారు. ప్రజాపాలన కార్యక్రమం సందర్భంగా ఇందిరామ్మ ఇళ్ల కోసం దరఖాస్తులు చేసుకున్న వారి ఇళ్లకు వెళ్లి ఏయే అంశాలను పరిశీలించాలి, ముబైల్ యాప్ లో వివరాలను ఈ సందర్భంగా క్షేత్రస్థియిలో సర్వే కోసం ఎంపిక చేసిన గ్రామ పంచాయతీల కార్యదర్శులు,ప్రత్యేక అధికారులను సర్వే మండల లో ప్రత్యేక సమావేశం నిర్వహించాలని అన్నారు. దరఖాస్తుదరుల వివరాలను పక్కాగా సేకరిస్తూ వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా యాప్ లో వివరాలను అప్లోడ్ చేయాలని సూచించారు. ఎలాంటి ఒత్తిళ్లకు తలోగ్గకుండా ప్రభుత్వ మర్గదర్శకాలకు అనుగుణంగా యాప్‌లో వివరాను అప్లోడ్ చేయాలని అన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ సుధీర్, సిరాజుద్దీన్ , హోసింగ్ ఏఈ మహమ్మద్ ఖలీముద్దీన్ తదితరులు పాల్గోన్నారు.



## మృతుని కుటుంబానికి బివిజి ఫౌండేషన్ చేయూత

ప్రజాపక్షం/తాండూరుఃబీవిజీ పౌండేషన్ ద్వారా మరోసారి సేవాభావ్నా చాటుకున్నారు. మృతుని కుటుంబానికి బీవిజీ పౌండేషన్ చైర్మన్ డాక్టర్ సంపత్‌కుమార్ ఆర్థిక సహాయం చేశారు. తాండూరు పట్టణం 7వ వార్డుకు ఎన్‌టిఆర్ కాలనికి చెందిన ఎలక్ట్రీషియన్ బిచ్చల శ్రీనివాస్ మృతి చెందిన విషయాన్ని తెలుసుకున్న బీవిజి పౌండేషన్ చైర్మన్ డాక్టర్ సంపత్‌కుమార్ మృతుని కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేయడంతో పాటు వారి కుటుంబ సభ్యులకు ప్రఘాడ సానుభూతిని తెలియజేశారు.

## గంజాయి తరలిస్తున్న అంతర్రాష్ట్ర ముఠా అరెస్టు

25 కిలోల గంజాయి స్వాధీనం




ప్రజాపక్షం/మేడ్చల్ జిల్లా ప్రతినిధి : కుటుంబం మాదిరి కారులో ప్రయాణిస్తూ ఒరిస్సా రాష్ట్రం నుండి గంజాయి తరలిస్తున్న ఏడుగురు సభ్యుల అంతరాష్ట్ర ముఠాను శామీర్‌పేట పోలీసులు అరెస్టు చేసారు. వీరి నుండి రూ.13 లక్షల విలువైన 25 కిలోల గంజాయి ప్యాకెట్లు, ఒక కారు, రెండు బైకులు, నాలుగు మొబైల్ ఫోన్లను స్వాధీనపరచు కొన్నారు. శనివారం పేట్‌బషీరాబాద్ ఎసిపి రాములు సిఐ శ్రీనాథ్, గంగాధర్, ఎస్‌ఓటి బృందం హారిక, పరశురాం, దశరథ్‌లతో కల్సి ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో తెలిపిన వివరాల ప్రకారం దీని వివరాలిలా ఉన్నాయి. పాత నేరస్తుడైన నగరంలోని ధూల్‌పేట నివాసి అనికేష్‌సింగ్ గతంలో కారాగారంలో ఉన్న సమయం లో రాహుల్ అనే వ్యక్తితో పరిచయమై సులభం గా పెద్ద మొత్తంలో సంపాదించుకొనేందుకు గంజాయిని తీసుకొని వచ్చి అవసరమైన వారికి పెద్ద మొత్తంలో అమ్మి సొమ్ము చేసుకొనేందుకు పథకం రూపొందించుకొన్నారు. దీనిలోని భాగంగా ఒరిస్సా రాష్ట్రంలోని మల్కాన్‌గిరి జిల్లాకు చెంది న మీనాబాయి గంజాయి సరఫరా చేస్తుందని తెల్సుకొన్న అనికేష్‌సింగ్ ముందుగా ఫోన్‌లో సంప్రదించి గంజాయి కొనుగోలు చేసేందుకు ఒప్పందం కుదుర్చుకొన్నారు. ఈ మేరకు పోలీసుల కు అనుమానం రాకుండా నగరానికి గంజాయి తరలించేందుకు గాను మీనాబాయి తనతో పాటు గీత మండల్, గీత రిత మిస్త్రి, ఓ మైనర్ బాలికను తీసుకొని కారులో డ్రైవర్ నయన్ దాస్ తో కుటుంబం వస్తున్న మాదిరి బయలు దేరారు. తమ వెంట 13 కిలోల ఎండు గంజాయి ప్యాకెట్లను సీట్లకింద, కాళ్లు పెట్టుకొనే ప్రదేశంలోని మ్యాట్ కింద పెట్టుకొని బయల్దేరారు. ఈ విషయాన్ని పసిగట్టిన మేడ్చల్ జోన్ ఎస్‌ఓటి, శామీర్‌పేట పోలీసులు తమకందిన విశ్వసనీయ సమాచారం మేరకు శామీర్‌పేట పరిసరాల్లో మాటువేసివారిని అదుపులోకి తీసుకొని అనికేష్‌సింగ్, రాహుల్‌లను సైతం అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించారని ఎసిపి రాము లు తెలిపారు. ఈ ముఠా గత కొద్ది కాలంగా వివిధ ప్రాంతాల్లో గంజాయి అమ్మి సొమ్ము చేసుకొంటున్నారని ఆయన తెలిపారు.



## క్షయ వ్యాధి నివారణలో ఉత్తమ ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ శ్రీదేవి

కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి చేతుల మీదుగా అవార్డు ప్రదానం

ప్రజాపక్షం/మేడ్చల్ జిల్లా ప్రతినిధి : మేడ్చల్ జిల్లాలో క్షయ వ్యాధి నివారణలో తమ విధి నిర్వహణతో అత్యుత్తమ ఫలితాలు సాధించిన జిల్లా ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ శ్రీదేవికి రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ప్రోగ్రామ్ అధికారి అవార్డు దక్కింది. శనివారం ఎర్రగడ్డలోని టిబి ఆస్పత్రిలో రాష్ట్ర క్షయ వ్యాధిపై శిక్షణ మరియు ప్రదర్శన కేంద్రాలకు సంబంధించి జరిగిన సమీక్షా సమావేశంలో కేంద్ర బొగ్గు గనుల మంత్రి కిషన్‌రెడ్డి ఈ అవార్డును అందచేసారు. కేంద్ర మంత్రితో పాటు ఈ సమీక్షా సమావేశంలో తెలంగాణా ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్, ఎండి,ఆర్‌పి కర్ణన్, మేడ్చల్ జిల్లా డిఎంహెచ్‌ఓ రఘునాథస్వామి రాష్ట్రంలోని 33 జిల్లాల క్షయ వ్యాధి నివారణ అధికార్లు పాల్గొన్నారు.

## మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లా యువజన కాంగ్రెస్ కార్యదర్శిగా కొలను బాల్‌రెడ్డి



ప్రజాపాక్షం/ నిజాంపేట్ : మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లా యువజన కాంగ్రెస్ పార్టీ కార్యదర్శిగా కొలను బాల్ రెడ్డి ఎన్నికయ్యారు. ఇటీవల మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లా యూత్ కాంగ్రెస్ ఎన్నికలు ఆన్‌లైన్‌లో జరిగాయి. ఈ ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థుల్లో రంగారెడ్డి జిల్లా పరిషత్ మాజీ చైర్ పర్సన్ పి.సునితా మహేందర్ రెడ్డి ముఖ్య అనుచరుడు, యువ నాయకుడు, బాచుపల్లి గ్రామానికి చెందిన కొలను బాల్‌రెడ్డి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా బాల్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ పటిష్ట తే ధ్యేయంగా ముందుకు సాగుతానని అన్నారు. జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లో యూత్ కాంగ్రెస్‌ని బలోపేతంచేసి పార్టీని మరింతగా ముందుకు తీసుకువెళ్తానని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను నిజమైన నిరుపేద ప్రజలకు అందేవిధంగా ఎప్పటికప్పుడు పాటుపడతానని పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా యూత్ కాంగ్రెస్‌ని బలోపేతం చేసి కాంగ్రెస్ పార్టీని తిరుగులేని శక్తిగా తీర్చిదిద్దేందుకు శ్రమిస్తానని అన్నారు. తన పై నమ్మకంతో తనను జిల్లా కార్యదర్శిగా ఎన్నుకున్న ప్రతిఒక్కరికి కృతజ్ఞతలను తెలిపారు.

## కుత్బుల్లాపూర్‌లో నవోదయ పాఠశాలను నెలకొల్పాలి

సిపిఐ కుత్బుల్లాపూర్ నియోజకవర్గం కార్యదర్శి ఉమా మహేష్



ప్రజాపక్షం/కుత్బుల్లాపూర్ః నవోదయ పాఠశాలను కుత్బుల్లాపూర్‌కు తీసుకరావాలని సిపిఐ కుత్బుల్లాపూర్ నియోజకవర్గం కార్య దర్శి ఉమా మహేష్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రానికి జవహర్ నవోదయ పాఠశాలలను మంజూరు చేయగా అందులో ఒకటి మేడ్చల్ జిల్లాకు కేటాయించారన్నారు. ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు కలిసి నవోదయ పాఠశాలను కుత్బుల్లాపూర్ కు తీసుకవచ్చేందుకు కృషి చేయాలన్నారు. కుత్బుల్లాపూర్ కు మంజూరైన గురుకుల కళాశాల, మెడికల్ కళాశాల లు ఇతర ప్రాంతాలకు తరలిపోయాయన్నారు. ఇక్కడికి తీసుకరావాడానికి ఎటువంటి ప్రయత్నాలు చేయలేదన్నారు. ఇప్పటికైనా అధికార పార్టీ కాంగ్రెస్ నాయకులు , స్థానికయ శాసన సభ్యులు వివేకానంద్‌లు చోరువ తీసుకుని అన్ని రాజకీయ పార్టీలను సీఎం దగ్గరికి తీసుకెళ్ళి మన ప్రాంతానికి మంజూరైన వాటిని మన ప్రాంతానికి వచ్చే లాగా చూడాలన్నారు. సిపిఐ ఆధ్వర్యంలో అన్ని పార్టీలను ఆహ్వానిస్తామని తేదిని ఖరారు చేసి వెళ్దామని సిద్దం కావాలని కోరారు.

## ఏడాది వేడుకల్లో పాటలతో కళాయాత్ర



ప్రజాపక్షం/మేడ్చల్ జిల్లా ప్రతినిధి : తెలంగాణా రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటై ఏడాది పూర్తైన సందర్భంగా జిల్లాలో కొనసాగునతున్న ప్రజా పాలనప్రజా విజయోత్సవాలు2024 భాగంగా శనివారం కళాయాత్ర జరిగింది. తెలంగాణా సాంస్కృతిక సారథి కళాకారుల బృందా లు జిల్లాలోని మేడిపల్లి మండలంలోని ఫిర్జాదిగూడ, మల్కాజిగిరి మండలంలోని అమ్ముగూడ, ఉప్పల్ మండలంలోని ఉప్పల్, రామంతాపూర్, హబ్సిగూడ పాంతాల్లో ప్రభుత్వ సంక్షేమ పథకాలపై పాటలతో ప్రచారం చేసారు.

## తాండూరు దశదిశ మారుస్తా

ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి



ప్రజాపక్షం/తాండూరుః ఎన్నికల ఇచ్చిన మాట ప్రకారం తాండూరు దశ దిశ మార్చడమే తన లక్ష్యమని తాండూరు ఎంఎల్‌ఏ బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. ప్రజాపాలన విజయోత్సవాలలో భాగంగా శనివారం తాండూరు మండల పరిధి అంతారం, దస్తిగిరిపేట్, బాసుపల్లి, మల్కాపూర్, సంగెంకాలన్ తదితర గ్రామాలలో ఎంఎల్‌ఏ పర్యాటించి పలు అభివృద్ధి పనులకు శంఖుస్థాపనలు గావించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఏ ఆయా గ్రామాలలో ఎంఎల్‌ఏ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన ఏడాది పాలనలోనే ఇచ్చిన హామీలను అమలు చేస్తుందన్నారు. పదేళ్ళ అధికారంలో ఉన్న బిఆర్‌ఎస్ నాయకులు అభివృద్ధి కుంటుపడిపోయిందన్నారు. తాండూరు ప్రాంతంలోని రోడ్ల అభివృద్ధికి రూ.400కోట్ల నిధులతో అధిక ప్రాధాన్యతను ఇస్తున్నామన్నారు. పదేళ్ళ బిఆర్‌ఎస్ పాలనలో మాజీ సిఎం కేసిఆర్ డబుల్ బెడ్ రూమ్‌లు ఇస్తామని ఎక్కడ అందించలేక పోయ్యాని, త్వరోలనే అర్హులైన వారికి ఇందిరమ్మ ఇండ్లను అందజేస్తామన్నారు. ఇందిరమ్మ ఇండ్లతో పాటు రేషన్ కార్డులను అందించేందుకు సీఎం రేవంతర్‌రెడ్డి ముందుకు సాగుతున్నారని అన్నారు. ఎన్ని ఇబ్బందులు ఎదురైన రైతులను రాజుగా చేయడానికి రెండు లక్షల రైతు రుణమాఫి,సన్న వడ్లకు రూ.500ల బోనస్‌ను అందజేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో డిసిసిబి వైస్ చైర్మన్ రవిందర్‌గౌడ్,తాండూరు మార్కెట్ కమిటి చైర్మన్ పట్లోళ బాల్‌రెడ్డి,మాజీ మార్కెట్ కమిటి చైర్మన్ వడ్డే శ్రీనివాస్, నాయకులు ఉత్తమ్‌చంద్, నాగప్ప, తదితర నేతలు, అధికారులు పాల్గోన్నారు.



అరుణాంజలి

ఖమ్మం జిల్లా కమ్యూనిస్టు రథసారధిగా వామపక్ష భావజాల కలిగిన
పత్రికల పురోభివృద్ధికి విశేష కృషి చేసిన
కా॥ పోటు ప్రసాద్ గారి అకాల మరణం వామపక్ష ఉద్యమానికి తీరని లోటు
నిరంతరం మా వెన్నుతట్టి ప్రజాపక్షం పత్రికను ప్రోత్సహించిన
మీకు సంస్మరణ వేళ అంజలి ఘటిస్తూ...

అమరజీవి పోటు ప్రసాద్ గారు
సిపిఐ ఖమ్మం జిల్లా కార్యదర్శి

ప్రజాపక్షం ఎడిషన్ యూనిట్-ఖమ్మం

ఏనుగు వెంకటేశ్వరరావు – ఎడిషన్ ఇన్‌చార్జ్
టికె. ప్రసన్నన్ – ఎడివిటి ఇన్‌చార్జ్
పి. సత్యానంద్ – స్టాఫ్ రిపోర్టర్
కె. ప్రసాదరావు – ఆర్‌సి ఇన్‌చార్జ్, ఖమ్మం.
వి. నాగేశ్వరరావు – ఆర్‌సి ఇన్‌చార్జ్, మణుగూరు.
కె. శ్రీనివాస్ – ఆర్‌సి ఇన్‌చార్జ్, మధిర.
బి. అశోక్ – ఆర్‌సి ఇన్‌చార్జ్ పాలేరు.
పి. కృష్ణార్జున్‌రావు – ఆర్‌సి ఇన్‌చార్జ్, వైరా.
కె. శ్రీనివాసరావు – ఆర్‌సి ఇన్‌చార్జ్, అశ్వారావుపేట.
ఎన్. శ్రీకాంత్ – ఆర్‌సి ఇన్‌చార్జ్, సత్తుపల్లి.
జి. వీరన్న – పాల్వంచ
ఎ. ఆంజనేయులు – స్టాఫ్ ఫోటో గ్రాఫర్
పి. రాంబాబు – డెస్క్ ఇన్‌చార్జ్
సిహెచ్. నరేష్ – చింతకాని
వై. నర్సింహారావు – కొణిజర్ల
ఎల్. రాము – కారేపల్లి
యం. ఉపేందర్ – నేలకొండపల్లి
ఎ. కృష్ణప్రసాద్ – జూలూరుపాడు
వి. మధుసూదన్‌రావు – చండ్రుగొండ
ఉల్లి రామారావు – మణుగూరు రూరల్
యం. భార్గవ్ – కూసుమంచి
బి. జోషి – బూర్గంపాడు
యం. గోపినాథ్ – అశ్వాపురం
ఆర్. నాగబాబు – ముదిగొండ
పి. భాస్కర్‌రావు – పెనుబల్లి
పి. రమేష్ – కొత్తగూడెం టౌన్
యం. నాగరాజు – తిరుమలాయపాలెం
ఎస్‌కె. ఇబ్రహీం – కామేపల్లి
పి. రవీంద్రబాబు – చర్ల
భిక్షం – ఆళ్ళపల్లి
కె. పాపయ్యచారి – గుండాల
ఇ. కిషోర్ కుమార్ – అన్నపురెడ్డిపల్లి
లాస్య స్టూడియో – ఖమ్మం
పి. సంపత్ కుమార్ – పాల్వంచ టౌన్
వి. రాంబాబు – కల్లూరు
రామారావు – ఆపరేటర్
ఎ. పవన్ – బోనకల్
బి. ఈశ్వర్‌రావు – ములకలపల్లి
కె. మోహన్‌రావు – దుమ్ముగూడెం
సిహెచ్. ప్రసాద్ – లక్ష్మీదేవిపల్లి


# 12న సింగరేణి కార్మికుల ఖాతాల్లో లాభాల వాటా సొమ్ము

## సిఎండి ఎన్.బలరామ్ వెల్లడి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** సింగరేణి సంస్థలో 2023 24 ఆర్థిక సంవత్సరంలో, ఏప్రిల్ 1, 2024 నుంచి సెప్టెంబరు 30, 2024 మధ్యలో పనిచేసి రిటైర్ అయిన అధికారులు, కార్మికులకు సంబంధించిన లాభాల వాటా సొమ్మును విడుదల చేసేందుకు ఆదేశాలు జారీ చేసినట్లు సంస్థ సిఎండి ఎన్.బలరామ్ తెలిపారు. ఈనెల 12న వారి ఖాతాల్లో బోనస్ సొమ్ము జమ అవుతుందని శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రిటైర్ అయిన 2035 మంది కార్మికులకు లాభాల వాటా కింద మొత్తం 33 కోట్ల రూపాయలను విడుదల చేసినట్లు తెలిపారు. ఈ నెల 12న రిటైర్డు కార్మికుల ఖాతాల్లో జమ చేయడానికి తగు ఏర్పాట్లు చేయాలని ఆర్థిక , సిబ్బంది వ్యవహారాల శాఖ ఉన్నతాధికారులను ఆదేశించారు.


పోరాటయోధుడికి అశ్రునివాళి



జననం : 01-09-1960
మరణం : 27-11-2024

కామ్రేడ్ పోటు ప్రసాద్ గారు
చెమ్మగిల్లిన కళ్ళతో.. చెరగని జ్ఞాపకాలతో..
న్యూవిజన్ విద్యాసంస్థలు, ఖమ్మం.
NEW VISION SCHOOL Wyra Road, Khammam
NEW VISION JUNIOR COLLEGE KHAMMAM



అరుణాంజలి



ప్రజా ఉద్యమాల ఖిల్లా ఖమ్మం జిల్లాలో
విద్యార్థి నాయకునిగా ఎదిగి,
కార్మిక నాయకునిగా కార్మికోద్యమాలకు
నాయకత్వం వహించి,
భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ)
జిల్లా కార్యదర్శిగా బహుముఖ పోరాటాలు నడిపి
సభ్యత్వ పునరుద్ధరణలో అగ్రగామిగా నిలిపి
సిపిఐ శత వసంతాల వేళ
క్యాడర్‌ను కార్యోన్ముఖులను చేస్తూ..
అకాల మరణానికి గురైన
అమరజీవి కా॥ పోటు ప్రసాద్ గారికి
అరుణాంజలి
మీ ఆశయం అజరామరం.. నీ ఆలోచన
సదా అనుసరణీయం
నీ బాటన సాగుతూ... నీ ఆశయసాధనలో...




అమరజీవి పోటు ప్రసాద్ గారు
సిపిఐ ఖమ్మం జిల్లా కార్యదర్శి

భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ)
ఖమ్మం జిల్లా సమితి | భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సమితి



అశ్రునివాళి



అమరజీవి పోటు ప్రసాద్ గారు
సిపిఐ ఖమ్మం జిల్లా కార్యదర్శి

మాకు అత్యంత ఆత్మీయుడు
అభ్యుదయ వాది
భారత కమ్యూనిస్టు పార్టీ
ఖమ్మం జిల్లా కార్యదర్శి
అమరజీవి పోటు ప్రసాద్ గారికి
సంస్మరణ వేళ అశ్రునివాళి...

బత్తినేని చారిటబుల్ ట్రస్ట్ - ఖమ్మం
బత్తినేని ఐటి హబ్ - ఖమ్మం



అశ్రునివాళి



అమరజీవి పోటు ప్రసాద్ గారు
సిపిఐ ఖమ్మం జిల్లా కార్యదర్శి

మా ఆప్తుడు, సన్నిహితుడు
విద్యాభిలాషి
భారత కమ్యూనిస్టు పార్టీ
ఖమ్మం జిల్లా కార్యదర్శి
అమరజీవి పోటు ప్రసాద్ గారికి
సంస్మరణ వేళ వారి
ఆత్మకు శాంతి
చేకూరాలని కోరుకుంటూ...

Sri Chaitanya
INSTITUTE OF TECHNOLOGY & RESEARCH
UGC AUTONOMOUS INSTITUTION
KHAMMAM
ACCREDITED BY NAAC


Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at D.No 1- 6-75, Suravaram Venkataram Reddy Bhavan, Subhashnagar, Mahabubnagar - 509001, Telangana State, RNI TELTEL /2018/76758 **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com